PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 352 | విజయవాడ, గురువారం 25 జులై 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 25 July 2024 | Rs

శాంతించిన గోదావరి

- భద్రాచలం వద్ద తగ్గుముఖం
- ధవళేశ్వరం వద్ద కొనసాగుతున్న 2వ ప్రమాద హెచ్చరిక
- ముంపులోనే లంక గ్రామాలు

3

రేపటినుంచి పారిస్ ఒలింపిక్స్

- నేడు ఆర్చరీలో భారత్ తొలి ప్రదర్శన

8

పార్లమెంట్ ఆవరణలో ఆందోళన చేస్తున్న ఇండియా ఫోరం ఎంపిలు

ఎందుకీ వివక్ష?

- బడ్జెట్‌పై ప్రభుత్వాన్ని నిలదీసిన 'ఇండియా ఫోరం'
- పార్లమెంట్‌లో ఆందోళన
- రాజ్యసభలో వాకౌట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మంగళవారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌పై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. రాష్ట్రాల పట్ల వివక్ష చూపడంపై 'ఇండియా' ఫోరం నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం పార్లమెంటులో వారు ఈ మేరకు నిరసన వ్యక్తం చేశారు. సమావేశం ప్రారంభం కావడానికి ముందు ఇండియా ఫోరం ఎంపిలంతా పార్లమెంట్ ఆవరణలో ఆందోళన నిర్వహించారు. కుర్చీ బచావో బడ్జెట్ ముర్దాబాద్ అన్న నినాదాలతో పార్లమెంటు ఆవరణ మార్మోగింది. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాసి ఉన్న నినాదాలతో కూడిన ప్లకార్డులను ఎంపీలు ప్రదర్శించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, సిపిఎం, సిపిఐ ఎంపీలతో సహా ఇండియా ఫోరం పార్టీల నేతలంతా ఈ నిరసనలో పాల్గొన్నారు. 'ఇది అన్యాయమైన బడ్జెట్, న్యాయం కోసం మేము పోరాడుతాం' అని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు.

లోక్‌సభలో ప్రశ్నోత్తరాలు సమయంలో బడ్జెట్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్ష ఎంపిలు నినాదాలతో హోరెత్తించారు. ఉభయ సభల్లోనూ తీవ్ర గందరగోళం నెలకొంది. రాజ్యసభలో ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేత గౌరవ్ గొగొయ్ మాట్లాడుతూ బడ్జెట్ వివక్షతో కూడుకుందని, దార్శనికత లోపించిందని విమర్శించారు. సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ ఎన్‌డిఎ కీలక భాగస్వామ్య పక్షాలను ప్రసన్నం చేసుకునేందుకు మోడీ సర్కార్ ఆయా రాష్ట్రాలకు బడ్జెట్‌లో ప్యాకేజీలను ప్రకటించిందని, మిగతా రాష్ట్రాలను పట్టించుకోలేదని విమర్శించారు. డబుల్ ఇంజన్ సర్కార్ ఉన్నప్పటికీ యుపిని విస్మరించిందని దుయ్యబట్టారు. రైతుల సంక్షేమంపై ఏమాత్రం దృష్టి సారించలేదని ఆయన విమర్శించారు. ఏ రాష్ట్రానికైనా ప్రత్యేక హోదా, ప్యాకేజీ ఇచ్చేందుకు తాము వ్యతిరేకం కాదని, కానీ వివక్ష చూపడాన్నే తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ప్రధాని మోడీ తమ పార్టీకి ఓటు వేసిన వారి కోసం కూడా పనిచేయడం లేదని, కేవలం తనకు మద్దతిస్తున్న పార్టీల కోసమే పనిచేస్తున్నారని డిఎంకె ఎంపి దయానిధి మిగతా 7లో

రాజధానిలో నిర్మాణాలపై టెక్నికల్ కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర రాజధాని అమరావతి పరిధిలో నిలిచిపోయిన పనులను పరిశీలించి, చేయాల్సిన పనులపై సూచనలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక రంగ నిపుణులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. పబ్లిక్ హెల్త్ ఇంజనీరు ఇన్ ఛీఫ్ ఛైర్మన్‌గా ఉండే ఈ కమిటీలో ఆర్అండ్‌బి, విఎంసి, ఎపిసిపిడిసిఎల్, ఎపిసిఆర్‌డిఏ, ఎడిసిఎల్ చీఫ్ ఇంజనీర్లు సభ్యులుగా ఉండనున్నారు. వీరితోపాటు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నుండి ఒకరిని సభ్యులుగా ఈ కమిటీని ఏర్పాటు చేశారు గతంలో నిలిచిపోయిన పనులను ఎలా ముందుకు తీసుకెళ్లాలనే అంశంపె ఈ కమిటీ సమగ్ర రిపోర్టు తయారు చేయనుంది. ప్రస్తుతం ఉన్న భవనాల నిర్మాణస్థితి గతులు ఎలా ఉన్నాయనే అంశాన్ని వీరు పరిశోధిస్తారు. 2019 తరువాత నిచిలిపోయిన నిర్మాణాల పటిష్టతను ఈ కమిటీ అంచనా వేయనుంది. దీనికోసం ఈ పనిలో అనుభవం ఉన్న సంస్థలనూ వినియోగించుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే రోడ్లు, మంచినీటి పైపులైన్లు, సీవరేజీ, పవర్, ఐసిటితోపాటు చేపట్టిన పనుల పటిష్టతనూ, నాణ్యతనూ ఈ కమిటీ అంచనా వేయనుంది. నిర్మాణ ప్రాంతాల్లో మిగిలిపోయిన పైపులు, సీట్లు, ఇతర మెటీరియల్ ఉపయోగపడుతుందా లేదా ? అనే అంశాలనూ కూడా ఈ కమిటీ పరిశీలిస్తుంది. పనులు చేపట్టడానికి అవసరమైన విధానాలనూ ఈ కమిటీ సూచించనుంది. ఒకవేళ సాధ్యం కాకపోతే ఎలా చేస్తే ఉపయోగపడుతుందనేదీ ఈ కమిటీ పరిశీలించి నెలరోజుల్లో నివేదిక ఇవ్వనుంది. అలాగే పనులకు సంబంధించి కాంట్రాక్టు ఏజెన్సీలు చేసుకునే క్లెయిములపైనా నివేదిక తయారు చేయాలనీ ఉత్తర్వులలో సూచించారు.

మద్యం అక్రమాలపై సిబిసిఐడి విచారణ

- శాసనసభలో సిఎం ప్రకటన
- శ్వేతపత్రం విడుదల
- ఖజానాకు రూ 18,860 కోట్లు నష్టమని వెల్లడి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత ప్రభుత్వ హయంలో చోటుచేసుకున్న మద్యం అక్రమాలపై సిబిసిఐడితో విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. బుధవారం శాసనసమండలిలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మద్యం అక్రమాలపై శ్వేతపత్రాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ మద్యం అక్రమాల కారణంగా రాష్ట్ర ఖజానాకు రూ 18,860.51 కోట్ల నష్టం వాటిల్లిందని చెప్పారు. డిజిటల్ పేమెంట్స్‌కు అవకాశం కల్పించకుండా పెద్దఎత్తున ఆర్థిక అవకతవకలు జరిపారని అన్నారు. 2019కు ముందు మద్యపాన నిషేధం అమలు చేస్తామని, మద్యాన్ని స్టార్ హోటల్స్‌కు మాత్రమే పరిమితం చేస్తామని గత పాలకులు చెప్పారని, అయితే అధికారంలోకి వచ్చిన తరువాత విపరీతంగా అమ్మకాలను పెంచారని చెప్పారు. ఈ మేరకు గణాంకాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఎక్కడో రైల్వేలో వున్న అధికారి వాసుదేవరెడ్డిని తీసుకొచ్చి ఎక్సైజ్ శాఖలో పెట్టుకొని అడ్డగోలు దోపిడీ చేశారన్నారు. రాష్ట్రంలో మద్యం అమ్మగాలు గణనీయంగా పెరిగినా రాష్ట్రానికి వచ్చే ఆదాయం తగ్గిపోయిందన్నారు. మద్యం ఆదాయంలో ఎక్కువ బాగం వైసిపి నేతల జేబుల్లోకి పోయిందని విమర్శించారు. ఐదు టాప్ బ్రాండ్ల కంపెనీలను తరిమేశారని విమర్శించారు. సొంతబ్రాండ్‌లలో నాసిరకం మద్యాన్ని సరఫరా చేసి రాష్ట్రంలో ప్రజారోగ్యంతో చెలగాటం ఆడారన్నారు. ప్రభుత్వంలోని ఇతర శాఖల్లో డబ్బును తీసుకొచ్చి



ఎక్సైజ్ శాఖలో పెట్టుబడి పెట్టించి ఆయా శాఖలకు రూ.250 కోట్ల మేర నష్టం చేశారన్నారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖను పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం వుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అనుసరించిన విధానాలతో రాష్ట్రం 25 ఏళ్లు వెనక్కు పోయిందన్నారు. తమ ప్రభుత్వం పేదలకు అందుబాటు ధరలో మద్యం లభించే విధంగా చూస్తుందని, అదే సమయంలో డి అడిక్షన్ సెంటర్లను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో ఎక్సైజ్‌శాఖను ఏ విధంగా ప్రక్షాళన చేయాలో సభ్యులు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ ఎక్సైజ్‌శాఖ శ్వేతపత్రంలో చెప్పిన దానికంటే ఎక్కువ అక్రమాలే జరిగాయన్నారు. రాష్ట్ర ఖజానాకు రూ 18వేల కోట్లు నష్టం జరిగిందన్నారు. మద్యం కుంభకోణం కారకులను ఖచ్చితంగా శిక్షించాలన్నారు. తప్పు చేసిన వారిని వదిలేస్తే ప్రజాప్రతినిధులకు మాట్లాడే నైతిక హక్కు ఉండదన్నారు. అమరావతికి రూ 15వేల కోట్లు కేంద్రం కేటాయిస్తే ఎంతో సంబరపడ్డామని, అదే ఎక్సైజ్‌శాఖ నుంచి ఖజానాకు రావాల్సిన రూ 18వేల కోట్లు వచ్చుంటే పోలవరం, అమరావతి లాంటి ప్రాజెక్టులు పూర్తయ్యేవని అన్నారు. ప్రజలకు మద్యం వ్యసనాన్ని తగ్గించేలా డి అడిక్షన్ సెంటర్లకు బడ్జెట్ కేటాయించాలన్నారు. ఈ సందర్భంగా బిజెపి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ శ్వేతపత్రంలో ప్రభుత్వం చెప్పిన నష్టం కంటే ఎక్కువ నష్టం జరిగిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన మద్యం విధానంలో రూ 30వేల కోట్ల ప్రజాధనం పక్కదారి పట్టిందని, ఈ విషయంపై సమగ్ర విచారణ చేపట్టాల్సి వుందన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

- జంతర్ మంతర్ వద్ద ధర్నాలో జగన్
- ధర్నాకు ఎస్‌పి, శివసేన, ఆప్, టిఎంసి, అన్నాడిఎంకె తదితర పార్టీల మద్దతు

ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న జగన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలపై దాడులు పెరిగిపోతున్నాయంటూ, దీనికి నిరసనగా బుధవారం నాడిక్కడి జంతర్ మంతర్‌వద్ద వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ భారీ ధర్నా నిర్వహించింది. ఆ పార్టీ నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ ధర్నానుద్దేశించి మాట్లాడుతూ, రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని విమర్శించారు. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో శాంతి భద్రతలు,కుప్పకూలాయని, వైసిపి కార్యకర్తలపై దాడులు పెరిగిపోయాయని విమర్శించారు. దాడుల్లో మరణించిన, గాయపడిన పార్టీ కార్యకర్తల ఫోటోలు, వీడియోలతో ఓ ఎగ్జిబిషన్ గ్యాలరీ ఏర్పాటు చేశారు. ఈ ఆందోళనకు ఇండియా ఫోరమ్‌కు చెందిన అఖిలేష్ యాదవ్, రాంగోపాల్ యాదవ్ (సమాజ్‌వాది పార్టీ), సంజయ్ రౌత్, అరవింద్ సావంత్, ప్రియాంక చతుర్వేది (శివసేన), నదిముల్ హక్ (టిఎంసి), తంబిదొరై (అన్నాడిఎంకె), తిరుమా వలవన్ (విసికె), రాజేంద్రపాల్ గౌతమ్ (ఆప్), అబ్దుల్ వాహబ్, హ్యారిస్ (ఐయుఎంఎల్) తదితరులు మద్దతు తెలిపారు.

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వ అరాచక, ఆటవిక పాలన కొనసాగుతోందన్నారు. హత్యలు, దాడులు, ఆస్తుల విధ్వంసం యథేచ్ఛగా సాగిపోతున్నాయని, వైసిపిని అణగదొక్కడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉందని వైసిపి నేత విమర్శించారు. 560 చోట్లకు పైగా ప్రైవేటు ఆస్తులు, 490 చోట్లకు పైగా ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారని, వెయ్యికి పైగా దౌర్జన్యాలు, దాడులు జరిగాయని, చివరకు పంట తోటలను కూడా ధ్వంసం చేస్తున్నారని అన్నారు. మంత్రి నారా లోకేష్ రెడ్‌బుక్ పేరుతో ఎవరెవరి మీద దాడుల చేయాలి, ఎవరిని ఎలా వేధించాలో చెబుతున్నారని విమర్శించారు.

గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు, ఈ విధంగా ఎన్నడూ చేయలేదని మిగతా 7లో

ఫేక్ ప్రచారమే వైసిపి సిద్ధాంతం

- హోంమంత్రి అనిత

5

ఇకపై ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్శిటీ

- పేరు మార్పు చట్టసవరణకు ఉభయ సభల ఆమోదం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని హెల్త్ యూనివర్శిటీ పేరును డాక్టర్ ఎన్‌టిఆర్ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌గా మారుస్తూ ప్రతిపాదించిన బిల్లును ఉభయ సభలు బుధవారం ఆమోదించాయి. రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ, వైద్య విద్యా శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ బిల్లును ప్రవేశపెట్టారు. వైద్య, దంత, నర్సింగ్, పారా మెడికల్ లాంటి వైద్య ఆరోగ్యశాఖకు చెందిన విద్యాకోర్సులన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావాలన్న మంచి లక్ష్యంతో నాటి ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు దేశంలోనే మొట్టమొదటగా ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయాన్ని స్థాపించారన్నారు. ఎన్‌టిఆర్ మరణానంతరం 1996లో ఈ యూనివర్శిటీకి ఎన్‌టిఆర్ పేరు పెట్టారన్నారు. గత ప్రభుత్వం కేవలం రాజకీయకారణాలతో పేరు మార్చిందని అన్నారు. తిరిగి ఎన్‌టిఆర్ పేరును పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. ఈ బిల్లును శాసనసభ, శాసన మండలి రెండు ఏకగ్రీవంగా ఆమోదించాయి.

మదనపల్లె ఘటనలో విఆర్‌కు సిఐ

- ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెండ్
- అనుమానితులందరినీ విచారిస్తున్నాం : ఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైల్స్ దగ్ధం ఘటనలో అధికారులు చర్యలకు ఉపక్రమించారు. సిఐని విఆర్‌కు ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారు. ప్రమాద ఘటనను వెంటనే డిఎస్‌పి, ఎస్‌పి దృష్టికి తీసుకెళ్లని సిఐ వల్లిబషను విఆర్ (వెకన్సీ రిజర్వు)కు పంపుతూ ఉత్తర్వులు జారీ చేసినట్లు అన్నమయ్య జిల్లా ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు తెలిపారు. అలాగే ప్రమాదం జరిగిన రాత్రి బీట్ సెక్షన్‌లో ఉన్న కానిస్టేబుళ్లు హరిప్రసాద్, భాస్కర్‌లు ఆ ఘటనను ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో నిర్లక్ష్యం వహించినందున సస్పెండ్ చేసినట్లు తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. భవనానికి వైరింగ్ చేసిన ప్రయివేటు వ్యక్తులను కూడా తీసుకొచ్చి సంఘటన ఏ విధంగా జరిగిందన్న కోణంలో కూడా విచారణ చేసినట్లు తెలిపారు. కార్యాలయంలోని సిసి కెమెరా పుటేజీలను సేకరించామని వివరించారు. అనుమానం కలిగిన 30 నుంచి 35 మందిని ఇప్పటికే విచారించామని, విచారణ త్వరలోనే తుది దశకు చేరుకుంటుందని తెలిపారు. ఆరోజు రాత్రి విధుల్లో ఉన్న సీనియర్

అసిస్టెంట్ గౌతమ్ తేజ బీరువాలో ఇంజన్ ఆయిల్ దొరికినట్లు వచ్చిన వార్తలపై విలేకరులు ప్రశ్నించగా అతని బీరువాలో ఇంజన్ ఆయిల్ ఉన్న మాట వాస్తవమేనని అయితే అతను తన ద్విచక్రవాహనాని కి వాడుకునేందుకు తీసుకువచ్చినట్లు చెప్పారన్నారు. కార్యాలయంలో ముఖ్యమైన ఫైళ్లను మాయం చేసి ఆ తరువాత అవి ప్రమాదంలో కాలిపోయినట్లు సృష్టించేందుకు కార్యాలయానికి నిప్పు పెట్టారన్న వదంతులు వినిపిస్తున్నాయని విలేకరులు ప్రశ్నించగా.. అసలు అందులో ఏయే ఫైల్స్ ఉన్నాయి? వాటి ప్రభావం ఎంత? అనేది తెలియాల్సి ఉందన్నారు. కాలుతున్న 700 ఫైల్స్‌ను ఆ శాఖ అధికారులకు అందజేశామని, ఆ ఫైల్స్ యొక్క తీరు, వాటి ప్రభావాన్ని అంచనా వేసిన తరువాతనే ఏ స్థాయిలో నేర తీవ్రత ఉందో నిర్ధారణకు రావచ్చన్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన అగ్నిమాపక శాఖ డైరెక్టర్

ఘటనా స్థలానికి అగ్నిమాపక శాఖ డైరెక్టర్ పి.వి.వెంకటరమణ చేరుకుని పరిశీలించారు. ఆయనతో పాటు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి అనిల్‌కుమార్, మదనపల్లె అధికారి శివప్ప వచ్చారు. ఘటన జరిగిన తీరు, వివిధ అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఖాట్మాండు విమానాశ్రయంలో విమాన ప్రమాద దృశ్యం

నేపాల్‌లో విమానప్రమాదం

- 18 మంది మృతి
- ప్రాణాలతో బయటపడ్డ పైలట్

ఖాట్మాండు : నేపాల్‌లో బుధవారం శౌర్య ఎయిర్‌లైన్స్ విమానం కూలిపోయి 18 మంది దుర్మరణం పాలయ్యారు. ప్రమాదం నుంచి పైలట్ ఒక్కరే ప్రాణాలతో బయటపడ్డాడు. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సభ్యులు ఉన్నారు. బుధవారం ఉదయం 11.11గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. శౌర్య ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఈ విమానం రన్‌వేపై విహారం చేస్తుండగా త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయం తూర్పు వైపున ఉన్న ఓ గోతిలో పడిపోవడంతో .ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. విమానం మొత్తం తగులబడడంతో పైలట్ మినహా . అందులో ప్రయాణిస్తున్న వారంతా చనిపోయారు. గాయపడిన పైలట్‌ను ఖాట్మాండు మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలిని నేపాల్ ప్రధానమంత్రి కెపి శర్మ ఓలి, హోం మంత్రి రమేష్ లేఖ్ సందర్శించారు. దీనిపై దర్యాప్తునకు అయిదుగురు సభ్యులతో ఒక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మృతుల్లో శౌర్య ఎయిర్‌లైన్స్ టెక్నీషియన్ మనురాజ్ శర్మ, అతని నాలుగేళ్ల కుమారుడు అధిరాజ్, భార్య ప్రిజా ఖతివాద అందరూ మరణించారు.

యుపిఐ చెల్లింపుల ప్రోత్సాహకాలకు కోత

న్యూఢిల్లీ : యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యుపిఐ) ద్వారా జరిపే డిజిటల్ చెల్లింపులకు ఇచ్చే ప్రోత్సాహకాలకు కేంద్ర ప్రభుత్వం కోత పెట్టింది. రూపే డెబిట్ కార్డ్‌లు, యుపిఐ ద్వారా చేసే చెల్లింపుల ప్రోత్సాహానికి బడ్జెట్ 2024-25లో కేటాయింపులను రూ.1,441 కోట్లకు తగ్గించింది. ఇంతక్రితం ఫిబ్రవరిలోని మధ్యంతర బడ్జెట్‌లో రూ.3,500 కోట్లను ప్రతిపాదించగా.. తాజాగా సగానికి పైగా కోత పెట్టడం గమనార్హం. 2023-24 బడ్జెట్‌లో రూ.2,485 కోట్లను కేటాయించింది. మధ్యంతర బడ్జెట్ ప్రతిపాదనల్లో భారీగా పెంచి.. తాజాగా తగ్గిచడంతో ఫిన్‌టెక్, బ్యాంకింగ్ పరిశ్రమపై ప్రతికూల ప్రభావం చూపనుందని ఆ రంగం నిపుణులు భావిస్తున్నారు. గడిచిన జూన్ మాసంలో దేశంలో 1380 కోట్ల యుపిఐ లావాదేవీలు నమోదయ్యాయి. విలువ పరంగా మేలో రూ.20.45 లక్షల కోట్ల లావాదేవీలు జరగ్గా.. జూన్‌లో రూ.20.07 లక్షల కోట్లకు తగ్గాయి.

త్వరలో అమరావతికి రైల్వేలైన్

మీడియా సమావేశంలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అమరావతి రైల్వే లైన్ పనులు త్వరలోనే ప్రారంభమయ్యే అవకాశం ఉందని రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. రైల్వేభవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయవాడ -ఎర్రుబాలెం నుండి అమరావతికి కృష్ణనది మీదుగా రూ. 2,047 కోట్లతో 56 కిలో మీటర్ల మేర రైల్వే లైన్ నిర్మాణంకు డిపిఆర్ పూర్తయిందన్నారు. ఈ డిపిఆర్‌కు నీతిఆయోగ్ అనుమతి ఇచ్చిందని, రైల్వే బోర్డు ఆమోదం తెలపగానే అమరావతి రైల్వే లైన్ ప్రాజెక్టు పనులు ప్రారంభమవుతాయని అన్నారు. విశాఖలో సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌కి గతంలో కేటాయించిన భూమికి బాక్ వాటర్ సమస్య ఉందన్నారు. ఈ విషయమై అడిగిన ప్రశ్నకు ఆయన జవాబిస్తూ మరోచోట రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయిస్తే నిర్మాణ పనులు మొదలుపెట్టనున్నట్లు చెప్పారు. తాజా బడ్జెట్‌లో

ఆంధ్రప్రదేశ్ రైల్వే అభివృద్ధికి రూ. 9,151 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో రూ.73,743 కోట్ల విలువైన 41 ప్రాజెక్టులకు సంబంధించి 5,329 కిలో మీటర్ల కొత్త ట్రాక్‌ల పనులు కొనసాగుతున్నాయని అన్నారు. ఏపిలో ఏడాదికి 151 కిలో మీటర్ల కొత్త ట్రాక్‌ల నిర్మాణం, 195 కిలో మీటర్ల ఎలక్ట్రిఫికేషన్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం ఏపిలో 100 శాతం ఎలక్ట్రిఫికేషన్ పూర్తి అయిందని తెలిపారు. అలాగే అమృత్ స్కీంలో 73 స్టేషన్స్ ఆధునీకరించామన్నారు. 2014 నుంచి 743 ఫ్లై ఓవర్లు అండర్ పాస్‌ల నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు . దాదాపు 800 కిలో మీటర్లకు పైగా ఉన్నందున విజయవాడ-ముంబయి మధ్య వందే భారత్ రైల్ సాధ్యం కాదని ఒక ప్రశ్నకు జవాబుగా చెప్పారు.

జిఓల వెబ్‌సైట్ పునరుద్ధరణ

ప్రజాశక్తి - అమరావతి

ప్రభుత్వ జిఓల కోసం ఉద్దేశించిన జిఓఐఆర్ వెబ్‌సైట్‌ను గతంలో మాదిరి యథాతథంగా పునరుద్ధరిస్తామని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసింది. ఇందుకు 4 వారాల సమయం కావాలని ప్రభుత్వం తెలిపింది. దీనిపై విధాన నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సింగమనేని ప్రణతి చెప్పారు. దీంతో విచారణను 8 వారాలకు వాయిదా వేస్తున్నట్లు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ నైనాల జయసూర్యతో కూడిన డివిజన్ బెంచ్ ప్రకటించింది. ప్రభుత్వ జిఓలను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పొందుపర్చకపోవడాన్ని నెల్లూరుకు చెందిన జిఎంఎన్ఎస్ దేవి, గుంటూరుకు చెందిన కె శ్రీనివాసరావు, అనంతపురం జిల్లాకు చెందిన ఎస్ఆర్ ఆంజనేయులు, బాపట్ల జిల్లాకు చెందిన సింగయ్య వేర్వేరుగా వేసిన పిల్స్ తరపున న్యాయవాది ఇంద్రనీల్ బాబు వాదిస్తూ, జిఓఐఆర్ స్థానంలో గత ప్రభుత్వం ఈ గెజిట్‌ను తీసుకొస్తూ జిఓ 100 జారీ చేసిందన్నారు. ఆ జిఓపై తుది నిర్ణయం తర్వాతే పునరుద్ధరణ నిర్ణయాన్ని అమలు చేయాలని సూచన చేశారు.

10 రోజుల్లో ధాన్యం బకాయిల చెల్లింపులు

- మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతులకు ధాన్యం బకాయిలను 10 రోజుల్లో చెల్లిస్తామని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. శాసనసభలో బుధవారం ధాన్యం రైతుల సమస్యలు అనే అంశంపై ప్రశ్నోత్తరాల్లో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. పౌరసరఫరాలశాఖ 2023-24కు సేకరించిన ధాన్యానికి సంబంధించి రూ.1,674 కోట్లు వైసిపి ప్రభుత్వం బకాయిలు పెట్టిందన్నారు. నాబార్డు ద్వారా రూ.వెయ్యి కోట్లను సమీకరించి 6 జిల్లాల్లోని 49 వేలమందికి చెల్లించినట్లు తెలిపారు. మిగిలిన రూ.674 కోట్లు 10 రోజుల్లో చెల్లిస్తామన్నారు. పెండింగ్ బకాయిల వివరాలు సభలో ప్రకటించారు. పశ్చిమగోదావరి రూ.424.55 కోట్లు, తూర్పుగోదావరి రూ.27.66 కోట్లు, ఏలూరు రూ.47.53 కోట్లు, అంబేద్కర్ కోనసీమ రూ.154.63 కోట్లు, కాకినాడ రూ.9.49 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ.10.74 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు.

త్వరలో పొల్యూషన్ ఆడిట్

- డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖలో ధూళికణాల కాలుష్యం ఎక్కువగా ఉందని, అక్కడ కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా త్వరలోనే పొల్యూషన్ ఆడిట్ చేయిస్తామని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ శాసనసభలో వెల్లడించారు. శాసనసభ ప్రశ్నోత్తరాల్లో భాగంగా విశాఖలో కాలుష్య నియంత్రణపై విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. విశాఖ పారిశ్రామిక ప్రాంతంలో 40 లక్షల మేర మొక్కలు నాటామని గుర్తు చేశారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయంలోనే ఎవరైనా వెళ్లి ఫిర్యాదులు చేసే అవకాశం కల్పిస్తామన్నారు. ఇదే సందర్భంలో స్పీకరు అయ్యన్నపాత్రుడు జోక్యం చేసుకుంటూ పవన్‌కల్యాణ్ విశాఖలో పర్యటించాలని కోరారు. స్పందించిన పవన్ త్వరలోనే పర్యటిస్తానని చెప్పారు. అక్కడ జల, వాయు, శబ్ద కాలుష్యం తగ్గించేలా అన్ని రకాల చర్యలూ తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

చిరుద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

- మండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వివిధ శాఖల్లో, పథకాల్లో తక్కువ వేతనంతో పనిచేసే చిరుద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని శాసనమండలిలో ప్రత్యేక ప్రస్తావన ద్వారా పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు ఛైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని ఎన్నికల హామీగానూ ప్రభుత్వం చెప్పిందని గుర్తుచేశారు. 1998 డిఎస్‌సిలో మిగిలిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకోవాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మరో ప్రత్యేక ప్రస్తావనలో ప్రభుత్వాన్ని కోరారు. వీరికి న్యాయం చేయడానికి గతంలో టిడిపి ప్రభుత్వం ఎమ్మెల్సీలతో కమిటీ ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ఆ కమిటీ అర్హత ఉన్నవారికి ఉద్యోగాలివ్వాలని నిర్ణయించిందని, దీని ప్రకారం నాలుగు వేల మంది మినిమం టైమ్‌స్కేల్ పద్ధతిలో ఉద్యోగాలు ఇచ్చారని తెలిపారు. మరో 1,500 మంది మిగిలిపోయారని, వారికి ఉద్యోగం కల్పించడాన్ని పరిశీలించాలన్నారు. కెజిబివి పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే టిజిటి, పిజిటిలకు మినిమం టైమ్‌స్కేల్ (ఎంటిఎం) అమలు చేయాలని స్వతంత్ర ఎమ్మెల్సీ రఘువర్మ ప్రభుత్వాన్ని కోరారు.

ప్రతి విద్యార్థికి అమలు చేస్తాం

- 'తల్లికి వందనం' పై మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే ప్రతి విద్యార్థికీ తల్లికి వందనం పథకం అమలు చేస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఇందుకు సంబంధించిన విధి విధానాలను రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు అందించే ఆర్థికసాయంపై శాసనమండలిలో బుధవారం చర్చకు వచ్చింది. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో తల్లికి వందనం కింద చదువుకుంటున్న ప్రతి విద్యార్థికీ రూ.15 వేల ఆర్థికసాయం అందజేస్తామని హామీ ఇచ్చామని చెప్పారు. ఈ అంశంపై పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అమలు చేసిన అమ్మఒడి పథకంలో అనేక లోపాలున్నాయని, వివిధ కారణాలతో రేషన్‌కార్డు ఉన్నవారికి కూడా అమలు చేయలేదన్నారు. పాత పథకంలో ఉన్న లోపాలను గుర్తించి తల్లికి వందనం అమలు చేయాలని కోరారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ బడులను దెబ్బతీసేలా ఈ పథకం ఉండకూడదని సూచించారు. ఈ పథకం ఆధారంగా ప్రభుత్వ పాఠశాలలను ఆదరించే విధంగా ప్రత్యేక డ్రైవ్ తీసుకురావాలన్నారు. టిడిపి సభ్యులు బి తిరుమల నాయుడు మాట్లాడుతూ.. 7.5 లక్షల మంది ప్రభుత్వ బడి నుంచి ప్రైవేట్ పాఠశాలల్లో చేరారని చెప్పారు. రాష్ట్రానికి చెందిన 60 వేల మంది ఇంజినీరింగ్ విద్యార్థులు నాణ్యమైన విద్య కోసం పొరుగు రాష్ట్రాలకు తరలివెళ్లారని పేర్కొన్నారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. టిడిపి కూటమి మేనిఫెస్టోలో బడికి వెళ్లే ప్రతి విద్యార్థికీ అమలు చేస్తామని హామీ ఇచ్చారని, ఈ ప్రకారం అమలు చేయాలని టిడిపి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. పిల్లలు ఎంతమంది ఉన్నా తల్లికి వందనం అమలు చేస్తామని హామీ ఇచ్చామని, దీనికి కట్టుబడి ఉన్నామని మంత్రి లోకేష్ వెల్లడించారు. రూ.30 వేలతో పాత కారు కొనుగోలు చేసినా, తెల్లకార్డు తొలగించి సంక్షేమ పథకాలు నిలిపేశారని తన పాదయాత్రలో అనేక మంది చెప్పారని వివరించారు. నాడు-నేడు కింద రూ.వేలకోట్లు ఖర్చు చేసినా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు తగ్గారని అన్నారు. గత ప్రభుత్వం సిబిఎస్‌ఇ, ఐబి, టోఫెల్ వంటి సంస్కరణలు తీసుకొచ్చిందన్నారు. విద్యారంగంలో నిర్ణయాలు తీసుకునే ముందు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు, తల్లిదండ్రులతో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం తీసుకుంటామన్నారు. సుమారు 11 వేల పాఠశాలల్లో 10 మందిలోపు విద్యార్థులే ఉన్నారని తెలిపారు. అడ్మిషన్లు, నాణ్యత ఎలా పెంచాలనే అంశాలపై ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను కూడా అధ్యయనం చేస్తున్నామని చెప్పారు. తమ ప్రభుత్వం ఇప్పటికే 16,347 ఉపాధ్యాయుల భర్తీకి తొలి అడుగు వేసిందన్నారు.

త్వరలో జాబ్ కేలండరు : మంత్రి పయ్యావుల

ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టుల భర్తీకి జాబ్ కేలండరును త్వరలో ప్రకటిస్తామని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. ఏ సమయంలో, ఏ నెలలో ఎలాంటి ఉద్యోగాల కల్పన చేయబోతున్నామనే షెడ్యూల్ విడుదల చేస్తామని తెలిపారు. 2019 నాటికి ప్రభుత్వంలో ఖాళీ పోస్టుల సంఖ్య 2.46 లక్షలు ఉన్నాయన్నారు. వీటిల్లో కొన్ని పోస్టుల్లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని చెప్పారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. కొత్త ప్రభుత్వంపై నిరుద్యోగులు అనేక ఆశలు పెట్టుకున్నారని తెలిపారు. గ్రూప్-1, 2 పోస్టులు వేల సంఖ్యలో ఖాళీగా ఉన్నాయని, వాటిలో కొన్నింటినైనా భర్తీ చేయాలని కోరారు. మరో పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. పాఠశాల విద్యాశాఖలో ఉన్న ఖాళీల పోస్టుల సంఖ్య వెల్లడించాలని కోరారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు 2.40 లక్షల మంది ఉన్నారని, వీరి వేతనాలను పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రెగ్యులర్ నియామకాలపై దృష్టి సారించాలని కోరారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో ప్రజల ఆస్తులకు రక్షణ

- బిల్లుపై చర్చలో చంద్రబాబు
- రద్దు బిల్లును ఆమోదించిన శాసనసభ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుతోనే ప్రజలకు ఆస్తులకు రక్షణ లభిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. రద్దు బిల్లును రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. అనంతరం జరిగిన చర్చలో సిఎం మాట్లాడుతూ ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా ప్రైవేటు ఆస్తులను లాగేందుకు గత వైసిపి ప్రభుత్వ ఎత్తుగడలో భాగంగానే ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ బిల్లును తీసుకొచ్చారని చెప్పారు. ఈ చట్టం వల్ల పౌరుల ఆస్తి మొత్తం లాగేసే పరిస్థితి వస్తుందన్నారు. భూ వివాదంలో 533 సివిల్‌కోర్టు అధికారాలను సెక్షన్ 335 నిషేధిస్తుందని, ఫలితంగా ఎవరైనా తమకు అన్యాయం జరిగితే నేరుగా హైకోర్టుకు వెళ్ళాల్సి వస్తుందని సామాన్యులు ఎంతమంది హైకోర్టుకు వెళ్లగలరని చంద్రబాబు ప్రశ్నించారు. చట్టం భారత వారసత్వ చట్టం, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, 246,300కు విరుద్ధంగా ఉందన్నారు. ఒకో పక్క ఈ చట్టంలో ఉండే సెక్షన్లు 10,13,14,15,25,34,36,46 రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని సిఎం సభకు తెలిపారు. ఇవే కాకుంగా ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకొస్తూ జారీ చేసిన జీఓ నెంబరు 512ను రహస్యంగా దాచిపెట్టారన్నారు. ఈ చట్టం ఏ స్థాయిలో ప్రమోదమో అడ్వకేట్స్ కోర్టు విధులను కూడా బహిష్కరించి ప్రజలనుచైతన్యవంతులు చేసేందుకు రోడ్లపైకి వచ్చారన్నారు. తాము అధికారంలోకి రాగానే రద్దు చేస్తామని తనతో పాటు పవన్‌కల్యాణ్ ఎన్నికల సభల్లో హామీనిచ్చామన్నారు. తాను పెట్టిన ఐదు సంతకాల్లో ఇది ఒకటని, మొదటి కేబినెట్‌లో రద్దు బిల్లుకు ఆమోదించామని, ఈ చట్టాన్ని రద్దు చేయడానికి బిల్లు ప్రవేశపెట్టి తమ చిత్తశుద్ధిని నిరూపించుకున్నామని చెప్పారు. రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ నీతి ఆయోగ్ చెప్పింది ఒకటైతే వైసిపి ప్రభుత్వం అందుకు భిన్నంగా చట్టాన్ని తెచ్చారన్నారు. ప్రజల ఆస్తులను లాక్కునేందుకు వీలుగా చట్టాన్ని తయారు చేసుకున్నారని సభ దృష్టికి తెచ్చారు. చర్చలో పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అనంతరం ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు బిల్లును శాసనసభ ఆమోదించింది.

జిఓ 117ను రద్దు చేయాలని పిడిఎఫ్ వాయిదా తీర్మానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జిఓ 117ను రద్దు చేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు, స్వతంత్ర ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ శాసనమండలిలో వాయిదా తీర్మానం అందజేశారు. శాసనమండలి బుధవారం ప్రారంభం కాగానే ఈ అంశంపై చర్చించాలని ఛైర్మన్ కె మోషేనురాజును కోరారు. ఈ వాయిదా తీర్మానాన్ని తిరస్కరించినట్లు ఛైర్మన్ ప్రకటించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ.. 117 జిఓ వల్ల పాఠశాల విద్యాశాఖ నిర్వీర్యమైందని తెలిపారు. యువగళం పాదయాత్ర సందర్భంగా రద్దు చేస్తామని విద్యాశాఖ మంత్రి లోకేష్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు.

టిడిఆర్ బాండ్లలో భారీ అవినీతి

- మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ
- ఉన్నతాధికారులతో సమీక్ష

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా టిడిఆర్ బాండ్ల జారీలో భారీ అవినీతి చోటుచేసుకుందని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. ఉన్నతాధికారులతో రాష్ట్ర సచివాలయంలో ఆయన బుధవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు పట్టణ ప్రణాళికా విభాగం డైరెక్టర్ విద్యుల్లతతోపాటు ఇతర అధికారులూ హాజరయ్యారు. రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా అధికారులు నిబంధనల ప్రకారం పనిచేయాలని అన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ టిడిఆర్ బాండ్లలోనూ ఇన్ని అక్రమాలు చేస్తారన్న విషయం విచారణలో తెలిసిందన్నారు.భవన నిర్మాణాలకు అనుమతులన్నీ పూర్తిగా ఆన్‌లైన్లోనే ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిపారు. ఎన్ని అంతస్తుల భవనం అయినా ఆన్‌లైన్ తప్పనిసరి అని పేర్కొన్నారు. గతంలో తాను మంత్రిగా ఉన్న సమయంలో ఒక్క ఫిర్యాదు కూడా రాలేదని, ఐదేళ్లలో పరిస్థితి దారుణంగా ఉందని తెలిపారు. విశాఖపట్నం, తణుకు, గుంటూరు, తిరుపతిలో టిడిఆర్ బాండ్ల జారీలో అక్రమాలు జరిగాయని మంత్రి పేర్కొన్నారు. తణుకులో అక్రమాలపై వేసిన కమిటీ ప్రాథమిక నివేదిక ఇచ్చిందని చెప్పారు. తణుకులో 29 బాండ్లను పరిశీలిస్తే అన్ని అక్రమాలేనని తేలిందన్నారు. బాండ్ల జారీలో ఎకరాల ప్రకారం విలువ కట్టాల్సి ఉండగా చదరపు గజాల ప్రకారం విలువ కట్టారని పేర్కొన్నారు. గజానికి రూ.4500 ఉండగా రూ.22 వేలు చొప్పున జారీచేశారని వివరించారు. ఒకటికి రెండువందల రెట్లు ఇవ్వడానికి బదులు నాలుగు వందల రెట్లు ఇచ్చారని పేర్కొన్నారు. అలాగే తిరుపతిలోనూ టిడిఆర్ బాండ్ల అక్రమాలు జరిగాయని చెప్పారు. చదరపు గజం రూ.40 వేలుగా చూపించడం, గుంటూరులో రూ.9000 ఉన్న గజాన్ని రూ.20 వేలు చేయడం వంటివి గుర్తించామని పేర్కొన్నారు. గిఫ్ట్‌డీడ్ రిజిస్ట్రేషన్ చేయకుండా నోటరీ అప్రూవల్‌తో బాండ్లు జారీచేసి అక్రమాలకు పాల్పడ్డారని వివరించారు. మొత్తంగా వందల కోట్లు అక్రమాలు జరిగాయని స్పష్టం చేశారు. రాజకీయ నాయకులు చెప్పినా అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. టిడిఆర్ బాండ్ల జారీలో అక్రమాలపై సిఎంతో చర్చించి అవసరమైతే మరికొన్ని కమిటీలు వేసి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. రాజధాని రైతుల సమస్యలు పరిష్కరిస్తామని, రూ.15 వేల కోట్ల నిధులతో అమరావతి పనులు వేగంగా ముందుకు వెళతాయని తెలిపారు. జైకా వంటి సంస్థల నుండి కూడా నిధులు తీసుకుంటామని చెప్పారు. నిర్మాణాల పటిష్టతపై అధ్యయనానికి చెన్నై, హైదరాబాద్ ఐఐటిలను ఉపయోగించుకుంటున్నామని వివరించారు.

నాలాగా ఇబ్బందిపడకూడదు

- తెలుగు, ఇంగ్లీష్ రెండు అవసరమే
- విద్యాశాఖమంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'నాలాగా మాతృభాషలో మాట్లాడేందుకు పిల్లలు ఇబ్బంది పడకూడదు. నేను మాతృభాషలో మాట్లాడేందుకు ఇప్పటికీ తడబడుతున్నాను.మాతృభాషను మార్చిపోకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. గత ప్రభుత్వం ఇంగ్లీష్ మాధ్యమం తీసుకొచ్చింది, దీనికి మేము వ్యతిరేకం కాదు. రెండు మాధ్యమాలను సమాంతరంగా చూడాలి. అందుకే దీనిపై సమగ్రంగా సమీక్ష చేస్తున్నాం' అని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. టోఫెల్ పరీక్ష అంశం శాసనమండలిలో బుధవారం ప్రస్తావనకు వచ్చింది. ఈ సందర్భంగా జనసేన సభ్యులు పి హరిప్రసాద్ మాట్లాడుతూ టోఫెల్ పరీక్ష కోసం గత ప్రభుత్వం రూ.4వేలకోట్లు ఖర్చు చేసిందని చెప్పారు. విదేశాలకు వెళ్లే విద్యార్థులు ఈ శిక్షణ తీసుకుంటారని, 3 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈ పరీక్ష ఎందుకని ప్రశ్నించారు. పిడిఎఫ్ ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ టోఫెల్ పరీక్ష రద్దు చేయాలని అన్నారు. శిక్షణ పేరుతో ఉపాధ్యాయులను పాఠశాలల్లో ఉంచడం లేదని తెలిపారు. విద్యాసంవత్సరం తొలి రెండు నెలల్లో అయినా అడ్మిషన్లపై దృష్టి సారించకుండా పదేపదే శిక్షణలు ఇవ్వడం సరికాదన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం టోఫెల్ పరీక్ష నిర్వహణ కోసం ఇటిఎస్‌తో ఒప్పందం చేసుకుందని తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా కేవలం 106 మంది ఉపాధ్యాయులకే శిక్షణ ఇచ్చారని చెప్పారు. టోఫెల్‌తో తాము అనేక ఇబ్బందులు పడుతున్నామని ఉపాధ్యాయులు తమ దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. గత ప్రభుత్వంలాగా ఆవేశంగా రివర్స్‌టెండరింగ్‌పేరుతో రివర్స్ గేర్ వేయొద్దని ముఖ్యమంత్రి చెప్పారని, మంచి నిర్ణయాలు ఉంటే అమలు చేయాలని సూచించారని అన్నారు. టోఫెల్‌పై తొందరపడి నిర్ణయం తీసుకోలేనని అన్నారు. ఉపాధ్యాయ సంఘాలు, ఎమ్మెల్సీలతో చర్చించి అభిప్రాయాలు తీసుకొని ముందకెళ్తామన్నారు.

పోలీస్ శాఖలో 19,999 పోస్టులు ఖాళీ : హోంమంత్రి అనిత

పోలీస్ శాఖలో 19,999 పోస్టులు ఖాళీగా ఉన్నాయని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు.ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిన అంశంపై పిడిఎఫ్ సభ్యులు కెఎస్ లక్ష్మణరావు, ఇళ్ల వెంకటేశ్వరరావు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ పోస్టుల భర్తీకి తమ ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని వెల్లడించారు. కోర్టు కేసుల వల్ల 6,100 పోస్టుల నియామకం నిలిచిపోయిందని చెప్పారు. క్రైం, గంజాయి, స్మగ్లింగ్ వంటి నేరపూరిత చర్యలు రోజురోజుకు పెరగడంతో పోలీస్ సిబ్బందిపై తీవ్రమైన ఒత్తిడి ఉందన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ కొత్త నోటిఫికేషన్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా కొత్త నోటిఫికేషన్ విడుదల చేయాలనికోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు పదవి విరమణ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచడం వల్ల యువతకు అన్యాయం జరిగిందన్నారు. ప్రతి ఏటా ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టుల భర్తీ కోసం జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని ఐ వెంకటేశ్వరరావు కోరారు. టిడిపి సభ్యులు చిరంజీవి మాట్లాడుతూ కోర్టులో ఉన్న 6,100 పోస్టుల నోటిఫికేషన్‌పై ప్రభుత్వం త్వరగా పరిష్కరించాలని నిరుద్యోగులు కోరుతున్నారని అన్నారు. కొత్త ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని, ఐదేళ్ల నుంచి నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

భూములు కబళించడానికే ల్యాండ్ టైట్లింగ్ యాక్టు

- మండలిలో రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

ఐదేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రంలో రెండు లక్షల ఎకరాల ప్రభుత్వ, పేదల భూములు అన్యాక్రాంతం అయ్యాయని, ప్రభుత్వ ప్రైవేటు భూములను కబళించడానికి గత ప్రభుత్వం ల్యాండ్ టైట్లింగ్ యాక్టును తీసుకొచ్చిందని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్‌శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. బుధవారం ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు బిల్లును శాసనమండలిలో ప్రవేశపెట్టిన సందర్భంగా ఆయన సభలో మాట్లాడారు. ఈ నల్ల చట్టం తీసుకురావడంతో తమ భూ హక్కులు హరించుకుపోతాయని భయంతో రైతులు, భూ యజమానులు నిద్రలేని రాత్రులు గడిపారని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా ఈ చట్టాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్రం చెప్పిన ల్యాండ్ టైట్లింగ్ యాక్టుకు రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన చట్టానికి పొంతన లేదన్నారు. భూముల హక్కుల కోసం సామాన్యులు హైకోర్టు దిగువ కోర్టులకు వెళ్లే అవకాశాన్ని హరించారన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వే ప్రచార ఆర్భాటం మాత్రమే అని, దీని పేరుతో ప్రజాధనం రూ.641 కోట్లు వృథా చేశారని అన్నారు. రీ సర్వేను ప్రస్తుతానికి నిలిపేశామన్నారు. దీనిపై సమగ్రంగా రివ్యూ చేసి గ్రామ స్థాయిలో సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించిన తర్వాతే రీ సర్వే గురించి తిరిగి ప్రభుత్వం ప్రకటన చేస్తుందన్నారు. ఈ అంశంపై టిడిపి ఎమ్మెల్సీ అనూరాధ మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వం భూ దాహంతోనే రాష్ట్రంలోని 14 లక్షల ఎకరాల బడుగు, బలహీనవర్గాల భూములను లాక్కుందన్నారు.

రిజిస్ట్రేషన్ అయిన అసైన్డ్ భూములపై అధ్యయనం

గత ప్రభుత్వం అనేక చీకటి జిఓలను తీసుకొచ్చిందని, అందులో 596 ఒకటని రెవెన్యూశాఖ మంత్రి సత్యప్రసాద్ అన్నారు. కెఎస్ లక్ష్మణరావు మాట్లాడిన దానికి ఆయన మండలిలో సమాధానం ఇచ్చారు. 596 జిఓ అమల్లోకి వచ్చిన తర్వాత 39 వేల ఎకరాలు అసైన్డ్ భూములు రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. దీనిపై పూర్తిగా ప్రభుత్వం అధ్యయనం చేస్తుందన్నారు. వైసిపి ప్రభుత్వ విధానాలతో ఐదు సంవత్సరాల్లో పరిశ్రమలు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు రాలేదని, ఈ క్రమంలోనే ఎస్ఇజడ్‌లో భూముల విషయంలో మరికొంత కాలం పారిశ్రామిక వేత్తలకు వెసులుబాటు కల్పించనున్నట్లు తెలిపారు.

కోర్టుకు స్థానం లేకుండా చేసిన బిల్లు రద్దుకు మద్దతిస్తున్నాం

పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాస్వామ్యంలో కోర్టుకు స్థానం లేకుండా తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు బిల్లుకు సంపూర్ణంగా మద్దతిస్తున్నట్లు పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తెలిపారు. యాక్టు రద్దు బిల్లుపై ఆయన శాసనమండలిలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 21 లక్షల ఎకరాల అసైన్డ్, 1.12 లక్షల ఎకరాల చుక్కల భూములను అన్యాక్రాంతం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. 20 ఏళ్లకు ముందు అసైన్డ్ చేయబడిన భూములపై రైతులకు రిజిస్ట్రేషన్ హక్కులు కల్పిస్తామని చేసిన చట్ట సవరణ, దీని అమలుకు తీసుకొచ్చిన 596 జిఓ భూముల కుంభకోణానికి దారితీసే పరిస్థితులు ఏర్పడ్డాయని చెప్పారు. 596 జిఓ రాగానే రాష్ట్రంలోని 40 వేల ఎకరాలను 22 ఎ జాబితా నుంచి తొలగించారని తెలిపారు. ఈ జిఓపైనా నూతన ప్రభుత్వం పునరాలోచించాలన్నారు.

స్వచ్ఛాంధ్ర సాధన దిశగా రాష్ట్రం

- పంచాయతీరాజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్వచ్ఛాంధ్ర సాధన దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేసే కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అమలు చేసి ఫలితాలు రాబట్టాలని పంచాయతీరాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్ పేర్కొన్నారు. సచివాలయంలో బుధవారం ఒడిఎఫ్, మొబైల్ అప్లికేషన్, సర్వే అంశాలపై హైబ్రీడ్ విధానంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో బహిరంగ మల విసర్జన చేస్తున్న సందర్భాలు కనిపించడం ఆందోళన కలిగిస్తుందని, శాశ్వతంగా అడ్డుకట్ట వేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. టాయిలెట్ ట్రైపోలాజి, టాయిలెట్ల అవసరం, రెట్రోఫికేషన్, గ్రేవాటర్ మేనేజ్‌మెంట్, సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్, డెస్లడ్జింగ్ సేవలపై సర్వే నిర్వహించడం కోసం అభివృద్ధి చేసిన అప్లికేషన్‌ను సమర్థవంతంగా వినియోగించి, వాస్తవ పరిస్థితులను ప్రతిబింబింపజేయాలన్నారు. విభిన్న పథకాల కింద దాదాపు 80 లక్షల వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించామని, ఫలితంగా 2018లోనే 100 శాతం బహిరంగ మల విసర్జణ రహిత రాష్ట్రంగా నిలిచిందన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎమ్‌డి గంథం చంద్రుడు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఘన వ్యర్థాల నిర్వహణకు సంబంధించి తడి, పొడి చెత్త విభజన ఇప్పటికీ ప్రధాన సమస్యగా ఉందన్నారు. గ్రామస్థాయిలో మురుగు నీటి నిర్వహణ ప్రణాళికను సిద్ధం చేయడానికి ప్రాథమిక అధ్యయనం అవసరమన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ సంచాలకులు విఆర్ కృష్ణతేజ మైలవరపు మాట్లాడుతూ.. స్వచ్ఛాంధ్రను సాధించడానికి తగిన వ్యూహం, కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయడానికి విభిన్న పారామీటర్లపై సమగ్ర డేటా బేస్ అవసరమన్నారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

విశాఖ స్టీల్‌కు రూ.ఐదువేల కోట్లు కేటాయించండి

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

బడ్జెట్‌లో విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు న్యాయం చేస్తారని కార్మికులు, ఉద్యోగులు ఎంతగానో ఎదురుచూసినా నిరాశే ఎదురైందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1259వ రోజుకు చేరాయి. దీక్షలనుద్దేశించి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ.. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, ప్లాంట్‌ను పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిపేందుకు బడ్జెట్ సపోర్టుగా రూ.ఐదు వేల కోట్లు ఇవ్వాలని, సొంత గనులు కేటాయించాలని విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించిన కేంద్ర స్టీల్ మంత్రి కుమారస్వామికి వివరించామని తెలిపారు. అయినా, మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి సర్కారు ప్రభుత్వరంగ సంస్థల పట్ల తన పాత విధానాన్నే కొనసాగిస్తోందని విమర్శించారు. బడ్జెట్‌లో ప్రభుత్వ రంగ పరిశ్రమలను అమ్మడం ద్వారా రూ.50 వేల కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారని వివరించారు. బిజెపి ప్రభుత్వం తన విధానాన్ని మార్చుకొని విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిలుపుదల చేస్తున్నట్టు ప్రకటించాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్ మాట్లాడుతూ.. తక్షణమే పిఎఫ్, త్రిఫ్ట్ సొసైటీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. దీక్ష శిబిరంలో సిఐటియు సీనియర్ నాయకులు ఎన్.రామారావు, స్టీల్ సిఐటియు ప్రతినిధులు శ్రీనివాసరాజు, యు వెంకటేశ్వర్లు, గంగాధర్, నీలకంఠం, టివికె రాజు, శివ, సంతోష్ రాజు, మహేష్, విడివి పూర్ణచంద్రరావు, రాజా తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి

- జిఓ 217ను రద్దు చేస్తూ నిర్ణయం
- కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన జిఓ నెంబరు 217ను రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, కేబినెట్‌లో ఆమోదించి రద్దు చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. బుధవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సందర్భంగా 'మత్స్యకారులకు జిఓ 217 వల్ల ఇబ్బందులు' అనే అంశంపై జరిగిన చర్చలో మంత్రి మాట్లాడుతూ.. మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కుల వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న అనేక మందిలో మత్స్యకారులు ప్రధానమని, అటువంటి వారిని గత వైసిపి ప్రభుత్వం దుర్మార్గపు నిర్ణయాలతో ఇబ్బందులు పెట్టిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం జిఓ 217 తెచ్చి మత్స్యకారుల సొసైటీల పరిధిలో ఉన్న చెరువులను ఆన్‌లైన్ టెండర్ల ద్వారా వైసిపి కార్యకర్తలకు అప్పగించి మత్స్యకారుల పొట్టకొట్టిందన్నారు. రాష్ట్రంలో 3,325 చిన్న తరహా సాగునీటి చెరువులు, 23,920 గ్రామ పంచాయతీ చెరువులు, 118 రిజర్వాయర్లు ఉన్నాయన్నారు.

డిప్యూటీ సిఎం పవన్‌తో ఆస్ట్రేలియా హై కమిషనరు భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో ఆస్ట్రేలియా హై కమిషనరు ఫిలిప్‌గ్రీన్ మంగళగిరిలోని ఆయన నివాసంలో బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు అవకాశాలపై చర్చించారు. రాష్ట్రం నుంచి ఉన్నత విద్య కోసం ఆస్ట్రేలియా వెళ్లే విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని, ఆ దేశంలో ఉన్న విద్యావకాశాలు, విద్యా సంస్థల వివరాలను తెలిపేందుకు గైడెన్స్ అందించాలని పవన్‌కల్యాణ్ కోరారు. ఈ సమావేశంలో చెన్నైలోని ఆస్ట్రేలియా కౌన్సిల్ జనరల్ సిలై జాకి, ఆస్ట్రేలియా కౌన్సిల్ జనరల్ సిలైజాకి, హైకిషన్ ఎకనామిక్ కౌన్సిలర్ జులియన్ స్టోర్మ్, హైకమిషన్ అగ్రికల్చర్ కౌన్సిలర్ కిరణ్‌కరమిల్ పాల్గొన్నారు.

ఉనికి కోసమే జగన్ ఆరాటం

- బిసి సంక్షేమశాఖ మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఉనికిని చాటుకోవడం కోసమే ఢిల్లీ వెళ్లారని బిసి సంక్షేమశాఖ మంత్రి ఆర్ సవిత పేర్కొన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బుధవారం ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో వైసిపికి ఉనికిపోయిందని, ఢిల్లీ వెళితే ఇతర పార్టీల మద్దతుతో ఉనికి వస్తుందని భావించి వెళ్లి ఉంటారన్నారు. గత ఐదేళ్లు అవినీతి, అరాచకాలకు పాల్పడి హత్యా రాజకీయాలు చేసింది జగన్ కాదా? అని ప్రశ్నించారు. 35 హత్యలు ఎక్కడెక్కడ జరిగాయో వివరాలు ఇవ్వాలని హోంమంత్రి అడిగితే ఇప్పటి వరకు వైసిపి నుంచి సమాధానం ఇవ్వలేదన్నారు.

శవ రాజకీయాలు తగవు : జివి

రాష్ట్రంలో శవ రాజకీయాలు చేయడం వైఎస్ జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య అని వినుకొండ ఎమ్మెల్యే జివి ఆంజనేయులు వ్యాఖ్యానించారు. మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు రాష్ట్రాభివృద్ధి కోసం ఢిల్లీ వెళ్లి నిధులు తీసుకురావడానికి ప్రయత్నిస్తుంటే రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని అన్నారు. జగన్ రాష్ట్రం పరువును ఢిల్లీలో తాకట్టు పెట్టారని విమర్శించారు. వినుకొండలో రెండు కుటుంబాల మధ్య జరిగిన గొడవలో ఓ రౌడీ ప్రాణాలు కోల్పోయాడని తెలిపారు. హతుడు, నిందితుడు ఇద్దరూ వైసిపికి చెందిన వారేనన్నారు.

ఆర్‌టిసి ఇడిపై బదిలీ వేటు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉద్యోగుల సమస్యలకు సంబంధించి రవాణాశాఖ మంత్రి ఎం రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాలను ఖాతరు చేయని ఎపిఎస్‌ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు గిడుగు వెంకటేశ్వరరావుపై బదిలీ వేటు పడింది. ఉద్యోగుల సమస్య పరిష్కార విషయమై కడప జోన్ ఇడి గిడుగు వెంకటేశ్వరరావుకు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మూడుసార్లు ఫోన్ చేశారు. మంత్రి నేరుగా ఫోన్ చేసినా ఖాతరు చేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండేకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. దీంతో విజయవాడలోని ఆర్‌టిసి ప్రధాన కార్యాలయంలో వెంటనే రిపోర్టు చేయాలని గిడుగు వెంకటేశ్వరరావును ఆదేశించారు.

వైవి సుబ్బారెడ్డి భద్రత కొనసాగించండి

ప్రజాశక్తి-అమరావతి

వైసిపి రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డికి 2ప్లస్2 భద్రతను నాలుగు వారాల పాటు కొనసాగించాలని హైకోర్టు పోలీసులకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. విచారణను 3 వారాలకు వాయిదా వేస్తూ జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి ఉత్తర్వులు జారీ చేశారు. నోటీసు, సమాచారం ఏమీ ఇవ్వకుండానే తనకున్న 2ప్లస్2 భద్రతను సగానికి తగ్గించారంటూ వైవి సుబ్బారెడ్డి వేసిన పిటిషన్‌లో పోలీసులు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు.

బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలి

- ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, జనసేన హామీ ఇచ్చిన విధంగా 1214 మెమోను రద్దు చేసి బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రభుత్వాన్ని కోరింది. విజయవాడలోని ఎంబివికెలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో యూనియన్ అధ్యక్షులు ఎన్ రమణారావు, ప్రధాన కార్యదర్శి ఆర్‌వి నరసింహారావు, కోశాధికారి వేణుగోపాలరావు మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 30 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు సరైన పనులు లేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, 1214 మెమోను విడుదల చేసి బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు నుంచి ఏ ఒక్కరికీ సంక్షేమ పథకం అమలు చేయకుండా నిషేధించిందని వివరించారు. మెమో రద్దు చేసి బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలని గత ప్రభుత్వంలో మంత్రులకు, ఎమ్మెల్యేలకు ఎన్నిసార్లు వినతులిచ్చినా పట్టించుకోలేదని తెలిపారు. టిడిపి, జనసేన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా నూతనంగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. సంక్షేమ పథకాలు అమలు ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఒక్క రూపాయి ఖర్చు కాదని, బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ సెస్ ద్వారా సమకూరిన నిధులు నుంచి భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయొచ్చన్నారు.

'మద్యం'లో మాయమైనదెంత!

- త్వరలో ఇడి విచారణ ?
- అవసరమైతే సిబిఐకి కూడా
- ముఖ్యమంత్రికి టిడిపి నేతల సిఫార్సు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత ప్రభుత్వ హయంలో రాష్ట్రంలో జరిగిన మద్యం విక్రయాల్లో మాయమైన మొత్తంపై ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారంపై ఇప్పటికే సిఐడి విచారణకు ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఇడి విచారణకు కూడా సిఫార్సు చేయనున్నట్లు సమాచారం. టిడిపి కూటమి నేతలు చెబుతున్న లెక్కల ప్రకారం రాష్ట్రంలో 30వేల కోట్ల రూపాయల నిధులు దారి మళ్లాయి, దీనికి సంబంధించి తమ వద్ద ఆధారాలు కూడా ఉన్నట్లు వారు చెబుతున్నారు. మరోవైపు అధికారులు ఇచ్చిన నివేదికలోనూ

భారీ కుంభకోణం జరిగినట్టు పేర్కొన్నారని సమాచారం. దశలవారీగా మద్య నిషేధం అంటూ ఇచ్చిన హామీని వైసిపి ప్రభుత్వం ఏ దశలోనూ అమలు చేయని సంగతి తెలిసిందే. అధికారుల నివేది ప్రకారం 2019-24 మధ్య రాష్ట్రంలో మద్యం విక్రయాలు భారీగా పెరిగాయి. అయితే, ఆ స్థాయిలో నిధులు రాష్ట్ర ఖజానాకు చేరలేదు. 2000 ఎంఎల్ బాటిల్ ధర 2019లో రూ.250 ఉండగా 2020 మే నెలలో ఈ బాటిల్ ధర రూ. 480కి పెంచారు. నెల దిరగకుండానే 2020 మే 5న ఈ బాటిల్ ధర రూ.960కి పెంచారు. 90 ఎంఎల్ బాటిల్ ధర 2019 సెప్టెంబరులో రూ.10లు ఉండగా 2020 మే 5 నాటికి రూ.40కు పెంచారు. అలా అన్ని రకరాల బాటిల్స్‌పై 100 నుంచి 200 శాతం ధరలు పెంచారు. అలాగే మద్యం ప్రియులు 2019లో (పర్ క్యాపిటా కన్సమ్షన్) కనిష్టంగా 5.55 లీటర్లు కాగా 2023-24లో 6.23 లీటర్లు వినియోగించినట్టు టిడిపి ప్రభుత్వం తన శ్వేతపత్రంలో పేర్కొన్నారు. మద్యం ధరలు పెరగడం వల్ల ప్రత్యామ్నాయంగా గంజాయి,నాటుసారా ఇతర మత్తు పదార్థాలకు కొంత మంది బానిసలయ్యారని ప్రభుత్వం తన నివేదికలో పేర్కొన్నారు. 2014-2019 మధ్యకాలంలో 4,28,457 కిలోలు గంజాయిని అధికారులు సీజ్ చేయగా, 2019-24 కాలంలో 5,47,738 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను 2019-24 కాలంలో 8,31,290 లీటర్లు స్వాధీనం చేసుకోగా 2019-24 మధ్యకాలంలో 13,.81,790 లీటర్లు స్వాదీనం చేసుకున్నారు. గత ఐదేళ్లలో ఎక్సైజ్ కేసులకు సంబధించి 3,41,243మందిని అరెస్టు చేశారు. రాష్ట్రంలో గత ఐదేళ్లలో రూ.99 వేల కోట్ల మద్యం తయారీ, అమ్మకాలు జరగ్గా కేవలం రూ. 18,860 కోట్ల ఆదాయం మాత్రమే చూపారని శాసనసభలో సిఎం చంద్రబాబు చెప్పారు. ఇంత కన్నా ఎక్కువ ఉంటుందని మరికొందరు సభ్యులు చెప్పారు. టిడిపి నాయకులు 30 వేల కోట్ల రూపాయలు అక్రమాలు జరిగాయని చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లినట్లుసమాచారం. వారు సిబిఐ విచారణకు డిమాండ్ చేసినట్లు చెబుతున్నారు. అయితే, సిఐడి విచారణ నివేదిక వచ్చిన తరువాత కేసును ఇడికి సిఫార్సు చేయాలని, ఆ తరువాత అవసరమైన సిబిఐ దర్యాప్తు కోరాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది.

తిరుపతిలో ఘోరం

- వదిన, పిల్లలను చంపిన ఉన్మాది

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

తిరుపతిలో రాయల్‌నగర్ ఘటన మరువకముందే, మరో ఘోరం బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పద్మావతి వర్సిటీ సమీపంలోని మునిరెడ్డినగర్‌లో నివాసం ఉంటున్న అన్నదమ్ముల మధ్య కుటుంబ కలహాలు ఉన్నాయి.ఈ నేపథ్యంలో వదిన సునీత, ఇద్దరు పిల్లలు దేవీశ్రీ, నీరజను మరిది అతి కిరాతకంగా హత్య చేశాడు. ఆపై తాను ఉరేసుకున్నాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో దారుణం జరిగి ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీశైలంలో పెరుగుతున్న నీటిమట్టం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

కృష్ణా ఎగువ పరివాహక రాష్ట్రలైన మహారాష్ట్ర, కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా దిగువన ఉన్న ప్రాజెక్టులు నిండుకుండలా మారుతున్నాయి. ఎగువ జూరాల నుండి శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు చేరుతుండడంతో ఆనకట్ట రేడియల్ ట్రస్ట్ గేట్ల వరకు వరద నీరు చేరుకుంది. బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి జూరాల నుండి 1,75,448 క్యూసెక్కుల నీరు చేరుతున్నాయి. అదే సమయానికి క్రమంగా జలాశయం నీటిమట్టం పెరుగుతూ 849.80 అడుగులకు చేరింది. నీటి నిలువ సామర్థ్యం 79.6340 టిఎంసిలుగా నమోదయింది. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి తెలంగాణ పరిధిలోని మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో గడచిన 24 గంటలలో పంప్ మోడ్ సిస్టం ద్వారా 6,474 క్యూసెక్కుల నీటితో 3.126 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని చేశారు. ప్రస్తుతానికి కుడిగట్టు జల విద్యుత్ కేంద్రం నందు విద్యుత్తు ఉత్పత్తిని నిలిపి వేశారు .

నీటిలో నిల్చొని రైతులతో కలిసి నిరసన తెలుపుతున్న షర్మిల

గత పాలకుల వల్లే కష్టాలు: షర్మిల

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గత ప్రభుత్వ హయాంలో కాలువల్లోని మట్టి తీయకపోవడంతో వరద తీవ్రత భారీగా పెరిగిందని పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఎర్రకాలువ ముంపునకు గురైన నందమూరు గ్రామంలోని పొలాలను ఆమె బుధవారం పరిశీలించారు. ఆ గ్రామంలో నడుము లోతు నీరు ఉన్న పొలంలోకి రైతులతో కలిసి దిగి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు అనుభవిస్తున్న కష్టాలు గత పాలకుల వల్లేనని విమర్శించారు. కేంద్రంలో బిజెపి అధికారంలో ఉన్న తమ మిత్రపక్షాలైన రాష్ట్రాలకే నిధులు ఇస్తుందని, అదే విధంగా మన రాష్ట్రానికి నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చారని, హామీ ఇవ్వకపోయినా రూ. వేల కోట్లు రుణమాఫీ చేశారని, సొసైటీ ద్వారా ఎరువులు, రుణాలు అందించి రైతులను ఆదుకున్నారని తెలిపారు. 52 ప్రాజెక్టులను జలయజ్ఞం పేరుతో ప్రారంభించారని, వాటిలో 42 ప్రాజెక్టులను పూర్తి చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రాజెక్టులోని తట్ట మట్టి కూడా తీయించలేదని విమర్శించారు. కూటమి పేరుతో బిజెపితో జతకట్టిన ప్రస్తుత సిఎం చంద్రబాబు కేంద్రం నుంచి భారీగా నిధులు తీసుకురావాల్సిన బాధ్యత ఉందన్నారు. జిల్లాలో 40 వేల హెక్టార్లలో వరి పంట దెబ్బతినడం, ప్రత్యేకించి ఈ గ్రామంలో 500 ఎకరాలు నీటిలో మునగడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కుప్పం అభివృద్ధికి రూ.250 కోట్లు

- ప్రత్యేక మ్యానిఫెస్టోను చంద్రబాబు తప్పక అమలు చేస్తారు : నారా భువనేశ్వరి
- 'వైసిపి నాయకులను టిడిపిలో చేర్చుకోవద్దు' టిడిపి నేతల ఆవేదన

ప్రజాశక్తి- కుప్పం టౌన్ (చిత్తూరు జిల్లా)

సమావేశంలో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

కుప్పం పురపాలక సంఘం అభివృద్ధికి సిఎం నారా చంద్రబాబు రూ.250 కోట్లు మంజూరు చేశారని ఆయన సతీమణి నారా భువనేశ్వరి తెలిపారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో రెండవ రోజు పర్యటనలో భాగంగా పరిధిలోని కమతమూరు కాలనీలో నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం పిఇఎస్ వైద్యకళాశాల ఆడిటోరియంలో కుప్పం పట్టణంలోని నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ఎన్నికలకు ముందు స్థానిక నాయకులను ఇబ్బందులు పెట్టిన వారిని పార్టీలో చేర్చుకుంటున్నట్టు వస్తున్న వార్తలు తమను కలిసి వేశాయన్నారు. దయచేసి అటువంటి వాటిపై అధిష్టానం దృష్టిసారించాలని కోరారు. కుప్పంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి యువతకు భవిష్యత్తు చూపించాలని కోరారు. వీటిపై స్పందిస్తూ భువనేశ్వరి మాట్లాడారు. గత ఐదేళ్లు టిడిపి కార్యకర్తలు కుప్పంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. కుప్పం ప్రజలకు ఇచ్చిన ప్రత్యేక మ్యానిఫెస్టోను చంద్రబాబు తప్పకుండా త్వరగా అమలు చేస్తారని హామీ ఇచ్చారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

బడ్జెట్‌లో ఆదివాసీలకు మొండిచేయి

- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

ప్రజాశక్తి - మందస

బడ్జెట్‌లో ఆదివాసీలకు కేంద్రం మొండిచేయి చూపిందని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర విమర్శించారు. శ్రీకాకుళం జిల్లా మందసలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీల జనాభా ప్రాతిపదికన 8.3 శాతం కేటాయింపులు చేయాల్సి ఉన్నా చేయలేదన్నారు. 'జనజాతి అభియాన్' పథకం కింద గత బడ్జెట్‌లో ఆదివాసీలకు రూ.24 వేల కోట్లను కేటాయించినప్పటికీ ఆ మేరకు నిధులు విడుదల చేయలేదని విమర్శించారు. మౌలిక వసతుల్లేక గిరిజన గ్రామాలు అధ్వానంగా ఉన్నాయని, రహదారులు లేక డోలి మోతలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు కోట్ల ఆదివాసీలకు ప్రధానమంత్రి సమ్మన్ యోజన లబ్ధి చేకూరుతుందని ఈ ఏడాది బడ్జెట్‌లో ఆర్భాటంగా ప్రకటించడం ఆదివాసీలను మోసగించడమేనని విమర్శించారు. జిఒ నంబరు 3 చట్టబద్ధత, నాన్ షెడ్యూల్ గ్రామాలను షెడ్యూల్ ప్రాంతంలో కలపడం.. ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేస్తారని ఆశించిన ఆదివాసీలకు నిరాశే మిగిలిందన్నారు. అటవీ ఉత్పత్తుల మద్దతు ధరకు నిధులు కేటాయించలేదని, మాయ మాటలే మిగిలాయని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రంపై టిడిపి, జనసేన పార్టీలు ఒత్తిడి తీసుకురావాలన్నారు. స్పష్టమైన నిధులు సాధించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్.అప్పన్న, ఎస్.ధర్మారావు, మండల నాయకులు సవర గురునాథ్, సవర జైరాం, సవర బావన్న తదితరులు పాల్గొన్నారు.

శాంతించిన గోదావరి

- భద్రాచలం వద్ద తగ్గుముఖం
- ధవళేశ్వరం వద్ద కొనసాగతున్న 2వ ప్రమాద హెచ్చరిక
- ముంపులోనే లంక గ్రామాలు

కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పెదపట్నం లంకలో చిక్కుకున్న పశువులను ఒడ్డుకు తీసుకొస్తున్న రైతు

ముంపులో ఉన్న అల్లూరి జిల్లా విఆర్.పురం మండలం శ్రీరామగిరి గ్రామం

ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి సముద్రంలోకి విడిచిపెడుతున్న వరద నీరు

ప్రజాశక్తి-యంత్రాంగం

మూడు రోజులుగా ఉగ్రరూపం దాల్చిన గోదావరి మంగళవరం రాత్రి నుంచి శాంతించింది. భద్రాచలం వద్ద క్రమంగా తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం భద్రాచలం వద్ద 45.30 అడుగుల నీటిమట్టం నమోదైంది. దీంతో అక్కడ రెండో ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద బుధవారం నాటికి 14.70 అడుగుల నీటి మట్టం నమోదైంది. ఇక్కడ ఇంకా రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతుంది. కాటన్ బ్యారేజీ నుంచి 175 గేట్లను పైకి లేపి 14,18,752 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. వ్యవసాయ అవసరాల నిమిత్తం తూర్పు, పశ్చిమ, మధ్య డెల్టా కాల్వలకు 3,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి విడుదలవుతున్న వరదతో లంకలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి మండలాల్లోని కాజ్‌వేలపై నడుంలోతు నీరు ప్రవహిస్తుంది. ఆలమూరు మండలం తోకలంక, బడుగువాని లంక, అయినవిల్లి మండలంలో పల్లపులంక, అయినవిల్లిలంక, శానిపల్లిలంక, పొట్టిలంక, పి.గన్నవరంలోని గంటిపెదపూడి లంకల్లో లోతట్టు ప్రాంతాల్లో ఇంకా వరద నీరు నిలిచే ఉంది. రామచంద్రపురం మండలం కోటిపల్లి రేవు పూర్తిగా నీటమునిగింది. కపిలేశ్వరపురం మండలంలోని నారాయణలంక, కేదార్లంక, తాతపూడి, కోరుమిల్లి, అద్దంకివారి లంకల్లోకి వరదనీరు ప్రవేశించింది. రాజమహేంద్రవరంలో నిర్వాసితుల పునరావాస కేంద్రాలు కొనసాగుతున్నాయి. సుమారు 600 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్టు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

పశ్చిమగోదావరి జిల్లా ఆచంట, యలమంచిలి, నరసాపురం మండలాల్లో గోదావరి వరద ఉధృతి కొనసాగుతోంది. ఆచంట మండలంలోని అయోధ్యలంక, పుచ్చలంక, భీమలాపురం, శివారు కాపులపాలెంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పుచ్చలంకలో గోదావరి నదిని ఆనుకొని ఉన్న ఇళ్ల చుట్టూ వరద నీరు చేరింది. దీంతో అధికారులు లంక గ్రామాల్లో రెండు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. యలమంచిలి మండలంలోని పలు గ్రామాలను వరద నీరు చుట్టుముట్టింది. కనకాయ లంక కాజ్‌వేపై 12 అడుగుల మేర వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. నరసాపురం పట్టణ శివార్లలో పొన్నపల్లి శ్మశాన పూర్తిగా వాటిక మునిగింది.

ఏలూరు జిల్లాలోని విలీన మండలాల్లో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే వారం రోజులుగా దాచారం-కుక్కునూరు మధ్య గుండేటి వాగుపై ఉన్న కాజ్‌వే, ముత్యాలంపాడు-వింజరం మధ్య పాలవాగుపై ఉన్న కాజ్‌వే వరద ముంపునకు గురవడంతో 19 గ్రామాలకు రాకపోకలు ఇంకా పునరుద్దరణ కాలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు, వ్యాపారులు, రైతులు, రోగులు మండల కేంద్రానికి రావాలంటే చుట్టూ 15 కిలోమీటర్లు తిరిగి రావాల్సి వస్తుందని వాపోతున్నారు. వేలేరుపాడు మండలంలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు వద్ద శబరి నది నీటి మట్టం 38 అడుగులకు తగ్గింది. ఎటపాక మండలం మురుమూరు గ్రామానికి గత మూడు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. విఆర్.పురం మండలంలో శబరి, గోదావరి సంగమంలో వరద స్వల్పంగా తగ్గుతుంది. శ్రీరామగిరి, వడ్డి గూడెంతోపాటు పలు గ్రామాల్లో ముంపు తగ్గకపోవడంతో బాధితులు పునరావాస కేంద్రాల్లోనే ఉన్నారు. విఆర్.పురం, కూనవరం మండలంలోని ముంపు గ్రామాల ప్రజలకు అధికారులు నిత్యావసర సరుకులు అందజేశారు. ఎడతెరిపి లేని వర్షాలకు మారేడుమిల్లి-రంపచోడవరం ప్రధాన రహదారిపై, జీకే వీధి మండలం గుమ్మిరేవుల - వర్తుండపాడు ప్రధాన రహదారిపై భారీ వృక్షాలు నేలకూలాయి. దీంతో ఈ రెండు ప్రాంతాల్లోనూ భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

మార్కెట్‌లో 70 శాతం మందికి నష్టాలు

- ఇంట్రాడేలో మెజారిటీ బాధితులు
- 2022-23లో నగదు కోల్పోయిన ఇన్వెస్టర్లు
- సెబీ రిపోర్ట్

ముంబయి : స్టాక్ మార్కెట్లలో ఇంట్రాడేలో మెజారిటీ ఇన్వెస్టర్లు నష్టపోతున్నారని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఇంట్రాడే ఈక్విటీ క్యాష్ విభాగంలో 70 శాతం మంది రిటైల్ ఇన్వెస్టర్లు నష్టాలు చవి చూశారని తెలిపింది. 2018-19 నాటితో పోల్చితే ఇంట్రాడే ఇన్వెస్టర్లలో 300 శాతం పెరుగుదల ఉందని పేర్కొంది. 2018-19 నుంచి 2022-23 వరకు కోవిడ్ ప్రభావాలు, ట్రేడింగ్ తీరుతెన్నులపై విద్యావేత్తలు, బ్రోకర్లు, మార్కెట్ నిపుణుల అభిప్రాయాలను సేకరించి సెబీ విశ్లేషించింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో ఉన్న ఆర్థిక నష్టాల గురించి అవగాహన పెంచడం, మార్కెట్ల తీరు తెన్నులపై అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో ఈ రిపోర్టును విడుదల చేసినట్లు తెలిపింది. దాదాపు మూడింట ఒకవంతు మంది ఈక్విటీ క్యాష్ విభాగంలో ఇంట్రాడే ట్రేడింగ్‌పై ఆసక్తి కనబర్చుతున్నారు. 2018-19 నాటితో పోల్చితే 2022-23 నాటికి ఇంట్రాడే ట్రేడర్ల సంఖ్య 300 శాతం పెరిగింది. 30 ఏళ్ల లోపు యువ ఇంట్రాడే వ్యాపారుల వాటా 2018-19లో 18 శాతంగా ఉండగా.. 2022-23 నాటికి 48 శాతానికి చేరింది. ఇంట్రాడే ఇన్వెస్టర్లలో 71 శాతం మంది నికర నష్టాలను చవి చూశారు. ఏడాదిలో 500 పైగా క్రయ, విక్రయాలు చేసే వారిలో 80 శాతం మంది నష్టాల పాలయ్యారు. యువ ఇన్వెస్టర్లలో 76 శాతం మంది నష్టాన్ని పొందారు. సగటు లాభార్జన చేసిన వారికంటే నష్టార్జన కలిగిన వారే ఎక్కువ లావాదేవీలు చేశారు.

బిఎండబ్ల్యు నుంచి ఎలక్ట్రిక్ బైక్

- ధర రూ.14.90 లక్షలు

న్యూఢిల్లీ : లగ్జరీ బైకుల తయారీ కంపెనీ బిఎండబ్ల్యు మోటారోడ్ ఇండియా భారత మార్కెట్లోకి తన కొత్త బిఎండబ్ల్యు సిఇ విద్యుత్ బైకును విడుదల చేసింది. దీని ధరను రూ.14.90 లక్షలుగా నిర్ణయించింది. 8.5 కిలోవాట్ బ్యాటరీ ప్యాక్ కలిగి ఉంటుంది. ఇది ఒక ఫుల్ చార్జ్‌తో 130 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదని ఆ కంపెనీ తెలిపింది. 6.9 కిలోవాట్ చార్జర్ ద్వారా గంట 40 నిమిషాల్లో ఫుల్ ఛార్జ్ అవుతుందని తెలిపింది. ఇది 2.6 సెకన్లలో 0 నుంచి 50 కిలోమీటర్ల వరకు వేగాన్ని అందుకుంటుందని.. గంటకు గరిష్టంగా 120 కిలోమీటర్లు ప్రయాణించగలదని పేర్కొంది.

రూ.1.42 లక్షల కోట్ల పెండింగ్ బిల్లులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

గత ప్రభుత్వం అనుసరించిన విధానాల కారణంగా పెద్ద మొత్తంలో బిల్లులు పెండింగ్‌లో పడ్డాయి.

ఆర్థికశాఖ అధికారులు తాజాగా తేల్చిన లెక్కల ప్రకారం ఇలా పెండింగ్‌లో ఉన్న బిల్లుల మొత్తం దాదాపుగా 1,41,588 కోట్ల రూపాయలని సమాచారం. 2019 వ సంవత్సరం నుండి ఈ ఏడాది జూన్ 18వ తేది వరకు ఇంత మొత్తం పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు తేల్చారు. ఇందులో కొన్ని కాంట్రాక్టర్లకు సంబంధించిన బిల్లులతోపాటు, ఉద్యోగులకు సంబంధించినవి కూడా పెద్ద మొత్తంలోనే ఉన్నట్లు చెబుతున్నారు. చెల్లించాల్సిన బిల్లుల్లో 93 వేల కోట్ల రూపాయల విలువైన బిల్లులను ఇప్పటివరకు ఆర్థిక శాఖ సిఎఫ్‌ఎంఎస్‌లోకి అప్‌లోడ్ కూడా చేయలేదని సమాచారం. మరో 48 వేల కోట్ల రూపాయల వరకు బిల్లులు అప్‌లోడ్ జరిగినప్పటికీ, చెల్లింపులు జరగలేదని ఆర్థికశాఖ తాజా అధికారులు చెబుతున్నారు.

నీటిపారుదల శాఖవే అధికం

పెండింగ్‌లో ఉన్న బిల్లుల్లో ఎక్కువ భాగం నీటి టిపారుదల శాఖకు చెందినవే ఉన్నట్లు సమాచారం. పోలవరంతోపాటు ఆనేక పథకాలకు 19,324 కోట్లు బకాయిలు ఉన్నాయి. బిల్లులు చెల్లించకపోవడంతో పలువురు కాంట్రాక్టర్లు పనులు ఆపివేసి వెనక్కు వెళ్లిపోయారు కూడా. ఆ తరువాత ఆర్థికశాఖ నుంచి చేయాల్సిన చెల్లింపులు రూ.19,549 కోట్లు, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలో రూ.14 వేల కోట్లకుపైగా బకాయిలు ఉన్నట్లు సమాచారం. అలాగే పరిశ్రమల శాఖ, గృహ నిర్మాణ శాఖ, మున్సిపల్, వైద్య ఆరోగ్యం, విద్యుత్, సంక్షేమం వంటి అనేక శాఖల్లో కూడా భారీగా బకాయిలు చెల్లించాల్సి ఉంది.

కొన్ని ప్రధాన శాఖల్లో బకాయిల వివరాలు (రూ. కోట్లలో)

శాఖ	బకాయిలు
ఆర్థికశాఖ	19,549
నీటిపారుదల	19,324
గ్రామీణాభివృద్ధి	14,613
పరిశ్రమలు	11,859
గృహనిర్మాణం	7,802
మున్సిపల్	7,729
పెట్టుబడులు	7,610
వైద్య ఆరోగ్యం	6,486

అనంతపురంలో జెసి ప్రభాకర్‌రెడ్డి హల్‌చల్

- అక్రమ కేసులు పెట్టిన వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్‌రెడ్డి అనంతపురంలో టెన్షన్ వాతావరణాన్ని సృష్టించారు. గత ప్రభుత్వంలో తనపై అక్రమ కేసులు బనాయించిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉదయం అనంతపురం వన్‌టౌన్ పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళనకు సిద్ధమయ్యారు. ఇదే డిమాండ్‌పై ఆయన తాడిపత్రి నుంచి 200 వాహనాల్లో తన అనుచరులతో కలిసి అనంతపురం బయల్దేరారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఎస్‌పి ఆదేశాల మేరకు అనంతపురం పాతూరు వద్ద ప్రభాకర్‌రెడ్డిని అడ్డుకున్నారు. తనపై అకారణంగా కేసులు నమోదు చేశారని, వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు మాజీ రవాణా శాఖ మంత్రి నాని, ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ సీతారామాంజనేయులు, డిటిసి శివప్రసాద్‌తో పాటు పలువురిపై కేసులు నమోదు చేసేందుకు ఎస్‌పి అంగీకరించారు. దీంతో ప్రభాకర్‌రెడ్డి ధర్నాను విరమిస్తున్నాని ప్రకటించి, అనంతపురంలోని తన నివాసానికి తిరిగి వెళ్లిపోయారు.

నూతన ఎల్‌టిసిజిపై రియాల్టీ ఆందోళన

న్యూఢిల్లీ : రియాల్ ఎస్టేట్ విక్రయాలపై ఇండెక్సేషన్‌ను తొలగిస్తున్నట్లు బడ్జెట్‌లో మంత్రి సీతారామన్ ప్రకటించడంపై ఆ రంగం వర్గాలు ఆందోళన వ్యక్త చేస్తున్నాయి. రియల్ ఎస్టేట్ రంగంలో దీర్ఘకాలంలో ఎల్‌టిసిజి పన్ను రేటును 20 శాతం నుంచి 12.5 శాతానికి కుదిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఇప్పటివరకు ఉన్న ద్రవ్యోల్బణ సూచీ సర్దుబాటు (ఇండెక్సేషన్)ను తొలగిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కొత్త ప్రతిపాదనలు రియాల్టీ విక్రేతలకు ప్రతికూలంగా ఉన్నాయని ఆ రంగం వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తోన్నాయి. ఇప్పటివరకు రియల్‌ఎస్టేట్ పెట్టుబడులపై ఇండెక్సేషన్‌ను సర్దుబాటు చేసి దానికి అనుగుణంగా ఆస్తి విక్రయం సమయంలో 20 శాతం పన్ను విధించేవారు. ఉదాహరణకు 10 ఏళ్ల కిందట కొనుగోలు చేసిన స్థలాలను విక్రయించేపుడు ఆ పది ఏళ్లకు అనువుగా ద్రవ్యోల్బణాన్ని సర్దుబాటు చేసి(ఇండెక్సేషన్), ఆ స్థలానికి ప్రభుత్వ విలువను లెక్కించి దానిపై 20 శాతం పన్ను విధించేవారు. కొత్త నిబంధనల ప్రకారం ఇండెక్సేషన్‌ను పూర్తిగా తొలగించారు. ఇకపై మార్కెట్ విలువ ప్రకారం స్థలాన్ని విక్రయిస్తే దానిపై 12.5 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు 2024 జులై 23 నుంచి అమల్లోకి వచ్చింది. ఐదేళ్ల కంటే తక్కువ కాలవ్యవధితో పెట్టుబడి పెట్టే వారికి ప్రభుత్వ నిర్ణయం ప్రతికూలంగా ఉంటుందని ఆ రంగం నిపుణులు భావిస్తున్నారు.

కొత్త మార్పులతో లాభమే : ఐటి శాఖ

దీర్ఘకాల మూలధన లాభాల పన్ను రేట్ల (ఎల్‌టిసిజి)లో చేసిన మార్పులతో రియాల్టీ రంగానికి లాభమే ఉంటుందని ఆదాయపు పన్ను శాఖ పేర్కొంది. ఎల్‌టిసిజిని తగ్గించడంతో రియాల్టీ రంగానికి ప్రయోజనం చేకూరుతుందని పేర్కొంది. ఈ రంగంలో రాబడులు సాధారణంగా సంవత్సరానికి 12-16 శాతం మధ్య ఉంటాయి. ఇది ద్రవ్యోల్బణం కంటే చాలా ఎక్కువ. ఆస్తి మన అధీనంలో ఉన్న కాలాన్ని బట్టి ద్రవ్యోల్బణ సూచీ 4-5 శాతంగా ఉంటుంది. ఫలితంగా చాలామంది పన్ను చెల్లింపుదారులకు మార్పుల వల్ల ప్రయోజనమే ఉంటుందని పేర్కొంది. రాబడులు తక్కువగా ఉన్నచోట మాత్రమే పాత పన్ను రేటు ప్రయోజనకరంగా ఉంటుందని.. కానీ రియాల్టీలో అంత తక్కువ రాబడి చాలా అరుదుగా ఉంటుందని తెలిపింది.

సంపాదకీయం

లౌకికతత్వానికి విఘాతం

ప్రభుత్వోద్యోగులు ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరడంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాజ్యాంగ లౌకికతత్వానికి విఘాతం. 1966 నుండి ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ సంబంధిత మంత్రిత్వ శాఖ గుట్టుచప్పుడు కాకుండా జారీ చేసిన ఉత్తర్వులు కొద్దిరోజుల క్రితం వెలుగులోకి వచ్చాయి. వాజ్‌పేయి ప్రభుత్వ హయంలో కూడా తీసుకోని ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఇప్పుడెందుకు తీసుకుందన్న విషయం చర్చనీయాంశంగా మారింది. గడిచిన పది సంవత్సరాల్లోనూ కేంద్రంలో అధికారంలోనే ఉన్న మోడీ ప్రభుత్వానికి అకస్మికంగా ఆ ఉత్తర్వులు అభ్యంతరకరంగా కనిపించాయి? దాదాపు 58 సంవత్సరాలుగా ఉన్న నిషేధాన్ని ఎత్తివేసే ముందు కనీస చర్చను ఎందుకు జరపలేదు? పార్లమెంటు సమావేశాలు ఒకవైపు సమీపిస్తుండగా గుట్టుచప్పుడు కాకుండా ఉత్తర్వులు జారీ చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చింది? ఈ ప్రశ్నలకు ఈ రోజు కాకపోయినా, భవిష్యత్తులోనైనా మోడీ ప్రభుత్వం జవాబు చెప్పక తప్పదు! తాజా లోక్‌సభ ఎన్నికల్లో సొంత మెజార్టీని కోల్పోయిన బిజెపి, త్వరలో జరగనున్న వివిధ రాష్ట్రాల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు మత విద్వేషాలను రెచ్చగొట్టే అవకాశం ఉందన్న అంచనాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే మోడీ ప్రభుత్వం ఈ వివాదాస్పద నిర్ణయం తీసుకుందన్న వాదన సత్యదూరం కాదు.

1964 నాటి సర్వీసు రూల్స్ ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఏ రాజకీయ పార్టీ సభ్యత్వాన్ని కలిగిఉండకూడదు. అంతేకాదు. రాజకీయ కార్యకలాపాలకు ఉపయోగపడే ఎటువంటి ఆందోళనల్లోనూ పాల్గొనకూడదు. ఈ నిబంధనలను ఆధారం చేసుకునే 1966 నవంబర్ 30న కేంద్ర ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్‌తో పాటు జమాతే ఇస్లామీలపై ఈ నిషేధ ఉత్తర్వులను జారీ చేసింది. 1970, 1980లలో ఈ ఆదేశాలకు సంబంధించిన మరిన్ని వివరణలను కూడా కేంద్రం విడుదల చేసింది. ఇప్పుడు ఈ జాబితా నుండి ఆర్‌ఎస్‌ఎస్‌ను మోడీ ప్రభుత్వం మినహాయించింది. ఈ నిర్ణయం తీసుకోవడానికి కారణాలు ఏమిటి? ఆర్‌ఎస్‌ఎస్‌లో ఏమైనా మార్పు వచ్చిందా? ప్రజలను విభజించి రాజకీయ ఆధిపత్యాన్ని దక్కించుకోవాలన్న వ్యూహాన్ని ఏమన్నా మార్చుకుందా? 1948లో మహాత్మా గాంధీ హత్య, 1992లో బాబ్రీ మసీదు కూల్చివేతల సందర్భంగా ఏ విద్వేష విషాన్ని వెదజల్లిందో, ఆ దుర్మార్గపు భావజాలానికే ఇప్పటికీ కట్టుబడి ఉంది. నిజానికి అప్పటికన్నా మరింత ప్రమాదకరంగా మారింది. పది సంవత్సరాల అధికారాన్ని ఉపయోగించుకుని దేశం నలుమూలల చాప కింద నీరులా వ్యాపించింది. పాఠ్యపుస్తకాల్లో, సినిమా కథల్లో చేరింది. పొరుగువారిని అనుమానించే స్థితికి ప్రజలను చేర్చింది. ఇంత ప్రమాదం ముంచుకొస్తుంటే ఏమి మారిందని మోడీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది?

1925 సెప్టెంబర్‌లో విజయదశమి రోజున ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పాటైంది. అప్పటికే జాతీయోద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో ఏర్పాటైన ఈ సంస్థ లక్ష్యం స్వాతంత్ర్య పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయడం కాదు. స్వాతంత్ర్య పోరాటంలో పాలుపంచుకోకపోవడమే దీనికి నిదర్శనం. కుల, మతాలకు అతీతంగా సాగిన భారత స్వాతంత్ర పోరాటాన్ని, భారత జాతీయవాదాన్ని, దానిలో భాగమైన లౌకిక, ప్రజాస్వామ్య భావనలను ప్రారంభంలోనే వ్యతిరేకించింది. అసలైన భారత జాతీయ వాదానికి దూరమౌతూనే హిందూ జాతీయ వాదాన్ని పెంచి పోషించింది. అంతటితో ఆగకుండా ముస్లింలు, క్రిస్టియన్లను లక్ష్యంగా చేసుకుని వారిపై విద్వేషాన్ని రెచ్చగొట్టింది. ఈ కారణంగానే స్వతంత్ర భారత దేశంలో మూడు సార్లు నిషేధానికి ఆర్‌ఎస్‌ఎస్ గురైంది. ఇప్పటికీ ప్రజలను చీల్చి, వారి ఐక్యతను భగ్నం చేసి హిందూ రాజ్యాన్ని ఏర్పాటు చేయడమే ఆ సంస్థ ఆశయం! దీనికి ఆటంకం మన లౌకిక, ప్రజాస్వామ్య రాజ్యాంగం. అందుకే, దీనిని మారుస్తామని గత ఎన్నికల ముందు బిజెపి నేతలు సంకేతాలిచ్చారు. మెజార్టీ రాకపోవడంతో దొడ్డి దోవన అమలు చేయాలని చూస్తున్నారు. రాజ్యాంగం ప్రకారం బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు మతతత్వ భావజాలంతో నడిచే ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల్లో పాల్గొనడం దేశానికి అత్యంత ప్రమాదకరం.

మహనీయుని మాట



అసమర్థులకు అవరోధాలుగా కన్పించేవి సమర్థులకు అవకాశాలుగా కన్పిస్తాయి.
- రవీంద్రనాథ్ ఠాగూర్, విశ్వకవి.

విభజిత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ - పదేళ్ల అభివృద్ధి - కొన్ని ధోరణులు

విశ్లేషణ

డా॥ బి.గంగారావు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విభజించబడి 2024 జూన్ 2వ తేదీకి పదేళ్ళు పూర్తయింది. రాష్ట్ర విభజన అనంతరం పార్టీలు వేరయినా రెండు రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన టిడిపి, బిఆర్‌ఎస్ పార్టీలు ఇంచుమించు ఒకే రకమైన విధానాలు అమలు చేశాయి. 2019లో ఆంధ్ర రాష్ట్రంలో తెలుగుదేశం ఓడిపోయి వైఎస్‌ఆర్‌సిపి అధికారంలోకి వచ్చి నవరత్నాలు, పెట్టుబడులు, వికేంద్రీకరణ, మూడు రాజధానులు ఇలా రకరకాల పథకాలు చేపట్టింది. చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్న కాలంలో కూడా అమరావతి రాజధాని, పెట్టుబడులు, ఐ.టి, ప్రాజెక్టులు, ఇలా వీటి చుట్టూ ఐదేళ్ళ పాలన సాగింది. తెలంగాణలో బిఆర్‌ఎస్ పదేళ్ళు అధికారంలో కొనసాగింది. ఉమ్మడి రాష్ట్రంలో ప్రాంతాల మధ్య అసమానతలు, కేంద్రీకరణ, వెనుకబాటుతనం మొదలగు వాటి వల్ల రాష్ట్రం రెండు ముక్కలయ్యింది. అయితే విభజన అనంతరం గడిచిన పదేళ్ళలో అభివృద్ధి ఎటువైపు సాగుతున్నది? విభజిత లక్ష్యాలు, ప్రజల అభివృద్ధి, ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చే వైపుగా అభివృద్ధి సాగుతున్నదా? అనేది పరిశీలించటానికి ఈ దశాబ్ద విభజన కాలం సరిపోతుంది.

ఈ వ్యాసం ముఖ్యంగా రెండు రాష్ట్రాల అర్థికాభివృద్ధి, తలసరి ఆదాయం, ఆర్థికాభివృద్ధిలో వివిధ జిల్లాలు, రంగాల అభివృద్ధి మధ్య వ్యత్యాసాలు, అభివృద్ధి కేంద్రీకరణ లేదా వికేంద్రీకరణ వైపుగా సాగుతున్నదా? ఆర్థిక వ్యవస్థలో సృష్టించబడుతున్న సంపద సమాజంలో ఉన్న అత్యధిక మంది శ్రమ జీవులకు పంపిణీ అవుతున్నదా? లేదా? వంటి కొన్ని విషయాలకు పరిమితమౌతుంది.

గత దశాబ్ద కాలంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాల్లోనూ ఆర్థిక వృద్ధి కనిపిస్తున్నది. ఆంధ్ర రాష్ట్ర స్థూల ఉత్పతి (జిఎస్‌డిపి) అభివృద్ధి రేటు రాష్ట్ర విభజన అనంతరం టిడిపి ప్రభుత్వ ఐదేళ్ళ (2014-19) కాలంలో స్థిర ధరల్లో సగటున 9.03 శాతం అభివృద్ధి రేటు నమోదయ్యింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైఎస్‌ఆర్‌సిపి ప్రభుత్వ కాలంలో అనగా 2019-24లో సగటున 5.36 శాతం చొప్పున వృద్ధి రేటు సాధించింది.

నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం తొలి ఐదేళ్ళలో సగటున 9.03 శాతం చొప్పున, ఆ తరువాత 2019-24 మధ్య కాలంలో సగటున 4.66 శాతం వృద్ధి రేటు సాధించింది. గత దశాబ్ద కాలంలో ఆంధ్ర రాష్ట్రంలో సగటున 7.34 శాతం, తెలంగాణలో 6.98 శాతం వృద్ధి రేటు ఉంది.

రెండు రాష్ట్రాల స్థూల ఉత్పత్తి (ఎస్‌జిడిపి) విలువను ప్రస్తుత ధరల్లో పరిశీలిస్తే ఆంధ్ర రాష్ట్రంలో 2014-15లో రూ. 5,24,976 కోట్లు ఉండగా 2023-24కి రూ.15,40,000 కోట్లకు పెరిగింది. తెలంగాణ రాష్ట్రంలో ఇదే కాలంలో రూ.5,05,849 కోట్ల నుండి రూ.14,49,708 కోట్లకు పెరిగింది. దేశ జిడిపి లో ఆంధ్ర రాష్ట్ర జిఎస్‌డిపి ర్యాంకు చూస్తే 2014-15లో 8వ ర్యాంకు ఉండగా 2023-24లో కూడా ఇదే ర్యాంకు ఉంది. తెలంగాణ రాష్ట్రం కూడా 9వ ర్యాంకులో కొనసాగుతుంది.

రెండు రాష్ట్రాల్లో పాలకులు అనుసరిస్తున్న ఈ ఉదారవాద కార్పొరేట్ ఆర్థిక నమూనా వల్ల గడిచిన దశాబ్ద కాలంలో...రెండు రాష్ట్రాల్లో పెరుగుతున్న స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయ అంకెలు వాస్తవాన్ని మరుగున పరుస్తున్నాయి. ఆదాయ పున:పంపిణి జరగటంలేదు. వేతనాలు పెరగకపోగా, ఉపాధి రంగంలో ప్రభుత్వం జోక్యం చేసుకోకపోవటం వల్ల పెద్ద ఎత్తున శ్రమ దోపిడీ జరుగుతూ సంపద కేంద్రీకరణ దిశగా సాగుతున్నది. తెలంగాణలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్ పరిధిలోనే సంపద పోగుపడుతున్నది. ఆంధ్ర రాష్ట్రంలో అభివృద్ధి కొన్ని జిల్లాలకే అది కూడా కొన్ని ప్రాంతాలకే పరిమితమైంది.

ఉదారవాద ఆర్థిక విధానాలను దేశంలో ప్రవేశపెట్టిన తరువాత పాలకులు స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయాల పెరుగుదల మీద కేంద్రీకరిస్తున్నారు. వృద్ధి రేటు పెరిగితే ఆటోమేటిక్‌గా ప్రజల మధ్య అసమానతలు తగ్గుతాయని, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని భ్రమ కల్పిస్తున్నారు. వాస్తవంగా ఈ దశాబ్ద కాలంలో రెండు రాష్ట్రాలలో వృద్ధి రేటు బాగా పెరుగుతున్నా సంపద కేంద్రీకరణ, అసమానతలు తగ్గకపోగా తీవ్రంగా కొనసాగుతున్నాయి. జిల్లాలు, వివిధ రంగాల మధ్య సంపద కేంద్రీకరణ, అసమానతలు రెండు రాష్ట్రాలలో చూడొచ్చు.

ఆంధ్ర రాష్ట్ర స్థూల ఉత్పత్తి 2021-22లో ఉమ్మడి (విభజన జిల్లాల సమాచారం అందుబాటులో లేకపోవడం వలన) 13 జిల్లాల్లో కృష్ణా (14 శాతం), విశాఖపట్నం (12 శాతం), తూర్పు గోదావరి (11 శాతం), పశ్చిమ గోదావరి (10 శాతం) జిల్లాల వాటా 47 శాతం ఉంది. శ్రీకాకుళం (4 శాతం), విజయనగరం (4 శాతం) జిల్లాలు అట్టడుగునే ఉన్నాయి. మిగిలిన గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలు రాష్ట్ర జిఎస్‌డిపిలో 5 నుండి 8 శాతం మధ్య వాటాతో గత పదేళ్ళ నుండి కొనసాగుతున్నాయి.

ఆంధ్ర రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల వాటాలను పరిశీలిస్తే వ్యవసాయ రంగం వాటా రాష్ట్ర జిఎస్‌డిపిలో 2014-24 మధ్య 30.39 నుండి 36.1 శాతానికి పెరుగుతూ వ్యవసాయ రాష్ట్రంగా మారుతున్నది. పారిశ్రామిక రంగం వాటా 25.17 నుండి 23.36 శాతానికి, సేవా రంగం వాటా 44.61 నుండి 40.45 శాతానికి దిగజారింది. జిడిపిలో వ్యవసాయ రంగం వాటా పెరుగుతుందంటే వ్యవసాయం మీద ఆధారపడిన ప్రజల ఆదాయాలు పెరుగుతున్నట్లుగా భావిస్తే అది పొరపాటు. వాస్తవంగా రైతాంగ ఆదాయం క్షీణిస్తున్నది. వ్యవసాయ రంగంలో ఆహార పంటల మీద 80 శాతం ప్రజలు ఆధారపడి ఉంటారు. కానీ వ్యవసాయ రంగంలో ఆహార పంటల నుండి 2022-23లో కేవలం 12.31 శాతం ఆదాయం మాత్రమే సమకూరింది. పౌల్ట్రీ, పశు సంబంధిత, రొయ్యలు, చేపల నుండి ఆదాయం పెరుగుతూ నేడు 57.35 శాతానికి చేరింది. ఉద్యానవనాలను కూడా కలుపుకుంటే 85.44 శాతానికి పెరుగుతుంది. అంటే వ్యవసాయ రంగంలో కేవలం కొద్దిమంది ఆధారపడిన రొయ్యలు, చేపలు, పౌల్ట్రీ, మాంసం వంటి వాటి నుండి అత్యధిక ఆదాయం వస్తున్నది. ఈ మార్పులు వ్యవసాయ రంగంలో కొద్దిమంది చేతుల్లో సంపద పోగుపడుతున్నట్లు, ఉపాధి తగ్గిపోతున్నట్లు తెలియజేస్తున్నాయి.

గడిచిన తొమ్మిదేళ్ళలో ఆంధ్ర రాష్ట్రంలో జిల్లాల స్థూల ఉత్పత్తి విలువను పరిశీలిస్తే చేపలు, రొయ్యలు, పౌల్ట్రీ ఎక్కువగా ఉన్న జిల్లాల్లో వ్యవసాయం నుండి ఎక్కువ ఆదాయం వస్తున్నది. ఉదాహరణకు పశ్చిమ గోదావరి జిల్లాలో 56.8 శాతానికి వ్యవసాయ రంగం నుండి ఆదాయం వస్తున్నది. అలాగే విజయనగరం, విశాఖ, తూర్పు గోదావరి, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కూడా ఈ ధోరణి మనకి కన్పిస్తున్నది. ఈ జిల్లాల స్థూల ఉత్పత్తిలో వ్యవసాయ రంగం నుండి 40 శాతం పైన ఆదాయం వస్తున్నది.

జిల్లాల స్థూల ఉత్పత్తి విలువలో పారిశ్రామిక రంగం వాటాను పరిశీలిస్తే చాలా ఆందోళనకర పరిస్థితి కొనసాగుతున్నది. గత పదేళ్ళలో పెట్టుబడుల సదస్సులు పెట్టినా పారిశ్రామిక అభివృద్ధి కనిపించడం లేదు. ప్రభుత్వ పెట్టుబడులు లేకుండా పోయాయి. ఫలితంగా 2014-22 మధ్యకాలంలో 9 జిల్లాల్లో ఆ జిల్లాల స్థూల ఉత్పత్తిలో పారిశ్రామిక రంగం వాటా క్షీణిస్తూ వస్తున్నది. విశాఖపట్నం జిల్లాలో సైతం ఈకాలం లో 36.3 నుండి 33.4 శాతానికి పడిపోయింది. విజయనగరం, పశ్చిమ గోదావరి, కృష్ణా, ప్రకాశం, అనంతపురం, కర్నూలులో 2021-22 నాటికి పారిశ్రామిక రంగం వాటా ఆయా జిల్లాల స్థూల ఉత్పత్తిలో 20 శాతం లోపుగానే ఉంది. పశ్చిమ గోదావరి జిల్లాలో కేవలం 16.1 శాతంలోనే నేటికి కొనసాగుతుంది.

సేవారంగంలో పరిస్థితి కూడా పారిశ్రామిక రంగం వలే తొమ్మిది జిల్లాల్లో దాని వాటా తగ్గుతూ వస్తున్నది. పశ్చిమ గోదావరి జిల్లాలో 2014-22 మధ్య కాలంలో 31.5 నుండి 27.1 శాతానికి, కృష్ణాలో 52.2 నుండి 43.3 శాతానికి, నెల్లూరులో 38.6 నుండి 32.9 శాతానికి, చిత్తూరులో 43.2 నుండి 37.4 శాతానికి సేవారంగం వాటా దిగజారింది. విజయనగరం, గుంటూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల్లో సేవా రంగం వాటా గత తొమ్మిదేళ్ళలో ఎదుగుబొదుగు లేకుండా ఉంది. కేవలం విశాఖపట్నం జిల్లాలో మాత్రమే 50 నుండి 52.6 శాతానికి పెరిగింది.

ఇక తెలంగాణలో చూస్తే 2014-23 మధ్య కాలంలో రాష్ట్ర జిడిపిలో వ్యవసాయ రంగం వాటా 19 శాతం చుట్టూ కొనసాగుతుండగా, పారిశ్రామిక రంగం వాటా 19.2 శాతం నుండి 17.3 శాతానికి తగ్గింది. పారిశ్రామిక రంగలో ముఖ్యమైన తయారీ రంగం చూస్తే రాష్ట్ర జిడిపిలో 11 శాతం వాటాకి పడిపోయింది. కేవలం సేవారంగం వాటా మాత్రమే 61.3 శాతం నుండి 62.9 శాతానికి స్వల్పంగా పెరిగింది. 23 శాతం వాటాతో రియల్ ఎస్టేట్ తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నది. ఐటి రంగంపై ఆధారపడి ఈ స్పెక్యులేటివ్ బూమ్ కొనసాగుతున్నది.

ఆంధ్ర రాష్ట్రం వలే తెలంగాణలో కూడా వ్యవసాయ రంగంలో ఆహార పంటల నుండి వచ్చే ఆదాయం కంటే పౌల్ట్రీ, మాంసం, పశుసంపద నుండి వచ్చే ఆదాయం గణనీయంగా పెరుగుతున్నది. 2022-23 సంవత్సరంలో వివిధ రకాల పంటల నుండి రూ.1,08,269 కోట్లు రాగా, పౌల్ట్రీ, మాంసం, పశుసంబంధిత ఆదాయం రూ.95,955 కోట్ల ఆదాయం వచ్చింది.

జిల్లాల స్థూల ఉత్పత్తి పురోగతిని చూస్తే తెలంగాణ రాష్ట్రంలో కూడా ఆంధ్ర రాష్ట్రంలో వలే జిల్లాల మధ్య అసమానతలు, సంపద కేంద్రీకరణ పెరుగుతున్నట్లు తెలుస్తున్నది. 2022-23 లెక్కలను పరిశీలిస్తే రంగారెడ్డి, హైదరాబాద్, మల్కాజ్‌గిరి మూడు జిల్లాలు కలిపి 43.72 శాతం రాష్ట్ర జిడిపిలో భాగస్వామ్యం ఉన్నాయి. మిగిలిన 30 జిల్లాల్లో 6 వేల నుండి 15 వేల కోట్ల రూపాయల లోపు 10 జిల్లాలు, 15 వేల నుండి 25 వేల కోట్ల రూపాయల లోపు 12 జిల్లాలు, 25 వేల నుండి 55 వేల కోట్ల రూపాయల లోపు 5 జిల్లాలు రాష్ట్ర జిడిపిలో వాటాతో ఉన్నాయి. దీనినిబట్టి తెలంగాణలో జరుగుతున్న అసమాన అభివృద్ధిని అర్థం చేసుకోవచ్చు.

తలసరి ఆదాయం చూస్తే రెండు రాష్ట్రాలు దేశ తలసరి ఆదాయం సగటు కంటే ఎక్కువగా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటి ర్యాంకులో ఉండగా ఆంధ్ర రాష్ట్రం మాత్రం 16వ ర్యాంకులో ఉంది. తెలంగాణలో తలసరి ఆదాయం రూ.1,24,104 నుండి రూ.3,08,732కు, ఆంధ్ర రాష్ట్రంలో రూ.93,903 నుండి రూ.2,42,479కు గత దశాబ్ద కాలంలో పెరిగింది.

కానీ తలసరి ఆదాయంలో తెలంగాణ, ఆంధ్రా రెండింటిలోను జిల్లాల మధ్య అసమానతలు పెరుగుతూ వస్తున్నాయి. తెలంగాణలో 2022-23లో మొత్తం 33 జిల్లాల్లో కేవలం రెండు జిల్లాలు మాత్రమే రాష్ట్ర తలసరి ఆదాయ సగటు కంటే ఎక్కువ ఆదాయంతో ఉన్నాయి. రంగారెడ్డి రూ. 7,58,102, హైదరాబాద్ రూ.4,02,941 తలసరి ఆదాయం ఉండగా, సంగారెడ్డి జిల్లా రాష్ట్ర సగటుకి కొంచెం తక్కువగా అనగా రూ.3,01,870గా ఉంది. మిగిలిన 30 జిల్లాలు రాష్ట్ర సగటు తలసరి ఆదాయానికి చాలా దూరంలో దిగువన ఉన్నాయి.

ఆంధ్ర రాష్ట్రంలో 2021-22లో తలసరి ఆదాయం రూ.1,92,587గా ఉండగా మొత్తం ఉమ్మడి 13 జిల్లాలో 5 జిల్లాలు అనగా కృష్ణా (రూ.2,88,551), విశాఖపట్నం (రూ.2,64,225), పశ్చిమ గోదావరి (రూ.2,33,898), నెల్లూరు (రూ.2,12,216), తూర్పు గోదావరి (రూ.1,97,894), జిల్లాలు మాత్రమే రాష్ట్ర తలసరి ఆదాయం సగటుకి ఎగువ భాగాన ఉన్నాయి. ఈ జిల్లాల్లో కూడా కేవలం కొన్ని మండలాల్లో మాత్రమే అత్యధిక తలసరి ఆదాయం ఉంది. మిగిలిన ఏడు జిల్లాలు రాష్ట్ర సగటుకు దిగువ స్థాయిలో ఉన్నాయి. ఎప్పటిలాగే విజయనగరం (రూ.1,28,194), శ్రీకాకుళం (రూ.1,28,820) జిల్లాలు 12,13 ర్యాంకులతో అట్టడుగునే పదేళ్ళ నుండి కొనసాగుతున్నాయి.

రెండు రాష్ట్రాల్లో పాలకులు అనుసరిస్తున్న ఈ ఉదారవాద కార్పొరేట్ ఆర్థిక నమూనా వల్ల గడిచిన దశాబ్ద కాలంలో రెండు రాష్ట్రాల్లో పెరుగుతున్న స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయ అంకెలు వాస్తవాన్ని మరుగున పరుస్తున్నాయి. ఆదాయ పున:పంపిణి జరగటంలేదు. వేతనాలు పెరగకపోగా, ఉపాధి రంగంలో ప్రభుత్వం జోక్యం చేసుకోకపోవటం వల్ల పెద్ద ఎత్తున శ్రమ దోపిడీ జరుగుతూ సంపద కేంద్రీకరణ దిశగా సాగుతున్నది. తెలంగాణలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్ పరిధిలోనే సంపద పోగుపడుతున్నది. ఆంధ్ర రాష్ట్రంలో అభివృద్ధి కొన్ని జిల్లాలకే అది కూడా కొన్ని ప్రాంతాలకే పరిమితమైంది. వివిధ జిల్లాల స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయాల్లో ఇది స్పష్టంగా కన్పిస్తున్నది. జిల్లాల మధ్య అంతరాలు తగ్గకపోగా వ్యవసాయ రంగంలో స్థూల ఉత్పత్తి పెరిగినా వ్యవసాయంపై ఆధారపడ్డ ప్రజల ఆదాయాలు పడిపోవటం, ఉపాధి కోల్పోవటం జరుగుతున్నది. రెండు రాష్ట్రాల్లోనూ భూ కేంద్రీకరణ జరుగుతున్నది. భవిష్యత్‌లో ఉభయ రాష్ట్రాల్లో ఆర్థిక అసమానతలు మరింత తీవ్రం కానున్నాయి.

(వ్యాసకర్త సెల్ : 9490098792)

మతం దారిలో యోగి, పావులు కదుపుతున్న మో-షా!

వ్యాఖ్య

ఎం. కోటేశ్వరరావు

లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి దిమ్మతిరిగింది. గుండెకాయ వంటి ఉత్తరప్రదేశ్‌లో చెప్పుకోలేని దెబ్బ తగిలింది. దీంతో పార్టీలో చదరంగం, వైకుంఠపాళీ క్రీడలు ప్రారంభమయ్యాయి. ఆ రాష్ట్రంలోని 80 లోక్‌సభ స్థానాలకు గాను బిజెపికి 2014లో 72, గత ఎన్నికల్లో 62 రాగా ఇప్పుడు 33కు పడిపోయాయి. సమాజవాది పార్టీకి 37, దాని మిత్రపక్షమైన కాంగ్రెస్‌కు ఆరు స్థానాలు వచ్చాయి. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్, ఉప ముఖ్యమంత్రి కేశవ ప్రసాద్ మౌర్య ఎడముఖం పెడముఖంగా ఉన్నారు. యోగిని తప్పించి తిరిగి గోరఖ్‌పూర్ మఠానికి పంపేందుకు నరేంద్ర మోడీ, అమిత్ షా పూనుకున్నారనే వార్తలు గుప్పుమన్నాయి. మరోవైపు పార్టీ, ప్రభుత్వం మొత్తం తన వెనుకే ఉందని చూపేందుకు యోగి వరుసగా సమావేశాలు జరుపుతూ బల ప్రదర్శనకు పూనుకున్నారు. మొత్తం మీద మిగతా పార్టీలకూ బిజెపికీ పెద్ద తేడా లేదని జనాల కళ్లు తెరిపిస్తున్నారు.

ఉత్తర ప్రదేశ్‌లో అయోధ్య రామాలయం ఉన్న ఫైజాబాద్‌తో సహా అనేక కీలక నియోజక వర్గాలలో బిజెపి మట్టికరచింది. నరేంద్ర మోడీ పోటీ చేసిన వారణాసి నియోజకవర్గంలో గతంలో వచ్చిన మెజారిటీ 4.79 లక్షల నుంచి 1.52 లక్షలకు దిగజారింది. అంతా మీరే చేశారు, అన్నింటికీ మీరే కారణం అన్నట్లుగా ఓటమి కారణాలను యోగి మీదకు నెట్టేందుకు పావులు కదుపుతున్నారు. అభ్యర్థుల ఎంపికలో తన ప్రమేయం లేదని యోగి చెబుతున్నారు. నిజానికి ఈ రాష్ట్ర బిజెపిలో ఎప్పటి నుంచో కుమ్ములాటలు ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికల తరువాత యోగిని ఇంటికి పంపుతారన్న ప్రచారం ముందే ఉంది. మూడోసారి మోడీ గెలిస్తే యోగికి మూడినట్లే అనే విశ్లేషణలు వెలువడ్డాయి. ఎన్నికలలో చావు దెబ్బ తినటంతో యోగి వ్యతిరేకులకు, అనుకూలురకు కూడా మంచి ఊపు వచ్చింది.



గుజరాత్‌లోని రాజ్‌కోట్ నియోజకవర్గ అభ్యర్థి, కాబినెట్ మంత్రి పురుషోత్తం రూపాలా రాజపుత్రుల మీద విరుచుకుపడ్డారు. రోటీ బేటీ కా సాత్-రాజపుత్రులు బ్రిటీష్ వారికి వారి కుమార్తెలనిచ్చి వివాహాలు చేశారని, బ్రిటీష్ వారితో చేతులు కలిపారని ధ్వజమెత్తారు. ఇది గుజరాత్‌తో పాటు ఉత్తర భారతంలో రాజపుత్రులున్న చోటల్లా వారికి ఆగ్రహం తెప్పించింది. మధ్య ప్రదేశ్‌లో ఠాకూర్లను పక్కన పెట్టినట్లుగానే ఉత్తర ప్రదేశ్‌లో వికె సింగ్, నరేంద్ర సింగ్ తోమర్ వంటి కీలక నేతలను ఇంటికి పంపారు. రక్షణ మంత్రిగా ఉన్నప్పటికీ రాజనాథ్ సింగ్‌ను కూడా పక్కన పెట్టినట్లుగానే భావిస్తున్నారు. ఆ కారణంగానే ఎక్కడా పెద్దగా మాట్లాడరు. ఆగ్రహంతో ఉన్న ఠాకూర్లను బుజ్జగించేందుకు అధిష్టానం ఇప్పుడు రాజనాథ్‌ను ఎంచుకుందని వార్తలు వచ్చాయి. వారిని సంతుష్టీకరించే ప్రక్రియలో భాగంగా అమిత్ షా ఇప్పటికే కొందరు నేతలతో రహస్య మంతనాలు జరిపారు. ఠాకూర్లలో పలుకుబడి కలిగిన రాజా భయ్యాను చేరదీసి వారిలో చీలిక తెచ్చి ఠాకూర్లను విస్మరించలేదనే సందేశంతో యోగికి పోటీ నేతగా ముందుకు తెచ్చే ఎత్తుగడ దీనిలో ఉంది. ఈ పరిణామం మీద ఆ సామాజిక తరగతి ఎలా స్పందించేదీ చూడాల్సి ఉంది. దీంతో యోగిని సాగనంపటం ఎలా అన్నది ఆసక్తికరంగా మారింది.

ఇటీవల ఏడు రాష్ట్రాల్లో జరిగిన 13 అసెంబ్లీ ఉప ఎన్నికల్లో పది చోట్ల 'ఇండియా' వేదిక గెలిచింది. ఉత్తర ప్రదేశ్‌లో ఓటమికి యోగి కంటే ప్రధానిగా నరేంద్రమోడీ ఎక్కువగా బాధ్యత వహించాలి. చివరకు తన మెజారిటీ తగ్గటానికి కూడా వేరే వారిని నిందిస్తే కుదరదు. యోగి ఒక్కరే సర్వస్వం కాదు అన్న సందేశం ఇచ్చేందుకు ఇద్దరు ఉప ముఖ్యమంత్రులను అధిష్టానం నియమించింది. ప్రతి చిన్న విషయాన్ని ప్రధాని కార్యాలయం నియంత్రిస్తోందనే విమర్శలూ ఉన్నాయి. రాష్ట్ర డిజిపి నియామకంలో తనకు ఇష్టమైన వారిని ఎంచుకొనేందుకు యోగికి అవకాశం ఇవ్వటం లేదు. తొలిసారి అధికారానికి వచ్చినపుడు ఎంతో వత్తిడితో ఒకరిని నియమించినా తరువాత నలుగురు తాత్కాలిక డిజిపిలు తప్ప శాశ్వత నియామకాలు లేవు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విషయంలో కూడా అదే జరిగింది. మంత్రివర్గం నుంచి యోగి అనుకూల సూర్య ప్రతాప షాహిని తొలగించి వ్యతిరేకిగా ఉన్న శివ ప్రతాప శుక్లాకు కట్టబెట్టారు. ఒక విధంగా యోగిని పొమ్మనకుండా పొగబెట్టారు. రెండవసారి గెలిచిన తరువాత కూడా అదే జరిగింది. తీవ్రంగా వ్యతిరేకించినా ఇద్దరిని మంత్రులుగా చేర్చారు. వారిలో ఒకరు ఉప ఎన్నికలో ఓడిన తరువాత సమాజవాది పార్టీలో చేరారు. ప్రస్తుతం ఇద్దరిలో ఒకరైన ఉపముఖ్యమంత్రి కేశవ ప్రసాద్ మౌర్యకు మోడీ, షా మద్దతు ఉందని, అందువల్లనే ప్రభుత్వం కంటే పార్టీ గొప్పదని తాజాగా ధ్వజమెత్తినట్లు చెబుతున్నారు.పార్టీ కార్యకర్తల బాధ తనకు తెలుసునని మౌర్య అనటాన్ని యోగి మద్దతుదార్లు తప్పు పడుతున్నారు. అతను ఉప ముఖ్యమంత్రి కాదా ? కార్యకర్తలను పట్టించుకోవాల్సిన అవసరం లేదా ?అది చేయకుండా ప్రతికూల ప్రచారం ఏమిటంటూ ప్రశ్నిస్తున్నారు.

తన పదవికి ఎసరు పెడుతున్నారని గ్రహించిన యోగి జాగ్రత్తగా పావులు కదుపుతున్నారు. ఇంతవరకు ఎక్కడా బహిరంగంగా ప్రతికూల వ్యాఖ్యలు చేయలేదు. తన అనుచరులను రంగంలోకి దించారు. ప్రభుత్వం కంటే పార్టీ గొప్పదన్న కేశవ ప్రసాద్ మౌర్య వ్యాఖ్యపై వెంటనే పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌కు చెందిన పార్టీ నేత సునీల్ భరాలా స్పందించారు." ఎన్నికలలో ఎదురుదెబ్బలు, ఓటమికి పార్టీయే కారణమని గౌరవనీయ ఉపముఖ్యమంత్రి కెపి మౌర్య వ్యాఖ్యలు సూచిస్తున్నాయి.కనుక పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భూపేంద్ర చౌదరి నష్టాలకు నైతిక బాధ్యత వహిస్తూ పదవికి రాజీనామా చేయాలి " అని ఎక్స్ ద్వారా డిమాండ్ చేశారు. ఈ పోస్టును తొలగించేందుకు బిజెపి కేంద్ర పెద్దలు తెచ్చిన వత్తిడికి ఇప్పటివరకైతే భరాలా లొంగలేదు. గతంలో పార్టీ ఓడినపుడు కల్‌రాజ్ మిశ్రా, వినయ్ కతియార్ రాజీనామా చేశారని కూడా గుర్తుచేశారు. బిజెపి మురికివాడల విభాగపు జాతీయ కన్వీనర్‌గా భరాలా ఉన్నారు.ఇలాంటి వారు అనేక మంది యోగి కనుసైగల కోసం ఎదురు చూస్తున్నారు. తన అనుచరులకు సీట్లు ఇవ్వకపోతే ఏం చేస్తానో చూడండి అన్నట్లుగా యోగి చూపారు. ఆయన కనుసన్నలలో నడిచే హిందూ యువ వాహిని స్వతంత్ర అభ్యర్థులకు మద్దతు ప్రకటించింది. ఉప ఎన్నికలలో ప్రతికూల ఫలితాలు వస్తే తనపై వేటు పడుతుందని గ్రహించిన యోగి ఆ నియోజకవర్గాలకు 16 మంది మంత్రులను కేటాయించారు. ఎన్నికలు ముగిసేవరకు వారంలో రెండు రోజులు మంత్రులు అక్కడే మకాం వేయాలని ఆదేశించారు. గెలిస్తే తన ప్రతిభ లేకపోతే మంత్రులు సరిగా పనిచేయలేదని చెబుతారు.

ఆకస్మికంగా ప్రభుత్వం మీద జనాలకు ఆగ్రహం కలిగేందుకు దారితీసిన పరిస్థితులు ఏమిటంటూ బిజెపి ఎంఎల్‌సి దేవేంద్ర ప్రతాప్ సింగ్ సిఎం కు లేఖ రాశారు. రాష్ట్రంలో పరిస్థితి దారుణంగా ఉన్నందున కేంద్ర నాయకత్వం జోక్యం చేసుకోవాలన్న ఎంఎల్‌ఏ రమేష్ మిశ్రా వీడియో వైరల్ అవుతోంది. బిజెపి మిత్ర పక్షం నిషాద్ నేత సంజయ్ నిషాద్ కూడా యోగిపై ధ్వజమెత్తారు. బుల్డోజర్లను మాఫియాలు, భూ కబ్జాదారులపై ప్రయోగించాలి తప్ప తగిన పత్రాలు లేని పేదల ఇళ్లు కూల్చివేతకు ఉపయోగించరాదని, అలా చేస్తే ఎన్నికల్లో మనల్ని ఓడించేందుకు వారు సంఘటితం అవుతారని, అనేక ఉదంతాలలో అధికారులు అలాంటి కూల్చివేతలకు పాల్పడ్డారని అన్నారు. అతి విశ్వాసం, ఓట్ల బదిలీ మన అంచనాలను దెబ్బ తీశాయి. ఫైజాబాద్ (ఆయోధ్య ఉన్న నియోజకవర్గం) వంటి గట్టి ప్రాంతాల్లో ఓడిపోవటానికి కొన్ని కులాలు దూరం కావటమే కారణమని, ఓబిసి కులాల, దళితుల మద్దతు తిరిగి పొందాలంటే ఓబిసి నేత, ఉప ముఖ్యమంత్రి, ఆర్‌ఎస్‌ఎస్ మద్దతు ఉన్న మౌర్యకు పెద్ద పదవి ఇవ్వాల్సి ఉంటుందని యోగి వ్యతిరేకులు ప్రచారం చేస్తున్నారు. మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికలతో పాటు రాష్ట్రంలో పది స్థానాలకు ఉప ఎన్నికలు జరుగుతాయని, తరువాత యోగికి ఉద్వాసన ఖాయమని చెబుతున్నారు. అధికారం అందరినీ కలిపి ఉంచుతుంది. దానికి ముప్పు సూచనలు కనిపిస్తే అసలు రంగు తెలుస్తుంది. ఇప్పుడు ఉత్తర ప్రదేశ్ బిజెపిలో జరుగుతున్న పరిణామాలు దీన్నే వెల్లడిస్తున్నాయి.

ఫేక్ ప్రచారమే వైసిపి సిద్ధాంతం

- హోంమంత్రి అనిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో విధ్వంస పాలన జరుగుతుందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెబుతున్న ప్రచారాన్ని రాష్ట్ర ప్రజలు ఎవరూ నమ్మరని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన హింసపై తెలియక కొన్ని పార్టీలు ఢిల్లీలో జగన్‌మోహన్‌రెడ్డి ధర్నాకు సంఘీభావం తెలిపాయని, వాస్తవాలు తెలిస్తే ఎవరూ మద్దతు ఇవ్వరని అన్నారు. వైసిపి పుట్టుక, సిద్ధాంతమే 'ఫేక్'తో ముడిపడి వుందని విమర్శించారు. శాసనసభా ఆవరణలోని మీడియా పాయింట్‌లో హోంమంత్రి బుధవారం మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలకు డుమ్మాకొట్టి ఢిల్లీ వెళ్లి అబద్దాలతో ప్రచారం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం వచ్చాక నాలుగు రాజకీయ హత్యలు జరిగితే, అందులో తమ పార్టీ వారే ముగ్గురు మరణించారని అన్నారు. వినుకొండ ఘటన కూడా రాజకీయ హత్య కాదని, వ్యక్తిగత హత్య అని సొంత చెల్లె వైఎస్ షర్మిల చెబుతున్న మాటలకు జగన్ సమాధానం చెప్పాలన్నారు. జగన్ ఢిల్లీకి వెళ్లి ఆయన చెబుతున్న 36 హత్యలకు సంబంధించి పేర్లు విడుదల చేయాలన్నారు. అలాగే డ్రైవర్ సుబ్రమణ్యం, డాక్టర్ సుధాకర్, చంద్రయ్య హత్యలకు సంబంధించిన ఫొటోలను కూడా జగన్ ప్రదర్శించాలన్నారు. స్వతహాగా సిబిఐ, ఇడి కేసులు ఎదుర్కొంటున్న జగన్... దువ్వాడ శ్రీనివాస్, అనంతబాబు, విజయసాయిరెడ్డి వంటి నేరస్తులను పక్కనపెట్టుకుని ఢిల్లీలో ధర్నా చేయడం సిగ్గుచేటన్నారు. అధికారం పోయిన వెంటనే జగన్‌కు ప్రత్యేక హోదా గుర్తుకు వస్తుందన్నారు. నాడు 22 మంది పార్లమెంటు సభ్యులు వున్నప్పుడు ఎందుకు అడగలేదని ప్రశ్నించారు.

ఎస్ఎస్ఎన్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం

- జూనియర్లపై సీనియర్ విద్యార్థుల దాడి
- సోషల్ మీడియాలో వైరల్
- నిందితులపై కేసు నమోదు



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో ర్యాగింగ్ కలకలం రేగింది. ఈ ఏడాది ఫిబ్రవరి 2న కళాశాల హాస్టల్లో ఎన్‌సిసి ట్రైనింగ్ పేరుతో జూనియర్లను సీనియర్ విద్యార్థులు కర్రలతో విచక్షణారహితంగా చితకబాదారు. ఇందుకు సంబంధించిన వీడియో బుధవారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విషయం ఈ వెలుగులోకి వచ్చింది. దీంతో, నరసరావుపేట సిఐ సిహెచ్ కృష్ణారెడ్డి కళాశాల వద్దకు చేరుకుని విచారణ చేపట్టారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నరసరావుపేట పల్నాడు రోడ్డులోని ఎస్ఎస్ఎన్ కాలేజీలో ఎన్‌టిఆర్, ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాలకు చెందిన విద్యార్థులు పాలిథామస్, సత్తెనపల్లి ఆనంద్, వై.రవీంద్రరెడ్డి, అంజనాయక్, అజయ్ కుమార్ డిగ్రీ చదువుతున్నారు. ఎన్‌సిసిలో ఉన్న వీరంతా అర్ధరాత్రి వేళ తమ జూనియర్లను తమ గదులకు పిలిపించుకుని ర్యాగింగ్ చేయడంతోపాటు కర్రలతో విచక్షణారహితంగా కొడుతూ పైశాచిక ఆనందం పొందారు. దీన్ని ఓ విద్యార్థి వీడియో తీశారు. ర్యాగింగ్‌కు పాల్పడిన వారిలో కొందరు ఇప్పటికే తమ చదువులు పూర్తి చేసుకుని వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నారు. తాజాగా విద్యార్థులు సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో ఈ ఘటన వైరల్ అయ్యింది. నిందితుల్లో ఒకరైన పాల్ థామస్ పోలీసు అదుపులో ఉన్నారు. ఈ ఘటనపై తొలుత సుమోటోగా కేసు నమోదు చేశారు. బాధితుల్లో ఒక విద్యార్థి తన కుటుంబసభ్యులతో వచ్చి ఫిర్యాదు చేయడంతో ఐదుగురు విద్యార్థులపై ర్యాగింగ్, ఎస్సి, ఎస్‌టి అట్రాసిటీ కింద కేసులు నమోదు చేశారు.

సమగ్ర విచారణ చేయాలి : ఎస్ఎఫ్ఐ

ర్యాగింగ్ ఘటనపై ప్రత్యేక కమిటీతో సమగ్ర విచారణ చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.సాయికుమార్ డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు జరగకుండా కాలేజీ యాజమాన్యం, హాస్టల్ సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

రాజకీయ కారణాలతోనే...

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

రాజకీయ కారణాలతోనే డాక్టర్ ఎన్‌టిఆర్ విశ్వవిద్యాలయం పేరును గత ప్రభుత్వం మార్చిందని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ,వైద్య విద్యాశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం పేరును డాక్టర్ ఎన్‌టిఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయంగా మార్పుచేయా ప్రవేశపెట్టిన బిల్లుపై శాసన మండలిలో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ యూనివర్శిటీ పేరు మార్పుతో ఇక్కడ చదివి బయటకు వచ్చిన విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని చెప్పారు.

రాజకీయ విద్వేషంతో పేర్లు మార్పు సరైనది కాదు : పిడిఎఫ్

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం పేరును డాక్టర్ ఎన్‌టిఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయంగా మార్చుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు పిడిఎఫ్ మద్దతు ఇస్తుందని పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ. వెంకటేశ్వరరావు తెలిపారు. గత ప్రభుత్వం పేర్ల పిచ్చితోనే రాత్రికి రాత్రి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ విదేశీ విద్యా పథకం పేరును మార్చిందన్నారు. వైసిపి సభ్యులు గైర్హాజరు కావడంతో ఈ బిల్లును మూజువాణి ఓటుతో మండలి ఆమోదించింది.

వైసిపి ప్రభుత్వంలో చతికిలపడ్డ వ్యవస్థలు

- రెవెన్యూశాఖ మంత్రి అనగాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భూ ఆక్రమణలు అడ్డుకోవాల్సిన అన్ని వ్యవస్థలూ వైసిపి ప్రభుత్వంలో చతికిల పడ్డాయని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రతో కలిసి టిడిపి కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజాదర్బార్' కార్యక్రమంలో బుధవారం వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వ అరాచకాలు, వైసిపి నేతల భూ ఆక్రమణలపై ప్రజల నుంచి పెద్దయెత్తున వినతిపత్రాలు వస్తున్నాయని చెప్పారు. భూ ఆక్రమణలపై వచ్చిన వినతిపత్రాలను విశాఖ నుంచి అధికారుల బృందం పరిశీలించి సంబంధిత శాఖలకు పంపుతామని, వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కష్టపడిన వారికి గుర్తింపు లేదు

- వైసిపికి మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య రాజీనామా

ప్రజాశక్తి - గుంటూరు సిటీ

పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య వైసిపికి రాజీనామా చేశారు. గుంటూరులోని తన అనుచరులతో బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపిపై తీవ్ర విమర్శలు చేశారు. కష్టపడిన వారికి పార్టీలో గుర్తింపు ఉండదన్నారు. సీనియర్ నేత ఉమ్మారెడ్డి అనుభవాన్ని వినియోగించుకోలేదని, మండలిలో ప్రతిపక్ష నేత విషయంలో కనీసం చర్చించలేదని తెలిపారు. అనుభవం ఉన్న ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లుకు మండలిలో ప్రతిపక్షనేతగా అవకాశం ఇవ్వకుండా లేళ్ల అప్పిరెడ్డిని ఎంపిక చేయడంపై మండిపడ్డారు. గుంటూరు నుంచి ఎంపి అభ్యర్థిగా పోటీ చేసిన సమయంలో పార్టీలో కొందరు వ్యక్తులు తనను మానసికంగా కుంగదీశారని తెలిపారు. ఎన్నికల తర్వాత కూడా వారి ఇష్టాలతోనే పార్టీని నడుపుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో తాను పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశానని తెలిపారు.

స్మార్ట్ మీటర్ల కాంట్రాక్టుపై పిల్

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలో వ్యవసాయ విద్యుత్ మోటార్లకు స్మార్ట్ మీటర్లను బిగించే కాంట్రాక్టు షిర్డి సాయి ఎలక్ట్రికల్స్‌కు అప్పగించడాన్ని సవాల్ చేసిన కేసులో కౌంటర్ వేయాలని విద్యుత్ పంపిణీ సంస్థలకు హైకోర్టు నోటీసులిచ్చింది. విచారణను సెప్టెంబరు 18కి వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ నైనాల జయసూర్యతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వ్యవసాయ విద్యుత్ మోటార్లకు స్మార్ట్ మీటర్లు, అనుబంధ పరికరాలను బిగించే కాంట్రాక్టును షిర్డీసాయి ఎలక్ట్రికల్స్‌కు అప్పగించడాన్ని సవాలు చేస్తూ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు.

ఎపి విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడాన్ని పిటిషనర్ తప్పుపట్టారు. రూ.6 వేలు విలువ చేసే మీటర్లను రాష్ట్ర ప్రభుత్వం రూ.28 వేలుగా నిర్ణయించిందన్నారు.

జెఎన్‌టియు రిజిస్ట్రార్‌కు ఊరట

కాకినాడ జెఎన్‌టియు రిజిస్ట్రార్‌పై కేసు నమోదు చేయాలని సిఐడికి సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు అమలును నిలిపేస్తూ డివిజన్ బెంచ్ స్టే ఆదేశాలు జారీ చేసింది. అర్హత లేని 48 కాలేజీలు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) నుంచి అటానమస్ హోదా పొందే విషయంలో ఆ కాలేజీలతో కుమ్మక్కై, ఎన్‌ఒసి ఇచ్చారంటూ జోసెఫ్ శ్రీహర్ష, ఇంద్రజా ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ కెవికె రావు వేసిన పిటిషన్‌లో రిజిస్ట్రార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని సిఐడిని ఆదేశిస్తూ సింగిల్ జడ్జి ఇటీవల తీర్పు చెప్పారు. దీనిని సవాల్ చేస్తూ రిజిస్ట్రార్ లింగంగుంట సుమలత దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ నైనాల జయసూర్యతో కూడిన ధర్మాసనం విచారణ జరిపి మధ్యంతర స్టే ఆదేశాలు జారీ చేసింది.

గనులు తవ్వాక గుంతలు పూడ్చాల్సిందే

గనుల తవ్వకాలు చేసిన కంపెనీలు, వ్యక్తులు ఆ గుంతలను అలాగే వదిలేయడంపై హైకోర్టు ఆగ్రహించింది. గుంతలను పూడ్చివేయని కంపెనీలు, వ్యక్తులపై చర్యలు తీసుకోవాలంది. గుంతలను అలాగే వదిలేసిన కంపెనీలు, వ్యక్తుల వివరాలు ఇవ్వాలని గనుల శాఖను ఆదేశించింది. గుంతలు పూడ్చని వారిపై తీసుకున్న చర్యలు తెలియజేయాలంది. కోర్టుకు సహకరించేందుకు సీనియర్ న్యాయవాది కె శ్రీనివాస మూర్తిని అమికస్ క్యూరీగా నియమిస్తూ, చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ నైనాల జయసూర్యతో కూడిన డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. మైనింగ్ గనుల గుంతల వల్ల మరణాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొంటూ రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుంతలపై కొండబాబు 2013లో వేసిన పిల్‌ను బెంచ్ విచారణ జరిపింది. తదుపరి విచారణను ఆగస్టు 14కు వాయిదా వేసింది.

పొన్నవోలుకు భద్రతపై మధ్యంతర ఉత్తర్వులు పొడిగింపు

మాజీ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డికి 2ప్లస్2 భద్రత కొనసాగింపుపై గతంలో ఉన్న మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు మరోసారి పొడిగించింది. ఈ వ్యవహారంపై సెక్యూరిటీ రివ్యూ కమిటీ నివేదిక అందజేయాలని జస్టిస్ చక్రవర్తి ఉత్తర్వులు జారీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో ప్రస్తుత ప్రభుత్వ పెద్దలకు వ్యతిరేకంగా కేసులు వాదించానన్న కక్షతో తనకున్న భద్రతను తొలగించారంటూ పొన్నవోలు వేసిన వ్యాజ్యంపై విచారణను తమ ముందుంచాలని ఆదేశించింది. తదుపరి విచారణ ఈ నెల 30కు వాయిదా పడింది. పొన్నవోలుకు ప్రాణహాని లేదని ప్రభుత్వం వాదించింది.

పెద్దిరెడ్డిని అనర్హులుగా ప్రకటించాలని పిల్

పుంగనూరు వైసిపి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గత ఎన్నికల సమయంలో సమర్పించిన అఫిడవిట్‌లో పెద్దిరెడ్డి భార్య పేరిట ఉన్న 142 ఆస్తుల వివరాలను వెల్లడించలేదంటూ భారత చైతన్య యువజన అధ్యక్షులు రామచంద్ర యాదవ్ హైకోర్టులో ఎలక్షన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిని జస్టిస్ వి శ్రీనివాస్ విచారణ జరిపారు. పిటిషనరు వాదనలకు అనుగుణంగా సివిల్ ప్రొసీజర్ కోడ్ మేరకు నిర్ధారణ అఫిడవిట్ దాఖలు చేయాలని పిటిషనర్‌ను ఆదేశించారు. టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి పెద్దిరెడ్డి చేతిలో ఓడిపోయిన చల్లా రామచంద్రారెడ్డిని ప్రతివాదిగా చేయాలని పిటిషనరును ఆదేశించారు. విచారణను ఈ నెల 31కి వాయిదా వేశారు.

పాలస్తీనియన్ గ్రూపుల మధ్య కుదిరిన సయోధ్య

- ఫలించిన చైనా మధ్యవర్తిత్వం



బీజింగ్ : పాలస్తీనాలోని వివిధ గ్రూపుల మధ్య సయోధ్య కుదిర్చేందుకు చైనా చేసిన కృషి ఫలించింది. పద్నాలుగు పాలస్తీనియన్ గ్రూపుల ప్రతినిధులు బీజింగ్ లో ఈ నెల21, 22 తేదీల్లో సమావేశమై తమ మధ్య విభేదాలకు స్వస్తి పలికి ఐక్యతను పటిష్టపరచుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు వారు ఒక సంయుక్త డిక్లరేషన్‌ను వారు విడుదలజేశారు. పాలస్తీనియన్ గ్రూపులు ఈ విధంగా సయోధ్య చర్చలు జరపడం ఇదే మొదటిసారి. .తీవ్ర కష్టాల్లో ఉన్న పాలస్తీనా ప్రజలకు ఇదొక ఆశాకిరణంగా ఉంటుందని పరిశీలకులు భావిస్తున్నారు.చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ఆహ్వానం మేరకు ఈ రాజీ చర్చలకు హాజరైనవారిలో ఫతా గ్రూపు ఉపాధ్యక్షుడు మహ్మద్ అల్ అలౌల్, హమాస్ గ్రూపు సీనియర్ నాయకుడు మూసా అబు మర్జుక్ తదితరులు ఉన్నారు. హమాస్, ఫతా గ్రూపుల మధ్యే ప్రధానంగా వైరం ఉండేది. ఇప్పుడు ఆ రెండు గ్రూపుల మధ్య విభేదాలకు తెర దించుతూ ఒప్పందానికి రావడం చారిత్రాత్మకమని చైనీస్ మీడియా పేర్కొంది. గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడులు, మారణకాండను ఎలాగైనా తిప్పికొట్టాలన్న పట్టుదలే ఫతా, హమాస, మరో 12 గ్రూపులను ఏకతాటిపైకి తెచ్చింది.గాజా ప్రాంతాన్ని హమాస్ 17 ఏళ్లుగా పాలిస్తుండగా, ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లోని కొన్ని భూ భాగాలను పాలిస్తున్న పాలస్తీనియన్ అథారిటీలో ఫతా ఒక ప్రధాన శక్తిగా ఉంది. 1967కి ముందు ఉన్న సరిహద్దులతో స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటుకు తాము కట్టుబడి ఉన్నామని ఆ సంయుక్త ప్రకటనలో పాలస్తీనియన్ గ్రూపులు పేర్కొన్నాయి.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate A Government of India Undertaking
మచిలీపట్నం ఆర్ టి రోడ్డు బ్రాంచ్ (13766), మచిలీపట్నం, కృష్ణా జిల్లా. 08672-252252, 9491283457

సెక్షన్ 13(4) **స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) (ఇకమీదట "చట్టం" గా పిలవబడును) ప్రకారం **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి **ఋణగ్రహీత: M/s సాయి దుర్గా గ్లాస్ అండ్ ప్లైవుడ్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీమతి దాలిపర్తి దివ్య** వారిని నోటీసులో ఉదహరించబడిన చెల్లించవలసిన బకాయి సొమ్ము **అకౌంట్ నెం. 37661400001706 క్రింద రూ.18,44,601.00/- (అక్షరాల పద్దెనిమిది లక్షల నలభై నాలుగు వేల ఆరు వందల ఒక్క రూపాయలు) మరియు అకౌంట్ నెం. 170002766149 క్రింద రూ.5,01,925.00/- (అక్షరాల ఐదు లక్షల ఒక వెయ్యి తొమ్మిది వందల ఇరవై ఐదు రూపాయలు** మొత్తంను నోటీస్ అందిన తేది నుండి 60 రోజుల లోపు చెల్లించవలసినదిగా కోరుతూ తేది **15.05.2024న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీతలు సదరు పైన తెలిపిన బకాయిసొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 & 9 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ తెలిపిన ఆస్తిని **23-07-2024వ తేదీన స్వాధీనపరచుకున్నారని** ఋణగ్రహీతలు, హామీదారు మరియు యావన్మంది ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీతలు, హామీదారు మరియు ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి **కెనరా బ్యాంక్** వారికి తేది. 30.06.2024 నాటికి చెల్లించవలసిన బకాయి లోన్ అకౌంట్ నెం. 37661400001706 క్రింద **రూ.18,87,428.00/- మరియు** లోన్ అకౌంట్ నెం. 170002766149 క్రింద **రూ. 5,10,026.00** + వడ్డీ కలిపి మొత్తమునకు లోబడివుంటాయి.

స్థిరాస్తి వివరములు:

కృష్ణా జిల్లా, మచిలీపట్నం, మాచవరం, డి.నెం. 16/372-5, సర్వే నెం. 347/2 నందు **256.88 చ॥గ॥ రెసిడెన్షియల్ ఖాళీ స్థలం. హద్దులు: తూర్పు:** రంగమ్మ స్థలం - 69 అ॥, **దక్షిణం:** కాకర్ల శ్రీనివాసరావు స్థలం - 34 అ॥, **పడమర:** చలమలశెట్టి శ్రీహరి ఇల్లు మరియు స్థలం - 68 అ॥, **ఉత్తరం:** మున్సిపల్ రోడ్డు - 34 అ॥.

తేది: 23.07.2024,
ప్రదేశం: మచిలీపట్నం
సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate A Government of India Undertaking
మధునగర్ బ్రాంచ్ (1620) అను కాంప్లెక్స్, మధునగర్, మొగల్‌రాజపురం, విజయవాడ-10. ఫోన్: 0866-2475015.

సెక్షన్ 13(4) **స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) (ఇకమీదట "చట్టం" గా పిలవబడును) ప్రకారం **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి **ఋణగ్రహీత: శ్రీమతి ఒరుసు శిరీషా రాణి, తండ్రి: శ్రీరామమూరి** వారిని నోటీసులో ఉదహరించబడిన బకాయి సొమ్ము **రూ. 24,01,305.98/- (అక్షరాల ఇరవై నాలుగు లక్షల ఒక వెయ్యి మూడు వందల ఐదు రూపాయలు మరియు తొంభై ఎనిమిది పైసలు మాత్రమే)** మొత్తంను నోటీస్ అందిన తేది నుండి 60 రోజుల లోపు చెల్లించవలసినదిగా కోరుతూ తేది **17.05.2024న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఏదైతే, దిగువసంతకందారు అయిన గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పేర్కొనబడిన పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ 17 నవంబర్, 2023 నుండి గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా మార్చబడింది) (గతంలో మాగ్మా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేర్కొనబడింది మరియు వాస్తవంలో జి ఇ మనీ హౌసింగ్ ఫైనాన్స్ పబ్లిక్ అన్‌లిమిటెడ్ కంపెనీ తో విలీనం చేయబడింది) సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇకపై "సదరు చట్టం"గా సూచించబడుతుంది) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(12) క్రింద అధికారాలు అధ్యాయనం చేస్తూ, పైన కార్పోరేట్/రిజిష్టర్ కార్యాలయం యొక్క ఇకపై సెక్యూర్ క్రెడిటార్‌గా సూచించబడే అధీకృత అధికారి సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా నోటీసులో పేర్కొన్న మొత్తం తిరిగిచెల్లించుటకు దిగువ రుణగ్రహీతలను పిలుస్తూ దిగువ తేదిన డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

రుణగ్రహీతలు మొత్తం తిరిగిచెల్లించుటలో విఫలమైనారు, సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 యొక్క సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్తిని 19 జులై, 2024న దిగువసంతకందారుడు స్వాధీనపరుచుకోవడమైనదని రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

ప్రత్యేకంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారు మొత్తం మరియు దానిపిమ్మట వడ్డీని సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క చార్జ్‌కు లోబడి జరుపవలెను. సెక్యూర్డ్ అస్సెట్స్ విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) నిబంధనలు ఆహ్వానించడమైనదని రుణగ్రహీతలు శ్రద్ధ వహించవలెను. స్వాధీనత తీసుకున్న ఆస్థి వివరాలు దిగువన ఇవ్వబడినాయి:

క్ర సం	రుణగ్రహీతల పేరు	ఆస్తి వివరణ	స్వాధీనం తీసుకున్న తేది	డిమాండ్ నోటీసు చట్టబద్ధత తేది	డిమాండ్ నోటీసులో మొత్తం (రూ.)
1.	తంగెళ్ల మురళీకృష్ణ, తంగెళ్ల కళ్యాణి	ఆంధ్రప్రదేశ్-520003, కృష్ణాజిల్లా, విజయవాడ, రామకృష్ణాపురం, సమంతపుడి వారి వీధి, వెంకటేశ్వర స్వామి గుడి, మున్సిపల్ వార్డు నం.21, తనఖా ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ రీ సర్వే నం.42/6, పట్టా నం.983, డో.నం.42-4-134 కొలత 1359.9 చ.అ.లు. హద్దులు : తూర్పు : మల్లిపెద్ది వెంకటేశ్వర్లు మరియు కె.జి.అయ్యర్ ఇల్లు, పడమర : గరికపాటి వెంకటేశ్వరరావుఇల్లు, ఉత్తరం : కె.పురుషోత్తం ఇల్లు, దక్షిణం : దగ్గుబాటి శశిధర్ ఇల్లు.	19/07/2024	13/09/2023	లోన్ నెం.: HM/0053/H/17/100171 రూ.28,74,122.51/- (ఇరవై ఎనిమిది లక్షల డెభై నాలుగు వేల ఒక వందా ఇరవై రెండు రూపాయల యాభై ఒక్క పైసలు మాత్రమే) 13/09/2023 నాటికి చెల్లించవలసిన మొత్తంతో పాటు రియలైజేషన్ వరకు 15.80 శాతం పి.ఎ. వడ్డీ.

ప్రదేశం: విజయవాడ, తేది: 25.07.2024 - సం/- అధీకృత అధికారి గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో పూనవాల హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పిలువబడింది)

మైనార్టీలపై వివక్ష

- తాజా బడ్జెట్‌లో పలు మైనారిటీ పథకాలలో కోతలు
- సంబంధిత శాఖ బడ్జెట్‌లో స్వల్ప పెరుగుదల
- కేంద్రంపై మైనార్టీల ఆందోళన

న్యూఢిల్లీ : మోడీ అనుసరించే మైనారిటీ వ్యతిరేక విధానాలు తాజా బడ్జెట్‌లో ప్రత్యక్షంగా కనపడుతున్నాయని నిపుణులు, విశ్లేషకులు అంటున్నారు. మంగళవారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని పలు కార్యక్రమాలు బడ్జెట్ కోతలను చూశాయని చెప్తున్నారు. ముఖ్యంగా అనేక స్కాలర్‌షిప్‌లు, నైపుణ్యాభివృద్ధి పథకాలు నిధులలో పెద్ద కోతలను చూశాయని నిపుణులు చెబుతున్నారు. తాజా బడ్జెట్‌లో జరిగిన కేటాయింపులు మైనారిటీలు అధికంగా ఉండే దాదాపు 1,300 ప్రాంతాలలో అభివృద్ధి లోటును పూడ్చేందుకు ఉద్దేశించిన కార్యక్రమం ప్రధాన్ మంత్రి జన్ వికాస్ కార్యక్రమ్ (పీఎంజేవీకే)కు జరిగిన కేటాయింపులేనని విశ్లేషకులు చెప్తున్నారు. తాజా బడ్జెట్‌లో ఈ శాఖకు కేటాయింపులు పెంచినట్లు ప్రభుత్వం చెబుతున్నా.. అది కేంద్ర ప్రాయోజిత కార్యక్రమమైన పీఎంజేవీకేకు కేంద్రం బడ్జెట్‌లో రూ. 300 కోట్ల మేర సహాయం అందించినందున కేంద్ర మైనారిటీ మంత్రిత్వ శాఖకు జరిపిన కేటాయింపుల్లో స్వల్ప పెరుగుదలకు కారణమైందని వారు వివరిస్తున్నారు. పార్లమెంటరీ వ్యవహారాలను కూడా చూస్తున్న కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు కేంద్ర బడ్జెట్‌ను 'అన్ని వర్గాలకు కలల బడ్జెట్'గా పోల్చటం గమనార్హం. "ఇది అన్ని వర్గాలకు, ముఖ్యంగా యువత, మహిళలకు కలల బడ్జెట్. రూ. 11 లక్షల కోట్లకు పైగా మూలధన వ్యయం కేటాయించారు. బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఏపీ, ఈశాన్య రాష్ట్రాలకు సంబంధించిన ప్రకటనలు తూర్పు భారతదేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తాయి. నైపుణ్యం, ఉపాధి కల్పన కోసం చేసిన ప్రకటనలు చారిత్రాత్మకమైనవి. మహిళలకు ఆసరా పథకాలు అభినందనీయం. ఈశాన్య ప్రాంతంలో బ్యాంకింగ్ సేవలపై జాగ్రత్తలు తీసుకున్నారు. ఈశాన్య రాష్ట్రాల ఆర్థిక ప్రధాన స్రవంతి జరుగుతుంది" అని ఆయన మీడియాతో అన్నారు. కొత్త ఎన్డీఏ ప్రభుత్వ తొలి బడ్జెట్‌లో, కేంద్ర రంగ పథకాల కింద, కేవలం పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ మాత్రమే రూ.1,065 కోట్ల నుంచి రూ.1,145 కోట్లకు పెరిగింది. నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధి పథకాలు గతేడాది మంజూరు చేసిన రూ.64.4 కోట్లతో పోలిస్తే కేవలం రూ.3 కోట్లకు తగ్గాయి. నేషనల్ మైనారిటీస్ డెవలప్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కార్పొరేషన్(ఎన్ఎండీఎఫ్‌సీ)కి చివరిసారిగా రూ.61 కోట్లు మంజూరు చేయగా.. ఈ సారి ఎటువంటి మొత్తాన్నీ కేటాయించకపోవటం గమనార్హం. మొత్తం విద్యా సాధికారత రూ.1,689 కోట్ల నుంచి 1,575 కోట్లకు తగ్గింది. ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకం గతేడాది కేటాయించిన రూ.433 కోట్లతో పోలిస్తే రూ.326.2 కోట్లకు తగ్గింది. మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్‌కు గతేడాది రూ.96 కోట్లు ఇస్తే.. ఈ సారి రూ.45 కోట్లు కేటాయించారు. ఉచిత కోచింగ్, అనుబంధ పథకాలకు గతసారి కేటాయించిన రూ.30 కోట్లతో పోలిస్తే కేవలం రూ.10 కోట్లు మాత్రమే కేంద్రం ఇచ్చింది. విదేశీ చదువుల కోసం విద్యా రుణాలపై వడ్డీ రాయితీని రూ.21 కోట్ల నుంచి రూ.15.3 కోట్లకు తగ్గించింది.

మైనారిటీల అభివృద్ధి పథకాల పరిశోధన, ప్రచారం, పర్యవేక్షణ మరియు మూల్యాంకనం మరియు చిన్న మైనారిటీ కమ్యూనిటీ జనాభా క్షీణతను నియంత్రించే పథకం వంటి ప్రత్యేక కార్యక్రమాలు చాలా వరకు అలాగే ఉన్నాయి. మైనారిటీల సంస్కృతి, వారసత్వ పరిరక్షణ, పరిరక్షణ కార్యక్రమం హమారీ ధరోహర్‌కు గతేడాది రూ.10 లక్షలు మంజూరు కాగా.. ఈసారి ఎలాంటి నిధులూ ఇవ్వకపోవటం గమనార్హం. మొత్తం-చట్టబద్ధమైన మరియు నియంత్రణ సంస్థలకు నిధులు రూ.2 కోట్లు తగ్గించబడ్డాయి. మైనారిటీల జాతీయ కమిషన్ బడ్జెట్‌లో రూ.1కోటి రూపాయలు తగ్గించారు.

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల(యూటీ)కు బదిలీలతో కూడిన కేంద్ర ప్రాయోజిత పథకాలలో, ప్రధాన మంత్రి జన్ వికాస్ కార్యక్రమ్ ద్వారా అత్యధికంగా రూ.600 కోట్ల నుంచి రూ.910 కోట్లకు ఖర్చు పెరిగింది. ఇంతకు ముందు భారీ నిధుల కోతలో, మదర్సాలు, మైనారిటీల విద్యా పథకం గతేడాది 93 శాతం క్షీణతను చూసింది.

2014లో మోడీ ప్రభుత్వ తొలి బడ్జెట్‌తో పోలిస్తే గతేడాది బడ్జెట్‌లో మంత్రిత్వ శాఖ కేటాయింపులు 17 శాతం తగ్గాయి. గతేడాది మోడీ ప్రభుత్వం అధికారంలో ఉన్న తొమ్మిదేండ్లలో అత్యధిక మొత్తాన్ని కేటాయించగా, కేవలం 48 శాతం మాత్రమే ఖర్చు చేసింది. ఇది కేటాయించిన మొత్తంలో సగం కంటే తక్కువ కావటం గమనార్హం. మైనారిటీ విద్యార్థులు విదేశాల్లో చదువుకోవటానికి తీసుకున్న విద్యా రుణాలపై వడ్డీ రాయితీలు మంజూరు చేసే పఢో పరదేశ్ పథకం రద్దు చేయబడిన కేంద్ర రంగ పథకాలలో ఒకటి. విద్యార్థులకు నెలకు రూ.1,000 వరకు అందించే ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ 1 నుండి 8 తరగతులకు రద్దు చేయబడింది. కాగా, మోడీ ప్రభుత్వం ఎప్పటిలాగే తమ పట్ల వివక్షాపూరితంగా వ్యవహరిస్తున్నదని మైనారిటీ వర్గాలు ఆందోళనను వ్యక్తం చేస్తున్నాయి.

సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు నాయుడు

నిబంధనలు సరే... మానవీయ కోణంలో చూడండి

- ప్రభుత్వ ఉన్నతాధికారులతో సిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నిబంధనలు ముఖ్యమే... కాని మానవతా దృక్పథంతో కొన్ని కీలకమైన నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. సచివాలయంలో మంత్రులు, ప్రభుత్వశాఖల కార్యదర్శులు, అన్ని విభాగాల అధిపతులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ప్రజలు సాయం కోరి వస్తే... ఆ సమస్య ఎలా పరిష్కరించాలి అని ఆలోచించాలని, కేవలం రూల్స్ గురించి మాత్రమే ఆలోచిస్తే అందరికీ మంచి చేయలేమని సిఎం చంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రాధాన్యతలు, ఆలోచనలను వివరించారు. ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు అన్ని శాఖల అధికారులూ కృషి చేయాలన్నారు. వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలకు కేంద్రం ఇచ్చే నిధులు పూర్తిగా సద్వినియోగం చేసుకోనేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. గత ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్స్ ఇవ్వకపోగా, కేంద్ర ప్రభుత్వ నిధులూ దుర్వినియోగం చేసిందన్నారు. 2014లో లోటు బడ్జెట్‌తో పాలన ప్రారంభించినా 43 శాతం పిఆర్‌సి ఇచ్చి ఉద్యోగులకు అండగా నిలిచామన్నారు. 2014 కంటే దారుణమైన పరిస్థితులు ఇప్పుడు రాష్ట్రంలో ఉన్నాయని, రూ.లక్ష కోట్ల వరకు బిల్లులు, బకాయిలు ఇవ్వాల్సి ఉందని అన్నారు. కేంద్రం ఆక్సిజన్ అందిస్తే తప్ప ముందుకు వెళ్లలేని పరిస్థితి కనిపిస్తోందన్నారు. పోలవరం, అమరావతితోపాటు వెనుకబడిన జిల్లాలకు నిధులివ్వడానికి కేంద్రం సుముఖంగా ఉందన్నారు. రాయలసీమలో ఇండస్ట్రియల్ కారిడార్‌కు ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. గత ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటు ఇవ్వకపోవడం వల్ల కేంద్ర పథకాలు కూడా ఉపయోగించుకోలేదన్నారు. కొత్త బడ్జెట్ ప్రకారం నిధులు తెచ్చుకోవడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. శాంతి భద్రతల విషయంలో ప్రభుత్వం చాలా కఠినంగా ఉంటుందని పేర్కొన్నారు. గంజాయి అనేది లేకుండా చేస్తామని, ఈ విషయంలో అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు.

కెజిబివిలో 345 టీచర్ పోస్టులు ఖాళీ

- తెలంగాణలో 394 ఖాళీలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాలు (కెజిబివి)ల్లో 345 టీచర్ పోస్టులు, తెలంగాణలో 394 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి బుధవారం తెలిపారు. రాజ్యసభలో వైసిపి ఎంపి ఆర్.కృష్ణయ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2024 జులై 19 నాటికి దేశంలోని 21 రాష్ట్రాల్లో 4,130 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. కేరళ, తమిళనాడులో ఒక టీచర్ పోస్టు కూడా ఖాళీగా లేదని పేర్కొన్నారు. దేశంలో 5,639 కెజిబివిలు మంజూరు అయితే, 2024 మార్చి 31 నాటికి 5,116 కెజిబివిలు పని చేస్తున్నాయని, ఇందులో 7.07 లక్షల అమ్మాయిలు చదువుతున్నారని తెలిపారు. ఇంకా 523 కెజిబివిలు ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు.

రూ.26,292 కోట్లతో 1,935 కిమీ మేర 17 కొత్త లైన్లు

ఆంధ్రప్రదేశ్‌లో రూ.26,292 కోట్లతో 1,935 కిలో మీటర్ల మేర 17 కొత్త లైన్ల వేసేందుకు ఈ ఏడాది ఏప్రిల్ 1న నిర్ణయించినట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. లోక్‌సభలో టిడిపి ఎంపిలు కేశినేని శివనాథ్, బైరెడ్డి శబరి అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. రూ. 73,743 కోట్లతో 5,329 కిలో మీటర్ల మేర 41 రైల్వే ప్రాజెక్టులు అందులో 17 కొత్త లైన్లు, 24 డబులింగ్ ప్రాజెక్టులను అమలు చేయనున్నట్లు తెలిపారు.

సెంట్రల్ యూనివర్శిటీల్లో 21,779 పోస్టులు ఖాళీ

దేశంలోని సెంట్రల్ యూనివర్శిటీల్లో 21,779 టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి సుకాంత మజుందార్ తెలిపారు. రాజ్యసభలో సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. సెంట్రల్ యూనివర్శిటీల్లో 2024 ఏప్రిల్ 1 నాటికి 5,060 టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉండగా, 16,719 నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

సిఎపిఎఫ్, ఎఆర్‌లో 84,106 పోస్టు ఖాళీలు

దేశంలోని సెంట్రల్ ఆర్మడ్ పోలీస్ ఫోర్స్ (సిఎపిఎఫ్), అస్సాం రైఫిల్స్ (ఎఆర్)ల్లో 84,106 పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యనందరాయ్ తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

పెట్రోల్‌ను జిఎస్‌టి పరిధిలోకి తీసుకొచ్చే ప్రతిపాదన కౌన్సిల్ చేయలేదు

పెట్రోల్‌ను జిఎస్‌టి పరిధిలోకి తీసుకొచ్చే ప్రతిపాదనను జిఎస్‌టి కౌన్సిల్ చేయలేదని కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. జిఎస్‌టి పరిధిలోకి పెట్రోల్‌ను తీసుకొచ్చే ఎటువంటి ప్రతిపాదన జిఎస్‌టి కౌన్సిల్ చేయలేదని తెలిపారు.

షుగర్ ఫ్యాక్టరీలను కేంద్రం నిర్మించదలచుకోలేదు

కేంద్ర ప్రభుత్వం షుగర్ ఫ్యాక్టరీలను నిర్మించదలచుకోలేదని వినియోగదారు వ్యవహారాల సహాయ మంత్రి నిముబెన్ జయంతిబాయ్ తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2023-24 దేశంలో 534 సుగర్ మిల్లులున్నాయని, అందులో 121 ఉత్తరప్రదేశ్‌లో ఉన్నాయని తెలిపారు.

అంతరిక్ష పరిశోధన రంగంలోకి ప్రైవేట్ వ్యక్తులు అనుమతి

అంతరిక్ష పరిశోధన రంగం (స్పెస్)లోకి ప్రైవేట్ వ్యక్తులను అనుమతించామని కేంద్ర పబ్లిక్ గ్రీవెన్స్ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. స్పెస్ వ్యవహారాలను ప్రోత్సహించడానికి ప్రైవేట్ రంగాన్ని అనుమతించామని తెలిపారు.

రాహుల్ గాంధీని కలిసిన రైతు నాయకులు

న్యూఢిల్లీ : లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని బుధవారం ఆరు రాష్ట్రాలకు చెందిన రైతు నాయకులు కలుసుకున్నారు.

పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 12

మంది రైతు నాయకులు రాహుల్‌గాంధీతో సమావేశమై ఆయా రాష్ట్రాల్లోని రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కి చట్టపరమైన హామీని అందించడం వంటి తమ దీర్ఘకాలిక డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రైవేట్ మెంబర్ బిల్లును పార్లమెంటులో ప్రతిపాదించాలని కోరినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి వేణుగోపాల్, ఎన్‌సిపి నాయకులు శరద పవార్, పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి చరణ్‌జిత్ సింగ్ చన్నీ, పంజాబ్ కాంగ్రెస్ చీఫ్ అమరీందర్ సింగ్ రాజా వారింగ్, కాంగ్రెస్ నేతలు సుఖ్జిందర్ సింగ్ రంధావా, గుర్జీత్ సింగ్ ఔజ్లా, ధరమ్‌వీర్ గాంధీ, అమర్‌సింగ్, దీపేందర్ సింగ్ హుడా, జై ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ప్రతిపక్షాలు ప్రతిపాదించిన ప్రైవేట్ బిల్లులకు మద్దతుగా లాంగ్‌మార్చ్ నిర్వహిస్తామని రైతు సంఘాలు ప్రకటించాయి. ఢిల్లీలో విలేకరుల సమావేశంలో ఈ ప్రకటన చేశాయి. ఈ నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఆగస్టు 15 భారత స్వాతంత్ర్య దినోత్సవం రోజున దేశవ్యాప్తంగా ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించాలని రైతులు యోచిస్తున్నారు. ర్యాలీ సందర్భంగా నూతన క్రిమినల్ చట్టాల కాపీలను దహనం చేస్తారు. ఆగస్టు 31 నాటికి రైతుల 'ఢిల్లీ చలో' పాదయాత్ర 200వ రోజుకు చేరుకుంటుందని సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా నాయకులు తెలిపారు. దీనికి మద్దతుగా ఖనౌరీ, శంభు వంటి ప్రాంతాల ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

జమ్ముకాశ్మీర్‌లో మరో ఎన్‌కౌంటర్

- జవాను, ఉగ్రవాది మృతి

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లో మరో ఎన్‌కౌంటర్ జరిగింది. బుధవారం కుప్వారా జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక జవాను, ఒక మృతి చెందారు. జిల్లాలో లోలాబ్ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారనే సమాచారంలో అక్కడ సైనికులు, పోలీసులకు చెందిన బృందం తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ ఎన్‌కౌంటర్ చోటు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. మంగళవారం నుంచి ఈ తనిఖీలు జరుగుతున్నట్లు చెప్పారు. తనిఖీలు చేస్తున్న సిబ్బంది ఒక్కసారిగా ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డంతో ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో ఉగ్రవాదులు కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. జమ్ముకాశ్మీర్‌లో ఇటీవల కాలంలో వరస ఎన్‌కౌంటర్లు చోటు చేసుకుంటున్న సంగతి తెలిసిందే.

బడ్జెట్‌ను సవరించి నిధులివ్వాలి

- తెలంగాణ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం
- బిఆర్ఎస్ మద్దతు, బిజెపి వాకౌట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో కేంద్రం ఫెడరల్ స్ఫూర్తిని విస్మరించిందని చెప్పారు. ప్రగతిశీల తెలంగాణ రాష్ట్రంపై ఎందుకింత వివక్ష అంటూ కేంద్రాన్ని నిలదీశారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందనే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. సిఎం మాట్లాడుతూ.."ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారం రెండు రాష్ట్రాల సుస్థిర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలి. కానీ విభజన చట్టంలో పొందుపరిచిన హామీలను అమలు చేయటంలో కేంద్రం విఫలమైంది. రాష్ట్రానికి సంబంధించిన వివిధ ప్రాజెక్టులకు ఆర్థిక సాయం కోరడంతో పాటు చట్ట ప్రకారం రావాల్సిన నిధులు, అపరిష్కృతంగా ఉన్న అంశాలపై అనేక సార్లు కేంద్రానికి అభ్యర్థించాం. కానీ కేంద్ర ప్రభుత్వం వీటిని పట్టించుకోకుండా బడ్జెట్‌లో తెలంగాణ పట్ల పూర్తిగా వివక్ష చూపించింది. అందుకే తెలంగాణ రాష్ట్రం పట్ల కేంద్ర అనుసరించిన తీరుపై ఈ సభ తీవ్ర అసంతృప్తిని, నిరసనను తెలియజేస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న బడ్జెట్ చర్చల్లోనే కేంద్ర బడ్జెట్‌కు సవరణలు చేసి తెలంగాణ రాష్ట్రానికి న్యాయం జరిగేటట్లు తగిన చర్యలు తీసుకోవాలి" అని శాసనసభ తీర్మానం చేసింది. ఈ తీర్మానానికి బిఆర్ఎస్ మద్దతు తెలపగా, బిజెపి సభ్యులు వాకౌట్ చేశారు. అంతకుముందు తీర్మానంపై చర్చ సందర్భంగా రాష్ట్రానికి నిధుల కోసం ఢిల్లీలో దీక్ష చేయాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కెటిఆర్, హరీశ్ రావు చేసిన డిమాండ్‌పై సిఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దీక్ష చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. అయితే, ప్రతిపక్ష నేతగా కెసిఆర్ వస్తే.. ప్రభుత్వాధినేతగా తాను వస్తానని చెప్పారు. తెలంగాణకు నిధులు తెచ్చుడో..సచ్చుడో తేల్చుకుందామని సవాల్ విసిరారు.



మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి

మిమ్మల్ని ఓడించిన వారిపై ప్రతీకారం తీర్చుకోవద్దు

- ప్రధాని మోడీకి స్టాలిన్ విజ్ఞప్తి

చెన్నై : ఇటీవల ఎన్నికల్లో బిజెపిని ఓడించినవారిపై ప్రతీకారం తీర్చుకోవాలని అనుకోవద్దని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. తాజా కేంద్ర బడ్జెట్‌లో తమిళనాడును విస్మరించిన విషయాన్ని ప్రస్తావిస్తూ స్టాలిన్ ఈ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం సోషల్ మీడియాలో స్టాలిన్ ఒక పోస్టు చేశారు. పాలనపై దృష్టి పెట్టకుండా ప్రత్యర్థుల్ని టార్గెట్ చేయడాన్ని కొనసాగిస్తే.. ఒంటరిగా మిగిలిపోతారని విమర్శించారు. "ఎన్నికలు అయిపోయాయి.. ఇప్పుడు మనం దేశం గురించి ఆలోచించాలి' అని మీరే అన్నారు కదా. కానీ, నిన్నటి బడ్జెట్- 2024 మీ ప్రభుత్వాన్ని కాపాడుతుంది గానీ.. ఈ దేశాన్ని కాదు. ప్రభుత్వాన్ని నిష్పక్షపాతంగా నడపండి. మిమ్మల్ని ఓడించిన వారిపై ప్రతీకారం తీర్చుకోవాలని అనుకోవద్దు. రాజకీయ ఇష్టాయిష్టాల ప్రకారం సర్కారును నడిపితే మీరు ఒంటరి అయిపోతారు" అని స్టాలిన్ పేర్కొన్నారు.

చెన్నై మెట్రో రైల్ రెండో దశ, కోయంబత్తూరులో అభివృద్ధి కార్యక్రమాలు వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల ప్రస్తావన కేంద్ర బడ్జెట్‌లో లేదని తమిళనాడు ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఆవరణలో ఇండియా వేదిక ఎంపిలు నిరసన ఫోటోను స్టాలిన్ షేర్ చేశారు.

అలాగే, మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై తమిళనాడులోని అధికార డిఎంకె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. చెన్నై, దక్షిణాది జిల్లాల్లో వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరుద్ధరణ పనుల కోసం తాము రూ. 37,000 కోట్లు అడిగితే ఇప్పటివరకు రూ. 276 కోట్లు మాత్రమే అందిందని డిఎంకె విమర్శించింది. కేంద్ర బడ్జెట్‌లో తమ రాష్ట్రానికి ప్రత్యేక ప్రాజెక్టులు ఏమీ లేవని మండిపడుతోంది. డిఎంకె నేత శరవణన్ మాట్లాడుతూ.. బిహార్ కంటే తమిళనాడు పది రెట్లు అధికంగా కేంద్రానికి అధికంగా పన్నులు చెల్లిస్తుందని తెలిపారు.

యుద్ధ నేరస్తుడా.. వెనక్కిపో

- నెతన్యాహు పర్యటనకు వ్యతిరేకంగా గళమెత్తిన అమెరికన్ యూదులు

వాషింగ్టన్: అమెరికాలో నెతన్యాహు పర్యటనను వ్యతిరేకిస్తూ యూదు శాంతి కార్యకర్తలు మంగళ, బుధవారాల్లో ఇక్కడి కేపిటల్ హిల్స్ ఎదుట పెద్దయెత్తున నిరసన ప్రదర్శన నిర్వహించారు. 'జ్యూయిష్ వాయిస్ ఫర్ పీస్' బ్యానర్‌పై జరిగిన ఈ ప్రదర్శనలో నెతన్యాహు యుద్ధ నేరస్తుడని, ఆయన కోసం పన్నుచెల్లింపుదారుల సొమ్ము ఒక్క సెంట్ కూడా వెచ్చించకూడదని నిరసనకారులు నినదించారు. ఈ సందర్భంగా వందలాది మంది కార్యకర్తలను కేపిటల్ పోలీసులు అరెస్టు చేశారు. అమెరికన్ పార్లమెంటునుద్దేశించి ఇజ్రాయిల్ ప్రధాని బుధవారం మాట్లాడారు 'నాట్ ఇన్ మై నేమ్' అన్న సందేశంతో కూడిన ఎరుపు టీషర్టులు ధరించిన నిరసనకారులు గాజాలో ఊచకోతను తీవ్రంగా ఖండించారు. ఇంత జరుగుతున్నా ఇజ్రాయిల్‌కు ఆయుధాలు, నిధులు అందజేస్తున్న బైడెన్ ప్రభుత్వ చర్యల్ని వారు తప్పుబట్టారు. అందరికీ స్వేచ్ఛ లభించేంతవరకు ఎవరూ స్వేచ్ఛగా ఉండలేరు అని యూదులు అమెరికన్ కాంగ్రెస్‌నుద్దేశించి రాసిన వారు పిలుపునిచ్చారు. యుద్ధ నేరాలకు గాను నెతన్యాహును అరెస్టు చేయాలని అంతర్జాతీయ నేర న్యాయస్థానం (ఐసిసి) చీఫ్ ప్రాసిక్యూటర్ కోరిన రెండు మాసాలకు నెతన్యాహు అమెరికా పర్యటనకు రావడం గమనార్హం. నెతన్యాహు ప్రసంగాన్ని తాము బహిష్కరిస్తామని ముందుగానే కొందరు అమెరికన్ కాంగ్రెస్ సభ్యులు ప్రకటించారు.

అమెరికన్ సెనేటర్ బెర్నీ శాండర్స్ మాట్లాడుతూ, నెతన్యాహు ఓ యుద్ధ నేరస్తుడు. అతడి రాకను తాము వ్యతిరేకిస్తాం. అతనికోసం ఒక్క సెంట్ ఖర్చు చేసినా పాపమేనని అన్నారు. నెతన్యాహు ఈ పర్యటనలో అమెరికా అధ్యక్షుడు బైడెన్‌ను, రాబోయే ఎన్నికల్లో డెమొక్రాటిక్ అభ్యర్థిత్వం కోసం పోటీలో అగ్రభాగాన ఉన్న ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌ను కలవనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

కేపిటల్ హిల్స్ ఎదుట ఆందోళన చేస్తున్న నిరసనకారులు

ప్రధాని నియామకంపై నాన్చుడు

- మాక్రాన్ పై లెఫ్ట్ విమర్శ

పారిస్: ఎన్నికల్లో అధికార పార్టీ ఓడిపోయినా, ప్రభుత్వంపై తన ఆధిపత్యాన్ని కొనసాగించేందుకే అధ్యక్షుడు మాక్రాన్ కొత్త ప్రధాని నియామకంపై జాప్యం చేస్తున్నారని వామపక్షాలు విమర్శించాయి. మాక్రాన్ విధానాలు ఇక చెల్లవని అవి హెచ్చరించాయి. అంతకుముందు రోజే ఫ్రెంచ్ అధ్యక్షుడు మాక్రాన్ ఓ టీవీ చానెల్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ పారిస్ ఒలింపిక్స్ పూర్తయ్యేదాకా కొత్త ప్రధాని నియామకం చేపట్టబోనని చెప్పారు. క్రీడలు విజయవంతంగా నిర్వహించాలంటే ప్రభుత్వ సుస్థిరత చాలా అవసరమని ఆయన చెప్పారు. ప్రపంచ నలుమూలల నుంచి 10,500 క్రీడాకారులు, ఇంకా వేలాది మంది క్రీడాభిమానులు వస్తున్నందున ఇప్పుడు ప్రధానిని మార్చితే అంతా గందరగోళమవతుందని అన్నారు. ఒలింపిక్స్ సమీపించే దాకా ప్రధాని నియామకాన్ని జరపకుండా ఇప్పుడు క్రీడలను సాకుగా చూపుతున్నారని మాక్రాన్‌పై లెఫ్ట్ పార్టీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వామపక్షాలు ప్రధాని పదవికి 37 ఏళ్ల ఆర్థిక వేత్త, పారిస్ సిటీ కౌన్సిల్ సీనియర్ అధికారి లూసీ కేస్టెట్స్ పేరును ఎప్పుడో సూచించాయి. అయినా మాక్రాన్ తేల్చకుండా జాప్యం చేస్తూ వచ్చారు. ఇది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని లూసీ చెప్పారు. మాక్రాన్ పన్నుల అక్రమాలపై తమ పోరాటం సాగుతుందని ఆమె చెప్పారు. మొన్నటి ఫ్రాన్స్ పార్లమెంటు ఎన్నికల్లో వామపక్షాలు, ప్రగతి శీల శక్తులతో కూడిన న్యూ పాపులర్ ఫ్రంట్ (ఎన్‌పిఎఫ్) అతి పెద్ద కూటమిగా అవతరించిన సంగతి తెలిసిందే.

ట్రంప్ పై హారిస్‌దే పైచేయి

- తాజా ఒపీనియన్ పోల్స్‌లో వెల్లడి

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మాజీ అధ్యక్షుడు ట్రంప్ కన్నా ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ కే ఎక్కువ విజయావకాశాలు ఉన్నాయని తాజా ఒపీనియన్ పోల్స్ చెబుతున్నాయి. రెండవసారి అధ్యక్షపదవికి తాను పోటీ చేయడం లేదని ప్రకటించిన బైడెన్ తన వారసురాలిగా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ అభ్యర్థిత్వాన్ని బలపరచడంతో వచ్చే నవంబరులో జరిగే ఎన్నికల్లో ట్రంప్ ప్రధాన ప్రత్యర్థిగా కమలా హారిస్‌యే ఉంటారన్న ప్రచారం జరుగుతోంది. ఆగస్టు19న జరిగే డెమొక్రాటిక్ పార్టీ జాతీయ కన్వెన్షన్‌లో అధ్యక్ష పదవికి ఆ పార్టీ తరపున ఎవరు పోటీచేసేది తేలుతుంది. బైడెన్‌తోబాటు నాన్సీ పెలోసి, బిల్ క్లింటన్ వంటి సీనియర్లు కమలా హారిస్‌కు మద్దతు తెలుపుతున్నందున ఆమెకే నామినేషన్ దక్కవచ్చు. బైడెన్ బరిలో ఉన్నప్పుడు ట్రంప్‌కే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నట్లు ఒపీనియన్ పోల్స్ తెలిపాయి. మరీ ముఖ్యంగా ప్రెసిడెన్షియల్ డిబేట్‌లో బైడెన్ ట్రంప్‌ను ఎదుర్కోవడంలో విఫలం కావడం, ఒకరి పేరుకు బదులు మరొకరి పేరును ఉచ్ఛరించడం ఈ విధమైన తడబాట్లు, మతిమరుపు వంటి ఇబ్బందుల వల్ల ఆయనను పోటీ నుంచి తప్పుకోవాలని విరాళాల దాతల నుంచి, సొంత పార్టీ నుంచి వచ్చిన ఒత్తిళ్లు, కోవిడ్ బారిన పడడం వీటన్నిటి నేపథ్యంలో బైడెన్ రేటింగ్ బాగా పడిపోయింది. దీంతో ఆయన పోటీ నుంచి తప్పుకున్నారు. ఇప్పుడు కమలా హారిస్, ట్రంప్‌లో ఎవరికి ఓటేస్తారని అడిగితే హారిస్‌కే ఎక్కువ మంది మొగ్గు చూపారు. రాయిటర్స్, ఇప్సోస్ నిర్వహించిన తాజా సర్వేలో హారిస్‌కు 44 శాతం మంది మద్దతు పలకగా, ట్రంప్‌కు 42 శాతం మంది మాత్రమే మద్దతు తెలిపారు. 59 ఏళ్ల హారిస్ , 78 ఏళ్ల ట్రంప్ కన్నా చాలా మెరుగని పలువురు అమెరికన్లు అభిప్రాయపడినట్లు ఈ సర్వే తెలిపింది. ట్రంప్ రేటింగ్ పడిపోతోందనడానికి ఇదొక తొలి హెచ్చరిక.

ఎందుకీ వివక్ష?

(మొదటిపేజీ తరువాయి)

మారన్ అన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ నుంచి ప్రధాని మోడీ సలహా తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని, కేవలం తనకు ఓటు వేసిన వారి కోసమే కాకుండా తనకు ఓటు వేయని వారి కోసం కూడా పనిచేస్తానని స్టాలిన్ చెబుతారని దయానిధి మారన్ గుర్తుచేశారు.

రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యులు పి. చిదంబరం మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న నాలుగు ప్రధాన సవాళ్లను ఆయన ప్రస్తావించారు. నిరుద్యోగం దేశ ఆర్థిక వ్యవస్థకు పెను సవాల్ విసురుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. సిఎంఐఈ గణాంకాల ప్రకారం ఈ ఏడాది జూన్‌లో నిరుద్యోగిత రేటు 9.2 శాతంగా ఉందని అన్నారు. తగినంతగా ఉపాధి అవకాశాలను సృష్టించడం ఆర్థిక వ్యవస్థ ముందున్న సవాల్ అని చెప్పారు. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల పథకం (పిఎల్ఐ) ఆశించిన మేర ఉద్యోగాలను కల్పించడం లేదని వెల్లడవుతోందని అన్నారు. ఉపాధి ఆధారిత ప్రోత్సహకాల (ఈఎల్ఐ) పథకం ప్రభావం చూపడం లేదని, ఇది మంచి పథకమే అయినా ఆశించినట్టు 2.9 లక్షల ఉద్యోగాలను అందుబాటులోకి తీసుకురాలేకపోయిందని విమర్శించారు. 2024లో 4.67 కోట్ల ఉద్యోగాలు లభించాయన్న ఆర్‌బిఐ నివేదికపైనా చిదంబరం ప్రశ్నలు గుప్పించారు. యుపిలో 60 వేల పోలీస్ ఉద్యోగాలకు 50 లక్షలు పైగా దరఖాస్తులు వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ దేశంలో ఉపాధి సంక్షోభం లేదని ఆర్‌బిఐ ఏ ప్రాతిపదికన అంచనా వేసిందో చెప్పాలని ఆయన సవాల్ విసిరారు.

రాజ్యసభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ బడ్జెట్‌లో ఏ రాష్ట్రాన్నీ విస్మరించలేదని అన్నారు. బడ్జెట్ ప్రసంగంలోనే అన్ని రాష్ట్రాల పేర్లను చెప్పలేమంటూ పేర్కొన్నారు. ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగానే ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. 'కేంద్రం ప్రవేశపెట్టే ప్రతీ బడ్జెట్‌లో దేశంలోని అన్ని రాష్ట్రాల పేర్లనూ ప్రస్తావించే అవకాశం రాదు. నేను చాలా రాష్ట్రాల పేర్లు చెప్పలేదని.. కేవలం రెండు రాష్ట్రాల గురించి మాట్లాడాలని మల్లికార్జున ఖర్గే అన్నారు. ఈ దేశంలో కాంగ్రెస్ పార్టీ చాలా కాలం అధికారంలో ఉంది. వాళ్లు చాలా భిన్నమైన బడ్జెట్‌లను సమర్పించారు. ప్రతి బడ్జెట్ ప్రసంగంలోనూ దేశంలోని అన్ని రాష్ట్రాల పేర్లు ప్రస్తావించే అవకాశం లభించదని మీకు స్పష్టంగా తెలుసు' అంటూ అని అన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. ఎవరి ఇళ్లలోకి చొరబడి, వారిని వేధించలేదని, వారిపై దాడి చేయలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ఈ అరాచకాలను ప్రశ్నించకపోతే, వాటన్నిటినీ వెంటనే ఆపలేకపోతే.. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోలేమని అన్నారు. తమ పార్టీ ప్రజా ప్రతినిధులు, చివరకు ఒక ఎంపి కూడా తన నియోజకవర్గంలో తిరగలేని పరిస్థితి నెలకొందని, తమ పార్టీ ఎంపి మిథున్ రెడ్డిపై పట్టపగలే రాళ్లదాడి జరిగిందని, ఆయన వాహనాలు ధ్వంసం చేశారని అన్నారు.. ఇన్ని జరుగుతున్నప్పటికీ, పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని ధ్వజమెత్తారు. దాడులకు పాల్పడినవారిపైన కాకుండా, బాధితులపైన కేసులు పెడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మీకోసం

ఐస్ క్యూబ్స్ క్రిస్టల్ క్లియర్‌గా రావాలంటే ఐస్ క్యూబ్ ట్రేలో పోసే నీటిని కాచి, వడపోయాలి.

జీవన సౌరభం

బలవంతులుగా చేసే ప్రతి ఆశయాన్ని స్వీకరించాలి. బలహీనపరిచే ప్రతి ఆలోచనని తిరస్కరించాలి.

JEEVANA జీవన the family

కోయిల పాట

అనగనగా భైరవపురం అనే ఊరిలో ఒక కోకిల ఉంది. అది బాగా పాడుతుంది. ఆ కోయిల పాట వినటానికి నలుమూలల గ్రామాల నుంచి ప్రజలు వచ్చేవారు. ఆ ఊరిలో ఒక కోతి కూడా ఉంది. ఆ కోతి సర్కస్ చేస్తూ ఉండేది. ఎప్పుడూ కోయిలను చూసి కోతి అసూయపడేది. 'ప్రజలు కోయిల పాట వినటానికి మాత్రమే వస్తుంటారు' నా ఆటలను చూడడానికి ఎవరూ రారు' అని కోకిలపై ద్వేషాన్ని పెంచుకుంది.

ఒకరోజు పక్క రాజ్యం నుంచి వేరే రాజ్యానికి వెళుతున్న రాజు కొమ్మలపై అటూఇటూ గెంతుతున్న కోతిని చూశాడు. 'అరే ఈ కోతి భలే నవ్విస్తుంది. దీనిని మన కోటలో పెట్టుకుంటాను' అని అనుకొని కోతిని తీసుకురమ్మని భటులకు చెప్పాడు. భటులు ఆ కోతిని బంధించి తీసుకొని ప్రయాణం కొనసాగిస్తారు.

కొంచెం దూరం వెళ్ళాక ఒక కమ్మని పాట రాజు చెవిలో పడింది. వెంటనే 'ఆ పాట పాడే కోకిలను వెంటనే తీసుకురండి' అని భటులను ఆజ్ఞాపించాడు. భటులు చాలా శ్రమకోర్చి ఆ కోకిలను తీసుకొని వస్తారు.

కోకిల ఊర్లో పెరగడంతో మనుషుల భాష దానికి తెలుసు. మహారాజుకు నమస్కారం చేసింది. 'ఒక కమ్మని పాట పాడు' అని మహారాజు కోకిలని అడుగుతాడు. కోకిల తీయని రాగం తీస్తూ పాట పాడుతుంటే... 'కోకిలపై మనసు పడి, తనను ఎక్కడ వదిలేస్తాడో' అని పక్కనే ఉన్న కోతి చిన్న రాయిని తీసుకొని కోకిలపై వేసింది. కోకిలకి దెబ్బ తగిలి రక్తం వచ్చింది. ఆ దృశ్యం చూడగానే మహారాజుకు కోపం వచ్చింది. 'కోతిని కొరడా దెబ్బలతో శిక్షించండి' అని భటులను ఆజ్ఞాపించాడు. అప్పుడు కోకిల వెంటనే 'కోతిది కూడా ప్రాణమే కదా! ఈ ఒక్కసారికి మన్నించండి. మీ కోటలో నాతోపాటు ఉంటుంది' అని మహారాజును వేడుకుంది. తనకు చెడు చేసినా తన మంచినే కోరుకున్న కోకిల స్నేహాన్ని ఆ రోజు నుండి కోతి ఎప్పుడూ వదలలేదు.

- వి.సంపత్ కుమార్,
9వ తరగతి, జెడ్‌పిహెచ్ఎస్, కోదాడ జిల్లా,
సూర్యాపేట, 63053 93291.



చుక్కలు కలపండి

పిల్లలూ, ఇక్కడ అంకెలు, సంఖ్యల పక్కన ఉన్న చుక్కలను ఒకదాని తర్వాత ఒకటి కలుపుతూ వెళితే అందమైన పక్షుల బొమ్మలు వస్తాయి. ట్రై చేయండి.

నేను గీసిన బొమ్మ

జె.వర్షిత్,
7వ తరగతి,
జెడ్‌పిహెచ్ఎస్,
దౌల్తాబాద్,
సిద్దిపేట జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పారిస్‌లో తెలుగు పరుగులు

విశ్వక్రీడా సంబరాలు ఈనెల 26 నుంచి ఆగస్టు 11 వరకూ ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో జరగనున్నాయి. పారిస్ ఒలింపిక్స్ పేరుతో జరగనున్న ఈ పోటీలకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక దేశాల నుంచి క్రీడాకారులు హాజరవుతున్నారు. 117 మంది ఆటగాళ్లతో కూడిన భారత ఒలింపిక్ జట్టులో ఇద్దరు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన క్రీడాకారిణులు ఉన్నారు. వాళ్లిద్దరూ జ్యోతి యర్రాజి, దండి జ్యోతిక శ్రీ.

ఇద్దరూ పరుగుల రాణులే...

విశాఖపట్టణానికి చెందిన అథ్లెట్ జ్యోతి యర్రాజీ (24), పశ్చిమ గోదావరి జిల్లా తణుకు చెందిన దండి జ్యోతిక శ్రీ (23) పారిస్‌కి బయలు దేరి వెళ్లారు. నాన్న స్ఫూర్తితో ఒకరు, అమ్మ తపనే ప్రేరణగా మరొకరు బరిలో దిగనున్నారు. మహిళల 100 మీటర్ల పరుగుపందెంలో జ్యోతి పాల్గొంటోంది. 400 మీటర్ల రిలే బృందంలో జ్యోతిక శ్రీ పాల్గొంటోంది. ఈ ఇద్దరూ అత్యంత కుటుంబాల నుంచి వచ్చిన ఆణిముత్యాలే!

నాన్న స్ఫూర్తితో ...

దండి జ్యోతికది పేద కుటుంబం. తండ్రి శ్రీనివాసరావు మాజీ వెయిట్‌లిఫ్టర్. తల్లి గృహిణి. జ్యోతిక డాక్టర్ కావాలనుకుంది. తండ్రి కోరిక మేరకు మొదట్లో ఇష్టం లేకపోయినా తన అభిరుచిని మార్చుకుని అథ్లెటిక్స్ వైపు మొగ్గుచూపింది. బహామాస్‌లో జరిగిన ఫైనల్ క్వాలిఫికేషన్‌లో 51.36 సెకన్ల టైమింగ్‌తో దూసుకెళ్లిన జ్యోతిక ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. తండ్రి శ్రీనివాసరావు కూడా గతంలో పరుగుపందేల్లో పాల్గొనేవారు. ఆ తర్వాత బాడీబిల్డర్‌గా మారారు. తన ఇద్దరు కుమార్తెల్లో ఒకరినైనా క్రీడల్లో ప్రోత్సహించాలని భావించిన ఆయన చిన్న కుమార్తె జ్యోతిక స్కూల్లో వేగంగా పరుగెత్తటాన్ని గమనించి ఆమెను ట్రాక్‌వైపు నడిపించారు. 13 ఏళ్ల వయస్సులోనే జ్యోతిక తన తండ్రి దగ్గర సాధన ప్రారంభించింది. రన్నర్‌గా ఎదిగింది. 2016 నుంచి 2020 వరకూ విజయవాడలో శాయ్ కోచ్ వినాయక్ ప్రసాద్ శిక్షణలో మెరుగుదల సాధించింది. తర్వాత హైదరాబాద్‌లో గోపీచంద్ మైత్రా అథ్లెటిక్స్ ప్రాజెక్టులో భాగంగా ప్రముఖ కోచ్ నాగపురి రమేష్ దగ్గర సాధన చేసి అంచెలంచెలుగా ఎదిగింది. వ్యక్తిగత విభాగంతోపాటు రిలే పరుగులోనూ సత్తా చాటుతోంది.

కఠోర శ్రమతో ...

2017 ప్రపంచ యూత్ అథ్లెటిక్స్ 0చాంఫియన్‌షిప్స్‌లో 400 మీ. రిలేలో ప్రాతినిధ్యం వహించింది జ్యోతిక. 2021లో అండర్ 23 మహిళల 400 మీటర్ల పరుగులో చాంఫియన్‌గా నిలిచింది. జాతీయ ఓపెన్ అథ్లెటిక్స్ చాంఫియన్‌షిప్స్, ఇండియన్ గ్రాండ్ ప్రి-2, 4 పోటీల్లో బంగారు పతకాలు గెలిచింది. ఆసియన్ అథ్లెటిక్స్ చాంఫియన్‌షిప్, వరల్డ్ రిలే చాంపియన్ షిప్‌ల్లో సత్తా చాటి తాజాగా ఒలింపిక్స్ అర్హత సాధించింది.

గెలుపే లక్ష్యం

ఒలింపిక్స్ క్రీడల్లో గెలుపు లక్ష్యంగా కృషిచేస్తున్నా. నాకు పరుగులో పోటీపడటమే ఇష్టం. రిలేలోనూ ఉత్తమ ప్రదర్శన చేస్తుండటం సంతోషంగా ఉంది. నాన్న ప్రోత్సాహంతో పరుగు మొదలు పెట్టా. ఇప్పటివరకూ పోటీ ఏదైనా పతకం సాధించాలనే లక్ష్యంతోనే పరుగు తీశా. ఆ స్ఫూర్తితోనే ఎక్కువ దూరం వేగంగా పరుగెత్తటాన్ని అలవాటు చేసుకున్నా. ఒలింపిక్స్‌లో గెలిచి దేశం గర్వపడేలా కృషిచేయటమే నా లక్ష్యం. అండగా నిలుస్తున్న కోచ్‌లకు, నాన్నకు ధన్యవాదాలు.

- దండి జ్యోతిక శ్రీ

అమ్మ తపనే ప్రేరణగా..

విశాఖపట్టణంలో పేద కుటుంబంలో జన్మించిన యర్రాజి జ్యోతి విశ్వక్రీడల స్థాయికి చేరుకోవటానికి తీవ్రంగా శ్రమించింది. అనేక కష్టనష్టాలను ఎదుర్కొంది. తండ్రి సూర్యనారాయణ ప్రయివేట్ సెక్యూరిటీ గార్డు. తల్లి కుమారి కష్టం కూడా ఇందులో దాగుంది. తల్లి అండతోనే ఆమె భారత టాప్ అథ్లెట్‌గా జ్యోతి ఎదిగింది. చిన్నప్పటి నుంచి ఆమెకు క్రీడలంటే ఎంతో ఇష్టమై ఆసక్తి ఉన్నా కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించలేదు. ఎన్ని కష్టాలున్నా 'నీకు నేనున్నా..'నంటూ తల్లి ఇచ్చిన ప్రోత్సాహంతో ముందుకు సాగింది. కుమార్తె కోసం ఇళ్లల్లో గతంలో చేసే పనులను రెట్టింపు చేసుకుని భరోసా ఇచ్చింది. స్థానిక ఆసుపత్రిలో క్లీనింగ్ విభాగంలో కూడా తల్లి పనిచేసేది. తల్లి కష్టం వృథా చేయకుండా జ్యోతి తీవ్రంగా శ్రమించింది.

బరిలోకి దిగకముందే జ్యోతి రికార్డు సృష్టించింది. ఒలింపిక్స్‌లో 100 మీటర్ల హర్డిల్స్‌లో మన దేశం నుంచి పోటీ పడుతున్న మొదటి అథ్లెట్‌గా రికార్డు సృష్టించింది. వరల్డ్ ర్యాంకింగ్స్ కోటాలో మెరుగైన సత్తాను ప్రదర్శించి, పారిస్ ఒలింపిక్స్‌లో స్థానం పొందింది.

దీనికిముందు 100 మీటర్ల హర్డిల్స్‌లో 12.78 సెకన్లతో రికార్డును తిరగరాసింది. జ్యోతి మంచి అథ్లెట్‌గా ఎదగటానికి తల్లి కష్టంతోపాటుగా కోచ్ జేమ్స్ హీలియర్ కూడా ప్రధాన పాత్ర పోషించారు.

ఆర్థిక ఇబ్బందులు ఎన్నున్నా ...

జ్యోతికి చిన్నతనం నుంచే క్రీడలంటే ఆసక్తి. ఆమెకు పరుగుపై ఉన్న ఆసక్తిని పిఇటి రెడ్డి తొలుత గుర్తించి ప్రోత్సహించారు. తండ్రికి నెలంతా కష్టపడితే ఏడెనిమిది వేలు రాని దుస్థితి. కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుండటం చూసిన జ్యోతి ఎంతో ఆవేదనకు గురయ్యేది. ఎలాగైనా కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరచాలని, ఏదొకటి సాధించాలని పాల్గొన్న ప్రతి పోటీలోనూ సత్తా చాటుతోంది. 2015లో అథ్లెటిక్స్ క్రీడలో ప్రవేశించింది. 2023లో కజికిస్థాన్‌లో జరిగిన ఏషియన్ ఇండోర్ అథ్లెటిక్స్ పోటీల్లో రజిత పతకం గెలుపొందింది. 60 మీటర్ల హర్డిల్స్‌ను 8.10 సెకన్లలో పూర్తి చేసి ఈ ఘనత సాధించింది. హర్డిల్స్‌తో పాటు 100, 200 మీటర్ల పరుగులో సైతం పతకాలు గెలుపొందింది, రాంచీలో ఈ ఏడాది మే 15 - 18 మధ్య జరిగిన ఫెడరేషన్ కప్ జాతీయ స్థాయి పోటీల్లో 100, 200 మీటర్ల హర్డిల్స్‌లో గెలుపొంది ఔరా అనిపించింది. 100 మీటర్ల హర్డిల్స్‌లో 12.89 సెకన్లలో పరుగుతీసి కొత్త రికార్డు నెలకొల్పింది.

సత్తా చాటుతా ...

విశ్వక్రీడల్లో పాల్గొనటం ఇదే మొదటిసారి. శక్తినంతా కూడదీసుకుని పతకమే లక్ష్యంగా కృషిచేస్తా. భారతదేశ కీర్తిపతాకాన్ని మరింత ఇనుమడింపజేయాలనేదే నా ధ్యేయం. ఏషియన్ గేమ్స్, ఏషియన్ చాంఫియన్‌షిప్స్, వరల్డ్ చాంఫియన్స్ వంటి మెగా టోర్నీలో పోటీపడ్డా. ఒలింపిక్స్‌ను జయించగలననే నమ్మకం నాకుంది.

- జ్యోతి యర్రాజీ

ఆగస్టు 2న 'వాస్కోడగామా'

'బాయ్స్' చిత్ర ఫేమ్ నకుల్ హీరోగా 'వాస్కోడగామా' అనే చిత్రం తెరకెక్కింది. ఈ సినిమాను ఆగస్టు 2న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రాన్ని 44 మంది నటులతో 41 రోజుల్లో చిత్రీకంచామని దర్శకుడు ఆర్జీకే తెలిపారు. ఈ సినిమాను 5656 ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మాత దత్తో బి.సుభాస్కరన్ నిర్మించారు. ఈ సినిమాలో సీనియర్ నటి దేవయాని ముఖ్య పాత్రను పోషించారు. ఇతర పాత్రల్లో కేఎస్ రవికుమార్, ఆర్థనా బిను, వంశీ కృష్ణ, ఆనంద్ రాజ్, మన్సూర్ అలీఖాన్, తదితరులు నటించారు. అరుణ్ ఎన్‌వీ సంగీతం అందించారు. ఇటీవల మూవీ ఆడియో, ట్రైలర్‌ను చెన్నైలో రిలీజ్ చేశారు.

డిజాస్టర్స్ బాధించాయి

'ప్రతి సినిమా వెనుక ఎంతో కష్టం దాగుంటుంది. అలాంటిది ఏదైనా చిత్రం బాక్సాఫీస్ వద్ద ఫెయిల్ అయ్యిందంటే ఎవరికైనా మనస్సు ముక్కలవుతుంది. ఫెయిల్యూర్స్‌తో కొంత బాధ ఉండటం సహజం. కాని కొన్ని గుణపాఠాలు కూడా నేర్పుతాయి. సక్సెస్ ఎంత అవసరమనేది గుర్తుచేస్తాయి. విజయాన్ని అందుకోవాలనే ఆకలిని పెంచుతాయి. కెరీర్ ప్రారంభంలోనే జయాపజయాలను ఎలా డీల్ చేయాలనేది నేర్చుకున్నా. సినిమా కోసం ఎంత కష్టడపతాం.. ఎంత అద్భుతంగా మలుస్తామనేది మాత్రమే మన నియంత్రణలో ఉంటుంది' అని బాలీవుడ్ హీరో అక్షయ్‌కుమార్ అన్నారు. ఈ ఏడాది ఆరంభంలో వచ్చిన 'బడేమియా..చోటేమియా', తాజా చిత్రం 'సర్ఫిరా' బాక్సాఫీసు వద్ద వరుస పరాజయాలతో ఆయన ఒకింత నిరాశకు గురయ్యారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో అక్షయ్‌కుమార్ పై విధంగా వ్యాఖ్యానించారు.

ఆగస్టు 2న 'ఉలజ్' విడుదల

బాలీవుడ్ నటి జాన్వీకపూర్ నటించిన 'ఉలజ్' మూవీ విడుదలకు సిద్ధమైంది. ఇటీవలే 'మిస్టర్ అండ్ మిసెస్ మాహీ'తో ఆమె అలరించిన విషయం తెలిసిందే. ఉలజ్ మూవీలో యువ దౌత్యవేత్తగా ఆమె నటించారు. సుధాన్షు సరియా దర్శకత్వం వహించారు. ఆగస్టు 2న ఈ సినిమా విడుదల కానుండటంతో చిత్రబృందం ప్రమోషన్లలో బిజీగా ఉంది. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్స్ తాను చెప్పిన విషయాన్ని గుర్తుంచుకుని పాటిస్తున్నారని వివరించింది. గతంలో మహీ మూవీ ప్రమోషన్లలో భాగంగా తన ఫొటోలను వెనుకవైపు నుంచి బ్యాడ్‌గా తీయొద్దని కోరినట్లు తెలిపింది. ఉలజ్‌లో ఆదిల్ హుస్సేన్, మీయాంగ్ చాంగ్, గుల్షన్ దేవయ్య, రోషన్ మాథ్యూ, రాజేంద్రగుప్తా, జితేంద్ర జోషి కీలక పాత్రల్లో నటించారు.

ఆగస్టు 30న 'అహో.. విక్రమార్క'

నటుడు దేవ్‌గిల్ హీరోగా 'అహో.. విక్రమార్క' సినిమా నిర్మితమవుతోంది. తన సొంత బ్యానర్ దేవ్‌గిల్ ప్రొడక్షన్స్ సమర్పణలో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. పేట త్రికోటి దర్శకత్వం వహిస్తున్నారు. ఆర్తీ దేవేందర్‌గిల్, మహిర్ కులకర్ణి, అశ్వినికుమార్ మిశ్రా నిర్మిస్తున్నారు. పెన్మెత్స ప్రసాద్‌వర్మ కథ, రవి బస్రూర్, ఆర్కో ప్రావో ముఖర్జీ సంగీతాన్ని అందించారు. తమ్మిరాజు ఎడిటర్. షియాజీషిండే, ప్రవీణ్ తార్దే, తేజస్విని పండిట్, చిత్ర శుక్లా, ప్రభాకర్, విక్రమ్ శర్మ, బిత్తిరి సత్తి తదితరులు తారాగణం.

మరో 18 ఛానెళ్లపై 'మా' నిషేధం

మూవీ ఆర్టిస్టుల మీద సోషల్ మీడియా ట్రోలింగ్‌కి సంబంధించి మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా) చాలా సీరియస్‌గా స్పందిస్తోంది. ఈ మధ్యనే ఐదు యూట్యూబ్ ఛానల్స్ మీద సైబర్ క్రైమ్ డిపార్ట్మెంట్ ద్వారా చర్యలు తీసుకున్నారు. ఆ ఐదు చానల్స్‌ని పూర్తిగా తొలగించారు. ఇప్పుడు మరొక 18 చానల్స్‌ని తొలగిస్తూ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ నిర్ణయం తీసుకుంది. వాటి పేర్లు, యూట్యూబ్ ఛానల్ యుఆర్ఎల్స్‌ని సోషల్ మీడియాలో షేర్ చేసింది. సినిమా ఆర్టిస్టుల మీద, వాళ్ల వ్యక్తిగత జీవితాలను ఇబ్బంది పెట్టే విధంగా ఉన్న కంటెంట్‌ని తాము తొలగిస్తున్నామని వెల్లడించింది. 'ఇబ్బందికరంగా ఉన్న ట్రోల్ వీడియోస్ మీద ఒక రిపోర్ట్ తయారు చేసి సైబర్ క్రైమ్ ఆఫీస్‌కి అందచేయబోతున్నాం. నటీనటులను కించపరిచే వీడియోలను తొలగించాల్సిందిగా ఇతర ఛానెళ్లను కూడా హెచ్చరిస్తున్నాం." అని 'మా' పేర్కొంది.

చిరంజీవి పుట్టిన రోజున 'ఇంద్ర'

2002లో విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన చిత్రం 'ఇంద్ర'. బి.గోపాల్ దర్శకత్వంలో ఈ సినిమాను తెరకెక్కించారు. ఇందులో ఆర్తి అగర్వాల్, సోనాలీబింద్రే చిరంజీవి నరసన హీరోయిన్లుగా నటించారు. వైజయంతి మూవీస్ బ్యానర్‌పై అశ్వనీదత్ నిర్మించారు. వైజయంతి మూవీస్ స్థాపించి ఆగస్టు 22 నాటికి 50 సంవత్సరాలు పూర్తికానుంది. ఈ నేపథ్యంలోనే స్వర్ణోత్సవాల వేడుకతోపాటు చిరంజీవి పుట్టినరోజు కావటంతో 'ఇంద్ర' సినిమాను మరోసారి తెలుగు ప్రేక్షకుల కోసం మళ్లీ తీసుకొస్తున్నారు. రీ రిలీజ్ విషయాన్ని వైజయంతి మూవీస్ తన ట్విట్టర్ ద్వారా వెల్లడించింది.

సెమీస్‌లో భారత్ ప్రత్యర్థి బంగ్లాదేశ్

ఆసియాకప్ మహిళల క్రికెట్ టోర్నీ

దంబుల్లా (శ్రీలంక): ఆసియాకప్ మహిళల క్రికెట్ టోర్నీలో లీగ్ పోటీలు ముగిసాయి. గ్రూప్-ఎ నుంచి భారత్, పాకిస్తాన్, గ్రూప్-బి నుంచి శ్రీలంక, బంగ్లాదేశ్ జట్లు సెమీస్‌కు చేరాయి. గ్రూప్-ఎలో టాప్‌లో ఉన్న భారతజట్టు గ్రూప్-బిలో 2వ స్థానంలో ఉన్న బంగ్లాదేశ్‌తో తొలి సెమీస్‌లో తలపడనుంది. రెండో సెమీస్ పాకిస్తాన్-శ్రీలంక జట్ల మధ్య జరగనుంది. ఆసియాకప్‌లో భారత జట్టుకు అద్భుత ట్రాక్ రికార్డు ఉంది. ఈ టైటిల్‌ను ఏకంగా 7సార్లు చేజిక్కించకున్న భారత్.. ఒక్కసారి మాత్రమే రన్నరప్‌తో సరిపుచ్చుకుంది. డిఫెడింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన టీమిండియా.. లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచుల్లోనూ గెలిచింది.

శ్రీలంక, బంగ్లాదేశ్ గెలుపు...

గ్రూప్-బిలో బుధవారం జరిగిన చివరి లీగ్ మ్యాచుల్లో బంగ్లాదేశ్, శ్రీలంక జట్లు విజయం సాధించాయి. బంగ్లాదేశ్ జట్టు 114పరుగుల తేడాతో మలేషియాపై ఘన విజయం సాధించగా.. శ్రీలంక జట్టు 10వికెట్ల తేడాతో థాయ్‌లాండ్స్‌పై గెలిచి సెమీస్‌కు చేరింది.

రేపటినుంచి పారిస్ ఒలింపిక్స్

- **నేడు ఆర్చరీలో భారత్ ప్రదర్శన**

పారిస్: పారిస్ ఒలింపిక్స్ రేపటినుంచి ప్రారంభం కానున్నాయి. శుక్రవారం ప్రారంభోత్సవ వేడుకలు జరగనుండగా.. ఒకరోజు ముందే ఫుట్‌బాల్, ఆర్చరీ పోటీలు ప్రారంభమైపోయాయి. మహిళల ఆర్చరీ వ్యక్తిగత ర్యాంకింగ్స్ రౌండ్‌లో భారత ఆర్చర్లు గురువారం తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. భారత ఆర్చర్లు దీపిక కుమారి, అంకిత భగత్, భజన్ కౌర్ గ్రూప్ తొలి లీగ్‌లో పోటీపడనున్నారు. ఇక పురుషుల వ్యక్తిగత ర్యాంకింగ్ రౌండ్‌లో బి. ధీరజ్, తరుణ్‌దీప్, ప్రవీణ్ జాదవ్ కూడా ఆడనున్నారు. శనివారం నుంచి బ్యాడ్మింటన్, రోయింగ్, షూటింగ్, హాకీ పోటీల బరిలో తలపడనున్నారు. ఇక పురుషుల హాకీ జట్టు 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించింది. దీంతో 41ఏళ్ల తర్వాత ఒలింపిక్స్‌లో భారత్ ఈ క్రీడాంశంలో పతకం కొట్టి రికార్డు నెలకొల్పింది. ఇటీవలికాలంలో భారత పురుషుల హాకీ జట్టు అద్భుత విజయాలనుాునమోదు చేసుకొని టాప్-5ర్యాంక్‌లో నిలవడంతో ఈసారి పతకం ఖాయంగా కనబడుతోంది.

హాకీలో క్వార్టర్‌ఫైనల్‌కు చేరడం ఖాయం

గ్రూప్-బిలో భారత పురుషుల హాకీ జట్టు క్వార్టర్‌ఫైనల్‌కు చేరడం ఖాయంగా కనబడుతోంది. ఈ గ్రూప్‌లో ఉన్న భారత్ లీగ్ దశలో ఐదు మ్యాచ్‌లు ఆడనుండగా.. మూడు మ్యాచుల్లో గెలిస్తే క్వార్టర్స్ బెర్త్ ఖాయం కానుంది. భారత్ ఉన్న గ్రూప్‌లోనే న్యూజిలాండ్, అర్జెంటీనా, ఐర్లాండ్ జట్లు ఉన్నాయి. ఈ మూడు మ్యాచుల్లో భారత్‌కు పెద్ద ప్రతిఘటన ఎదురుకాకపోవచ్చు. చివరి రెండు మ్యాచ్‌లలో తన కంటే మెరుగైన ర్యాంకు కలిగిన ఆస్ట్రేలియా, బెల్జియంతో తలపడనుంది. ప్రతి గ్రూప్‌లో టాప్-4లో నిలిచిన జట్లు క్వార్టర్‌ఫైనల్‌కు చేరనున్నాయి. ఇక గ్రూప్-ఎలో బ్రిటన్, స్పెయిన్, నెదర్లాండ్స్, దక్షిణాఫ్రికా, జర్మనీ జట్లు ఉన్నాయి.

షూటర్లపైనే ఆశలు..

పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌నుంచి ఈసారి అత్యధికంగా షూటర్లు అర్హత సాధించారు. గతంలో అభినవ్ బింద్రా, రాజ్యవర్ధన్‌సింగ్ రాథోడ్(ట్రాప్) విభాగా ల్లో పతకాలు సాధించగా..ఆ తర్వాత ఈ విభాగంలో భారత్‌కు పెద్దగా పతకాలు దక్కలేదు.

అర్జెంటీనాను నిలువరించిన మొరాకో



పురుషుల ఫుట్‌బాల్‌లో భాగంగా అర్జెంటీనా-మొరాకో జట్ల మధ్య జరిగిన గ్రూప్ లీగ్ మ్యాచ్ 2-2గోల్స్‌తో డ్రా అయ్యింది. గ్రూప్-బి ఉన్న అర్జెంటీనా జట్టు చివరి నిమిషంలో ఒక గోల్ కొట్టి మ్యాచ్‌ను డ్రా చేసుకొని ఊపిరి పీల్చుకుంది. ఇక గ్రూప్-సిలో స్పెయిన్ జట్టు 2-1గోల్స్‌తో ఉజ్బెకిస్తాన్‌పై గెలు పొందగా.. గ్రూప్-ఎలో గునియా-న్యూజిలాండ్, గ్రూప్-సిలో ఈజిప్ట్- ద.కొరియా జట్ల మధ్య జరిగిన గ్రూప్ లీగ్ మ్యాచ్‌లు 0-0తో డ్రాగా ముగిసాయి.

పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనే భారత్ పాల్గొనే క్రీడాంశాలు..

పురుషుల రికర్వు: ధీరజ్ బొమ్మదేవర, తరుణ్‌దీప్ రాయ్, ప్రవీణ్ జాదవ్
మహిళల రికర్వు: భజన్ కౌర్, దీపిక కుమారి, అంకిత భకత్
అథ్లెటిక్స్...
జావెలిన్ త్రో: నీరజ్ కుమార్, కిషోర్ కుమార్ జెనా, అన్ను రాణి
పురుషుల లాంగ్‌జంప్: జాస్విన్ అల్డ్రిన్
3వేల మీ. స్టీపుల్ ఛేజ్: పారుల్ చౌదరి, అవినాశ్ సేబల్
20కి.మీ. రేస్‌వాక్: ప్రియాంక గోస్వామి, ఆకాశ్ దీప్ సింగ్, రాంబాబూ, ఆర్ష్‌ప్రతీ సింగ్, వికాశ్ సింగ్, పరమ్‌జీత్ బిస్ట్, సూరజ్ పన్వార్
మారథాన్ రేస్‌వాక్(మిక్స్‌డ్): ప్రియాంక గోస్వామి-సూరజ్ పన్వార్
400మీ. పరుగు: కిరణ్ పాహల్, **100మీ. హార్డిల్స్:** జ్యోతి యర్రాజి
షాట్‌పుట్: అభా ఖతువా. తేజిందర్ పాల్‌సింగ్ థోర్,
హైజంప్: సర్వేష్ కుషారే
ట్రిపుల్ జంప్: అబ్దుల్లా అబూబకర్, ప్రవేల్ చిత్రవేల్
5వేల మీ.పరుగు: అంకిత దయాని,
4×400మీ. రిలే: (మ) రూపుల్ ఛౌదరి, పూవమ్మ, జ్యోతిక, శుభ (పు) మహ్మద్ అనాస్, అజ్మల్, అరోకియా, జాకోబ్
బ్యాడ్మింటన్ (సింగిల్స్): పివి సింధు, హెచ్ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్ **(డబుల్స్):** అశ్విని పొన్నప్ప-తానీషా కాస్ట్రో, చిరాగ్‌శెట్టి-సాత్విక్
బాక్సింగ్: బోర్గొహైన్(75కి.), నిఖత్ జరీన్(50కి.), ప్రీతి పన్వార్(54కి.), జాస్మినే(57కి.), నిషాంత్ దేవ్(71కి.), అమిత్(51కి.)
ఈక్వెస్ట్రియన్: అనుష్ అగర్వాల్లా (వ్యక్తిగత డ్రెస్సేజ్)
గోల్ఫ్: శుభాంకర్, గగన్‌జీత్, అదితి అశోక్, దీక్షా దగర్
హాకీ: భారత పురుషుల హాకీ జట్టు **బాక్సింగ్:** బోర్గొహైన్(75కి.),
జూడో: తులికా మాన్(మహిళల 78కి.) **రోయింగ్:** బల్‌రాజ్ పన్వార్(ఎం1×)
సెయిలింగ్: విష్ణు శరవనమ్, బల్‌రాజ్, నేత్ర కుమ్మనన్
స్విమ్మింగ్: శ్రీహరి నటరాజ్(100మీ. బ్యాక్‌స్ట్రోక్), ధీనిధి(200మీ. ఫ్రీస్టైల్), అమన్ సెహ్రావత్(ఫ్రీస్టైల్)
టేబుల్ టెన్నిస్ టీమ్: భారత పురుషుల, మహిళల జట్లు
టెన్నిస్: బొప్పన్న- బాలాజీ(డబుల్స్), సుమిత్ నాగల్(సింగిల్స్)
వెయిట్ లిఫ్టింగ్: మీరాభాయ్ ఛాను(మహిళల 49కి.)
రెజ్లింగ్: వినేశ్ పోగాల్(50కి.), అమిత్(53కి.), అన్షు(75కి.), నిషా(68కి.), రీతిక(76కి.)
షూటింగ్: పృథ్వీరాజ్(ట్రాప్), సందీప్ సింగ్(10మీ. ఎయిర్‌రైఫిల్, మిక్స్‌డ్), స్వప్నిల్ కుశాలే(50మీ. రైఫిల్ 3పి), ఐశ్వరీ ప్రతాప్ సింగ్(50మీ. రైఫిల్ 3పి), ఈలవేనిల్ వలరివాన్(10మీ. ఎయిర్‌రైఫిల్, మిక్స్‌డ్), స్విఫ్ట్ కౌర్(50మీ. రైఫిల్ 3పి), రాజేశ్వరి (మహిళల ట్రాప్), సరభ్‌జ్యోత్(10మీ. ఎయిర్ పిస్టల్, మిక్స్‌డ్), అంజున్(10మీ. ఎయిర్ రైఫిల్, మిక్స్‌డ్), రమిత జిందాల్(10మీ. ఎయిర్ రైఫిల్, మిక్స్‌డ్), మను భకర్(10మీ. ఎయిర్ పిస్టల్, మిక్స్‌డ్, 25మీ. పిస్టోల్), అనీశ్ భన్వాలా(25మీ. ర్యాపిడ్ ఫైర్), అంజుమ్(50మీ. రైఫిల్ 3పి), అర్జున్ ఛీమా(10మీ. ఎయిర్ పిస్టల్, మిక్స్‌డ్), ఈషా సింగ్(25మీ. పిస్టల్), రిథమ్ సంఘ్వాన్(10మీ. ఎయిర్ స్టల్, మిక్స్‌డ్), విజయ్‌వీర్ సింధు(25మీ. ర్యాపిడ్ ఫైర్), రిజా ధిల్లాన్(స్కీట్), అమన్‌జీత్(స్కీట్, మిక్స్‌డ్), శ్రేయసి సింగ్(ట్రాప్), మహేశ్వరి(స్కీట్, మిక్స్‌డ్).

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68